
# ఆపన్నులకు అమృతహస్తం

## డాక్టర్ నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్ జీవితచరిత్ర



డా. అరవింద్ యాదవ్

# ఆపన్నులకు అమృతహస్తం

**డాక్టర్ నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్ జీవితచరిత్ర**

**మొదటి ముద్రణ:**
మార్చి, 2022


© **కాపీరైట్స్:**
డా. అరవింద్ యాదవ్

**పబ్లిషర్:**
డా. అరవింద్ యాదవ్

**బుక్ డిజైనింగ్:**
వెన్నా కాశిరెడ్డి
సుమతీ డిజైన్స్, డి.డి. కాలనీ, హైదరాబాద్.
సెల్: 9652 320 538
sumathidesigns311@gmail.com

**ప్రింటింగ్:**
ఎస్.ఆర్. ప్రింటర్స్,
ఖైరతాబాద్, హైదరాబాద్ – 500004
సెల్: 9701 466 492

# అంకితం



కీ॥శే॥ జి. రమేష్

**నా సహచరుడు, ఆత్మీయుడు మరియు నాకు వెన్నుదన్నుగా ఉన్న**
**నా ఆప్తమిత్రుడు జి. రమేష్ ఇంత త్వరగా మనల్ని వదిలి వెళ్ళడం చాలా బాధాకరం.**
**నీ జ్ఞాపకాల రూపంలో.. మా హృదయాలలో.. ఎప్పుడూ ప్రకాశిస్తూనే ఉంటావు.**

# ప్రత్యేక కృతజ్ఞతలు

రత్నపురపు శ్రీనివాస్

మిట్టగడపల రత్నకుమార్

వెన్నా కాశిరెడ్డి

# విషయ సూచిక

| | | |
|---|---|---|
| 1. | జననం: ప్రాపంచిక పరిణామ కాలంలో ఆగమనం | 01 |
| 2. | విధిరాత: డాక్టర్‌గా కర్తవ్యపాలన, కుటుంబ దుస్థితి | 08 |
| 3. | సంకల్పం: పిల్లల కోసం మాతృమూర్తి ప్రతిజ్ఞ | 11 |
| 4. | తొలగిన భ్రమలు: భయంగొల్పే అవరోధాలను ఎదుర్కోవడం | 14 |
| 5. | తలుపు తట్టిన అదృష్ట దేవత: కుటుంబానికి కొత్త అవకాశం | 17 |
| 6. | అభ్యాసం: వైద్యశాస్త్రం చదివేందుకు నిద్రలేని రాత్రులు | 22 |
| 7. | ప్రణయతీరం: రహస్యంగా చేరిన ప్రేమరాగం | 25 |
| 8. | కేడెట్‌గా జీవితం: ఎన్‌సీసీ ద్వారా ఆదర్శ పురుషుడిగా మారడం | 27 |
| 9. | ప్రత్యేక అనుభవం: ప్రయోజనకరంగా నిలిచిన ఉపన్యాసాలు | 29 |
| 10. | కొన్ని మైలురాళ్లు: భర్తగా, హౌస్ సర్జన్‌గా మారడం | 31 |
| 11. | ఉద్యోగం: రైల్వే శాఖలో విధి నిర్వహణ | 35 |
| 12. | రెక్కలు: దృఢసంకల్పంతో అమెరికాకు పయనం | 38 |
| 13. | గమ్యస్థానం: స్వల్పకాలంలోనే అమెరికాతో మమేకం | 40 |
| 14. | కాఠిన్యం: రెసిడెంట్ డాక్టరుగా కఠోర శ్రమ | 43 |
| 15. | ద్వితీయ ఆశీస్సు: విధి నిర్వహణలో ఉండగా శుభవార్త | 45 |
| 16. | ఖ్యాతి: బరువు తగ్గించే సర్జరీ ద్వారా గుర్తింపు పొందడం | 47 |

| | | |
|---|---|---|
| 17. | పెట్టుబడి: మన్మోహన్ సింగ్ విధానాల ప్రభావం | 51 |
| 18. | వ్యవస్థాపకత: విజయవంతంగా కష్టాలను అధిగమించడం | 53 |
| 19. | పాఠాలు: వ్యాపారంలో ఒడిదొడుకుల ద్వారా గుణపాఠాలు | 55 |
| 20. | తీరని శోకం: ప్రియమైన పుత్రుడిని కోల్పోవడం | 58 |
| 21. | సాఫల్యం: ఎట్టకేలకు సాకారమైన కల | 63 |
| 22. | మునుముందుకు, పైపైకి: భారత్‌లో లాభదాయకంగా మారిన అమెరికా అనుభవం | 65 |
| 23. | బ్యాంకర్‌గా విజయం: కోట్ల డాలర్ల లాభార్జన | 67 |
| 24. | పవిత్రకార్యం: సాంస్కృతిక విలువల పరిరక్షణ | 71 |
| 25. | సంతృప్తి: ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కాలేజీ విజయాలు | 75 |
| 26. | అవగతం: అవకాశాలకు అమెరికా నెలవు | 77 |
| 27. | వేదన: బాధాకరమైన వీడ్కోలు | 79 |
| 28. | తుది మజిలీ: జీవితం సామాజిక సేవకు అంకితం | 81 |

# పరిచయం

జీవితం మనకు ఎన్నో పాఠాలు నేర్పుతుంది. ఈ నేలపై జీవించినంత కాలం పాఠాలు నేర్చుకోవాల్సిందే. స్వీయానుభవాలతో నేర్చుకునే పాఠాలు కొన్నైతే, ఇతరులను చూసి నేర్చుకునేవి మరికొన్ని ఉంటాయి. కానీ కొంత మంది స్వీయ తప్పిదాలతో జీవితంలో ముఖ్యమైన పాఠాలు నేర్చుకుంటూ ఉంటారు. కాబట్టి, చేసిన తప్పులు మళ్లీ చేయని వారే గొప్పవారనడం సబబు కాదేమో. ఘోర తప్పిదాలతో నేర్చుకున్న పాఠాలు చాలా కటువుగా ఉంటాయన్నది వాస్తవం. అవి వారి మనస్సుల్లో ఒక చెరగని ముద్రగా నిలిచిపోతాయి. అలాంటి పాఠాలు కూడా మనం మర్చిపోయామంటే అదే అతి పెద్ద తప్పుగా అభివర్ణించవచ్చు.

ఓడిపోవడం ఎవరికీ ఇష్టముండదు. కానీ ఈ ప్రపంచంలో చాలా మంది తమ జీవితంలో వచ్చే పోరాటాలను ఎదుర్కోలేక సులభంగా ఓటమిగా అంగీకరిస్తారు. రాబోయే కాలంలో ఎలాంటి కష్టనష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందోననే భయంతో కలల సాకారానికి కనీస ప్రయత్నం కూడా చేయలేరు. అనూహ్యమైనది, గొప్పది సాధించాలనే తపన అలాంటి వారిలో ఉండదు. వారిలో ఉన్న భయమే వారిని వెనక్కి పట్టిలాగుతుంది. ప్రతికూల పరిస్థితులు ఉంటాయనే ఆలోచనే వారిని కలవరపరిచేలా చేస్తుంది. ఆట మొదలుపెట్టకముందే పరాజితులుగా మిగిలిపోతామేమోననే ఆందోళనలు వారిని పట్టిపీడిస్తుంటాయి.

పట్టుదలను ప్రదర్శించినా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోకపోవడం నిజంగా చాలా బాధాకరమే. కానీ ప్రయత్నించక ముందే ఓటమిని అంగీకరించడం అంత్యంత ఘోర వైఫల్యమవుతుంది. ఎదురుదెబ్బల ద్వారా నేర్చుకున్న పాఠాలు విజయానికి బలమైన పునాదులుగా నిలుస్తాయి. అంతిమంగా విజయం సాధించేందుకు కావాల్సింది పట్టుదల, సంకల్పమే. ఈ సప్త ఖండాల్లోని ప్రతీ విజేత కథ ఇదే విషయాన్ని సుస్పష్టంగా ప్రకటిస్తుంది.

జీవితమనేది సుఖదుఃఖాలు, కష్టనష్టాలు, బాధలు, సంతోషాల మిళితం. ఇంకా చెప్పాలంటే జీవితమంటేనే ఓ పోరాటం. కాబట్టి పోరాటపటిమ లేకుండా విజయం సాధించడం అసాధ్యం. కష్టించేందుకు ఇష్టపడనివారు కొత్తగా లేదా ప్రత్యేకంగా ఏదైనా సృష్టించజాలరు. వారి జీవితాల నుంచి నేర్చుకునేందుకు ఏమీ ఉండదు కూడా. ఎవరైతే ఎనలేని పట్టుదల కలిగి అద్భుతమైన విజయాలు సాధిస్తారో అలాంటి వారి విజయగాథలు తరాలపాటు వినబడతాయి.

ఈ “ఆపన్నులకు అమృతహస్తం” కథ అలాంటి అద్భుత విజయాలను సాధించిన వ్యక్తిదే. ఓటమికి వెరవకుండా విజయం సాధించడమే సంకల్పంగా పెట్టుకున్న వ్యక్తి కథ ఇది. తాను నేర్చుకున్న నైపుణ్యాలను ప్రజలకు సేవ చేసేందుకు వినియోగించిన మహా మనీషిని గురించిన చరిత్ర ఇది. ఆ మహోన్నత వ్యక్తి వైద్యుడిగా అసంఖ్యాకంగా రోగులకు అద్భుత చికిత్సను అందించారు. ఎంతో మందికి రెండో జన్మను ప్రసాదించారు. శారీరక, మానసిక అనారోగ్యాల నుంచి కోలుకున్న వారిలో అంతులేని సంతోషం వెల్లివిరిసేలా చేసిన వ్యక్తి ఆయన. ఆ మహనీయుడు ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్త కూడా. ఆ రంగంలోనూ ఎన్నో ఒడిదొడుకులను చవిచూశారు. ఎన్నెన్నో పాఠాలు నేర్చుకున్నారు. ఆ ప్రయాణంలో ఎన్నో కష్టాలతో కూడిన అనుభవాలు కూడా ఉన్నాయి. అనేక పతనాలు చవిచూడడం ఓ వైపు ఉంటే, తన నిర్విరామ కృషితో ఖ్యాతి, సంపత్తిని ఆర్జించడం మరోవైపు కనిపిస్తాయి. అటువంటి మహోన్నత కీర్తి శిఖరం, అనుపమానమైన విజయానికి ప్రతిబింబమయిన డాక్టర్ నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్ కథ ఇది. ఆయన తన జీవితం నుంచి నేర్చుకున్న ఎన్నో విషయాలు ఇందులో ఉన్నాయి. విజయతీరాలకు చేరాలంటే ఎలాంటి దారిలో పయనించాలో కూడా ఈ గాథ మనకు ప్రముఖంగా తెలియజేస్తుంది.

ముందుగా ఉపేంద్రనాథ్ విలక్షణ వ్యక్తిత్వం గురించి ఒక మాట చెప్పుకుందాం. లక్ష్య సాధన నుంచి వెనక్కి తగ్గడం, లక్ష్య సాధనా ప్రయాణంలో నెమ్మదించడం అనేది ఆయన జీవితంలో ఎన్నడూ కనిపించదు. ఉపేంద్రనాథ్ ఒకసారి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారంటే మిన్ను విరిగి మీద పడినా దాన్ని సాధించేంత వరకు ఆయన విశ్రమించరు. లక్ష్య సాధన కోసం ఆయన తనను తనకి అంకితం చేసుకుంటారు. ఏ విషయమూ ఆయన దృష్టిని మళ్లించలేదు. ఆయన లక్ష్యాలు భారీగా ఉంటాయి కానీ అవి అవాస్తవికంగా, అసాధ్యంగా మాత్రం అస్సలు ఉండే అవకాశమే లేదు. అలా ఆయన ఓ గొప్ప ఆచరణశీలి. ఇదే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉండాల్సిన ప్రాథమిక లక్షణం.

ఉపేంద్రనాథ్ ఏదైనా బాధ్యతను నిర్వర్తించగలననే సంపూర్ణ విశ్వాసం లేకపోతే దాన్ని చేపట్టేందుకు ఏ మాత్రం చొరవ చూపేవారు కాదు. ఇది ఆయన విలక్షణ వ్యక్తిత్వంలోని మరో ప్రధానమైన ప్రత్యేకత. ఊరికనే కలలుగనే వ్యక్తి కాదు ఉపేంద్రనాథ్. తనకున్న అపారమైన అనుభవం ఆధారంగా సునిశిత పరిశీలన జరిపి ఒక కచ్చితమైన మార్గాన్ని నిర్దేశించుకునేవారు.

ఉపేంద్రనాథ్ కథ ఆయన ఒక్కరిదే కాదు. వారి తల్లిగారిది కూడా. ఆయన విజయాల వెనుక వారి మాతృమూర్తి అంకితభావం కూడా ఉంది. సమర్థుడైన వైద్యుడిగా ప్రజల ఆదరాభిమానులు పొందిన భర్తను కోల్పోయిన స్త్రీ ఆమె. తన సంతానం ప్రతీ ఒక్కరు మహోన్నతమైన వైద్య వృత్తిలో రాణించేందుకు అలుపెరగకుండా శ్రమించిన ధీశాలి తను.

కలలు సాకారం చేసుకునేందుకు ఆమె చేసిన త్యాగాలే ఈ కథకు మూలం. భర్తను కోల్పోయిన ఒక మహిళ దృఢ సంకల్పమే ఆమె సంతానపు విజయగాథలు.

వైద్య విద్యార్థి జీవితానికి సంబంధించిన అపురూపమైన ఘట్టాలు కూడా ఈ కథలో ఉన్నాయి. ప్రేమ, ఎడబాటు, పేదరికంతో తల్లడిల్లే రోగుల బాధలు, కష్టాలెన్నో ఈ కథలో భాగంగా కనిపిస్తాయి. భారతదేశంలో వైద్య రంగానికి మౌలిక సదుపాయాల కొరతకు సంబంధించిన కఠినమైన వాస్తవాలు ఇందులో ఇమిడి ఉన్నాయి. అవసరమైన చికిత్సను పొందలేక, రోగాలతో రొప్పుతూ బతుకీడుస్తున్న అనేక మంది స్త్రీ, పురుషుల కథలు కూడా ఇందులో తారసపడుతాయి. వైద్య డిగ్రీ పొంది, అందులో ఉత్తమంగా నిలిచి, ఇంత వరకూ ప్రపంచం చూడని అద్భుతమైన సర్జన్‌గా నిలవాలన్న ఒక యువకుడి సంకల్పం, ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లడం, ప్రపంచఖ్యాతి గాంచిన అమెరికా వైద్యనిపుణుల ముందు భారతీయుల శక్తి సామర్థ్యాలు, నైపుణ్యం, మేధస్సును చూపడం లాంటి గొప్ప ఘట్టాల కలయికే ఈ కథ. అంతే కాదు క్లిష్టమైన పరిస్థితుల్లో అసంఖ్యాకుల ప్రాణాలు కాపాడటంలో వైద్యుడు నిర్వర్తించాల్సిన కర్తవ్యం గురించి తెలియజేస్తుంది ఈ కథ. ఒక డాక్టరు సొంత ప్రాక్టీసు పెట్టి ఎలా నిలదొక్కుకున్నారో, ఓ పారిశ్రామిక వేత్తగా ఎలా రూపాంతరం చెందారో వివరిస్తుంది ఈ కథ. ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా ఎదుర్కొన్న ఒడిదొడుకులు, ప్రధాన మంత్రి, ఆర్థిక మంత్రి కృషి నుంచి ప్రేరణ పొంది స్వదేశంలోని ప్రజలకు సేవ చేసేందుకు రావడం వంటి ఘట్టాలన్నీ ఇందులో కనిపిస్తాయి.

లక్ష్య సాధన కోసం తన రక్తాన్ని, స్వేదాన్ని, కన్నీటిని త్యాగం చేసిన ఓ మహనీయుడి కథ ఇది. విజయం సాధించేందుకు తనను తాను సంపూర్ణంగా సమర్పించుకున్న ఉపేంద్రనాథ్ కథ ఇది. వృత్తిలో ప్రతిభ సాధించేందుకు, సమాజంలోని పౌరుల స్థితిగతులు మెరుగుపరిచేందుకు అంకితభావంతో వ్యవహరించిన వైద్యుడి కథ ఇది.

తన మనస్సు నిర్దేశించిన ప్రతీ కార్యాన్ని నిర్వర్తించిన వ్యక్తి ఉపేంద్రనాథ్. అలుపెరగని లక్ష్యాల కారణంగా ఆయన కొన్ని నష్టాలను కూడా చవి చూసిన విధానం మనకు జీవన పోరాటంలో ఎదురయ్యే ఎన్నో ఒడిదొడుకుల గురించి ఈ కథలో కళ్ళకు కట్టినట్టుగా తెలుసుకుంటాము. ఇది తండ్రిని మించిన కొడుకు కథ. అంతకు మించి వృత్తిధర్మం కోసం రాత్రింబవళ్లు అవిశ్రాంతంగా శ్రమించిన వైద్యుడి గాథ ఇది. సంతోషం, బాధ, ఆశ, తిరస్కరణ, విజయం, పరాజయం ఇలా మానవ జీవితంలోని ప్రతీ కోణాన్ని స్పృశించే కథ ఇది.

ఉపేంద్రనాథ్ విజయాల నుంచి పొందే జ్ఞానం మాటల్లో వర్ణించలేనిది. పాఠాలతో పాటు అనుభవంతో నేర్చుకునే సారానికి సమానం ఈ విజయగాథ. పుస్తకాల నుంచి ముఖ్యంగా వైద్య పుస్తకాల నుంచి అర్జించే జ్ఞానం అనేక మంది జీవితాలను మెరుగుపరచేందుకే కాదు,

వాటి ద్వారా లభించే దూరదృష్టితో వినాశకర పరిణామాలను నివారించవచ్చని నిరూపించేందుకు ఉపేంద్రనాథ్ జీవితం ఒక ఉదాహరణ.

డాక్టర్ ఉపేంద్రనాథ్ వయస్సు ప్రస్తుతం ఎనభై సంవత్సరాలైనా ఇప్పటికీ ఆయన ఎంతో చురుగ్గా ఉంటారు. ప్రస్తుతం ఆయన రోగులను వ్యక్తిగతంగా పరీక్షించలేకపోయినా, ఎన్.ఆర్.ఐ. మెడికల్ కాలేజీ ద్వారా ప్రతిభావంతులైన వైద్యులను తీర్చిదిద్దుతూ తన సుదీర్ఘ లక్ష్యానికి అంకితమై ఉన్నారు. ఈ సంస్థ ద్వారా పేద రోగులకు వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారు. ఓ వైపు వైద్య వృత్తిలో కొనసాగుతూనే సమాజానికి సేవ చేసేందుకు ఎక్కువ సమయాన్ని సంపూర్ణంగా వెచ్చిస్తున్నారు ఉపేంద్రనాథ్.

వైద్య రంగంలో రాణించాలనుకునే వారు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునేవారు ఉపేంద్రనాథ్ సంకల్పం, విజయాల నుంచి ఒకటో రెండో విషయాలు ప్రతీ ఒక్కరు నేర్చుకుంటారనే ఆశతో ఆయన కథకు అక్షర రూపం ఇవ్వడం జరిగింది. పుస్తకాలు మనకు ఎన్నో విషయాలు నేర్పుతాయి, కానీ విజయం సాధించిన స్త్రీ, పురుషుల కథలు జీవితకాలానికి సరిపడా పాఠాలు అందిస్తాయన్నది వాస్తవం.

**– డాక్టర్ అరవింద్ యాదవ్**

arvindjournalist@gmail.com

## 1. జననం:

# ప్రాపంచిక పరిణామ కాలంలో ఆగమనం

ఉపేంద్రనాథ్ పోరాటాలు, పట్టుదల, విజయం కోసం పరితపించిన విధానాలు నేటి తరానికి అర్థం కావాలంటే ఉపేంద్రనాథ్ పుట్టిన కాలం గురించి తెలియాలి. ఆ నాటి పరిస్థితులు, ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న పరిణామాలను ఒక్కసారి పరిశీలించాలి. అప్పుడే మనకు ఉపేంద్రనాథ్ జీవిత సారం నేర్పుతున్న పాఠాలను సరిగ్గా అర్థం చేసుకోగలుగుతాము.

మానవ చరిత్రలో ఇరవైయ్యవ శతాబ్దపు నాలుగో దశాబ్దం అత్యంత క్రూరమైనదని చరిత్ర మనకు చెప్తోంది. ఆ సమయంలో ప్రపంచమంతటా అరాచకమే. అన్నివైపులా భయం, అశాంతే. ఆకలి చావులు, పేదరికం ప్రపంచంలోని చాలా దేశాలను పట్టి పీడించిన సమయమది. ఆ దశాబ్దం ప్రారంభానికి కొన్ని నెలల ముందే రెండో ప్రపంచ యుద్ధం విరుచుకుపడింది. సెప్టెంబర్ 1, 1939న మొదలైన ఆ యుద్ధంలో 61 దేశాలకు చెందిన 10 కోట్ల మంది సైనికులు పాల్గొన్నారు. ఈ యుద్ధం ప్రపంచగతిని మార్చివేసింది. దేశాలన్నీ రెండుగా విడిపోయాయి. బ్రిటన్, అమెరికా, రష్యా, చైనా ఒకవైపు నిలిస్తే, వాటికి ప్రత్యర్థులుగా జపాన్, ఇటలీ, జర్మనీ నిలిచాయి.

ఆ యుద్ధం ఒక భయానక ఘట్టం. పోరాడుతున్న రెండు పక్షాలూ ఏ మాత్రం పట్టువిడుపులను ప్రదర్శించలేదు. తమ పారిశ్రామిక, శాస్త్రీయ శక్తియుక్తులన్నింటినీ మోహరించాయి. అమెరికా అయితే ఏకంగా అణు బాంబులను రంగంలోకి దింపింది.

ఆగస్టు 6, 1945 ఉదయం 8 గంటల సమయంలో యురేనియంతో నిండిన ఆటమ్ బాంబును జపాన్‌లోని హిరోషిమాపై అమెరికా విసిరింది. క్షణాల వ్యవధిలోనే భారీ స్థాయిలో విధ్వంసం. ఈ బాంబు దాడిలో కనీసం ఎనిమిది వేల మంది కన్నుమూసి ఉంటారని

అంచనా. అంతే కాదు పెద్ద సంఖ్యలో జనం గాయాల బారిన పడ్డారు. అనేక మంది వికలాంగులుగా మారారు. అక్కడితో అమెరికా ఆగలేదు. ఆ తర్వాత మూడు రోజులకే అంటే ఆగస్టు 9న ఉదయం 11.02 గంటలకు జపాన్‌లోని మరో నగరం నాగసాకిపై దాడి చేసింది. ఈసారి యూరేనియం కంటే తీవ్రమైన ప్లూటోనియం బాంబును ప్రయోగించింది. కిలోమీటర్ పరిధిలోని ప్రతీ భవనాన్ని ఆ బాంబు శిథిలాలుగా మార్చేసింది. క్షణాల వ్యవధిలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. అమెరికా దాడి కారణంగా ఈ రెండు నగరాలు వినాశమవడమే కాదు, జపాన్‌ను కోలుకోకుండా చేశాయి. రెండో ప్రపంచ యుద్ధంలో బలవంతంగా ఓటమిని అంగీకరించాల్సిన పరిస్థితిని జపాన్‌కు తీసుకొచ్చాయి.

ఆధునిక మానవ చరిత్రలో అది ఒక అత్యంత భయంకరమైన విషాదం. ఆరేళ్లు సాగిన ఆ యుద్ధం సెప్టెంబర్ 2, 1945న ముగిసింది. దాదాపు 7 కోట్ల మంది ప్రాణాలను అది పొట్టన పెట్టుకుంది. అంత కంటే ఎక్కువ సంఖ్యలో జనం గాయాలబారిన పడ్డారు. వికలాంగులుగా మారారు. అనేక కుటుంబాలు చెల్లాచెదురైపోయాయి. అనేక దేశాల ఆర్థిక పరిస్థితి తలకిందులైంది. కనుచూపు ప్రసరించినంత దూరం వినాశనమే. యుద్ధంలో పాల్గొన్న ప్రతీ దేశం తీవ్రమైన నష్టాన్ని చవిచూసింది. ఈ యుద్ధం అంతర్జాతీయంగా పేదరికాన్ని పెంచింది.

యుద్ధంతోనే ఆ వినాశనం ఆగిపోలేదు. తదనంతర పరిణామాలు కూడా ప్రపంచ జనాభాను అతలాకుతలం చేశాయి. యుద్ధంలో విసిరిన బాంబులతో అంటువ్యాధులు ప్రబలాయి. ఆ తర్వాత వచ్చిన కరువుతో దేశాల అర్థిక పరిస్థితులు తలక్రిందులైపోయాయి. యుద్ధం కారణంగా తలెత్తిన అనిశ్చితి, ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేందుకు ప్రభావిత దేశాలకు అనేక సంవత్సరాలు పట్టింది.

ఆ సమయంలో బ్రిటీష్ వారి పాలనలో భారతదేశం ఉండటంతో మన దేశం కూడా బలవంతంగా ఆ యుద్ధంలో పాల్గొనాల్సి వచ్చింది. బ్రిటీష్, మిత్ర దేశాల తరపున ఇరవై లక్షల మందికి పైగా భారతీయ సైన్యం రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొంది. ఏ దేశం తరపున కూడా అంత పెద్ద సంఖ్యలో సైన్యం పాల్గొనలేదని చరిత్రకారులు చెప్తుంటారు. ఇరవై నాలుగు వేల మంది కంటే ఎక్కువ మంది భారతీయ సైనికులు ఆ యుద్ధంలో అమరులయ్యారు. అనేక మంది వైకల్యం బారిన పడ్డారు. అంతే కాదు ఆర్థిక సాయం అందించాలని భారతదేశంలోని అనేక రాజ్యాలను బ్రిటీష్ బలవంతం చేసింది.

ప్రపంచాన్ని రెండో ప్రపంచ యుద్ధం అతలాకుతలం చేసిన సమయంలోనే భారతదేశంలో స్వాతంత్ర్య పోరాటం తారస్థాయికి చేరింది. బ్రిటీష్ వారిపై వ్యతిరేక గళం తీవ్రమైంది. మోహన్ దాస్ కరంచంద్ గాంధీ స్వాతంత్ర్య పోరాట సేనానిగా ఎదిగారు.

1942వ సంవత్సరంలో స్వాతంత్ర్య ఉద్యమానికి కొత్త దిశ లభించింది. ఆగస్టులో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశం బొంబాయిలో (ప్రస్తుత ముంబయి) జరిగింది. ఆ సమావేశంలోనే బ్రిటీష్ వారు దేశం విడిచి వెళ్లాలని క్విట్ ఇండియా అంటూ, చావో-రేవో (డూ ఆర్ డై) అంటూ స్వాతంత్ర్య సంగ్రామానికి కొత్త ఊపిరి అందించారు మహాత్మ గాంధీ. ఆ సందేశం సుస్పష్టం, నిస్సందేహభరితం. బ్రిటీష్ వారు దేశాన్ని విడిచివెళ్లేంత వరకు ఒక్క క్షణం కూడా విశ్రాంతి తీసుకోరాదని నిర్ణయించిన సమయమది. దీన్ని సహించలేకపోయిన బ్రిటీష్ ప్రభుత్వం మహాత్మా గాంధీ సహా అనేక మంది ప్రముఖ జాతీయ నాయకులను నిర్బంధించింది. ఈ అరెస్టులతో భారతీయులు రగిలిపోయారు. దేశవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రస్థాయికి చేరాయి. అదే స్థాయిలో ఉద్యమాన్ని అణిచివేసేందుకు ప్రయత్నించిన బ్రిటీష్ ప్రభుత్వం లాఠీ ఛార్జీలు, తుపాకులకు పనిచెప్పింది. అనేక ప్రాంతాల్లో స్వాతంత్ర్య పోరాట యోధులపై బాంబులతో దాడులు చేసింది.

అదే సమయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్ కార్యకలాపాలు ప్రారంభించారు. మీరు నాకు రక్తం ఇవ్వండి. నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తానన్న ఆయన నినాదం యువతను బాగా ఆకట్టుకుంది. దీనికి ఆకర్షితులై అనేక మంది యువకులు ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరారు. 'కదమ్ కదమ్ బడాయే జా' అన్న ఆజాద్ హింద్ ఫౌజ్ గానం యువతను తీవ్రంగా ప్రభావితం చేసింది.

| | |
|---|---|
| Qadam qadam baṛhāye jā | అడుగు అడుగు కదులుదాం |
| khushī ke gīt gāye jā | ఆనంద గీతాలు పాడుదాం |
| ye zindagī hai qaum kī | ఈ జీవితం సంఘానిది |
| tū qaum pe lutāye jā | అర్పిద్దాం మాతృదేశానికి |
| | |
| Tū sher-e-hind āge baṛh | నీవు భారత దేశ మృగరాజువు, సాగిపో ముందుకు |
| marne se tū kabhī na dar | మృత్యువును చూసి భయపడకు ఎప్పుడూ |
| uṛā ke dushmanon kā sar | శత్రువులను తుది ముట్టించు |
| josh-e-watan baṛhāye jā | దేశమంతా స్ఫూర్తి నింపు |
| | |
| Himmat terī baṛhtī rahe | ధైర్యం నీలో తరగరాదు |
| khudā terī suntā rahe | దేవుడు ఆలకించాలి నీ మాటలు |
| jo sāmne tere khaṛe | నీ ముందు ఎవరు నిలిచినా |
| tū khāq men milāye jā | మట్టిలో కలిసి పోవాలి |

| | |
|---|---|
| Chalo dillī pukār ke | ఢిల్లీ కోసం గర్జించు |
| qaumī-nishān sambhāl ke | దేశ పతాకాన్ని ఒడిసిపట్టు |
| Lāl qile pe gāṛ ke | ఎర్రకోటపై |
| lahrāye jā lahrāye jā | ఎగరాలి, ఎగరాలి |

బ్రిటీష్ వారిని దేశం నుంచి తరిమివేయాలని నేతాజీ ప్రతిజ్ఞ చేశారు. ఆ ఉద్దేశ్యంతోనే జపాన్‌కు సాయంగా ఆజాద్ హింద్ ఫౌజ్‌ను మోహరించారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్, జర్మనీ, ఇటలీ, వాటి మిత్రదేశాలతో బ్రిటన్ తీవ్రమైన పోరాటం చేస్తోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జపాన్ వారి సాయంతో బ్రిటీష్ వారిని భారత గడ్డపై నుంచి పెకిళించాలని నేతాజీ భావించారు.

రెండో ప్రపంచ యుద్ధం, భారత స్వాతంత్ర్య సంగ్రామం తారస్థాయిలో ఉన్న సమయంలో బెంగాల్‌ను (ఆ సమయానికి ఇంకా విడిపోలేదు) ఊహించని కరువు చుట్టుముట్టింది. అది సృష్టించిన వినాశాన్ని మాటల్లో వర్ణించలేం. పిడికెడు తిండి కోసం జనాలు కొట్టుకుచచ్చిన దుస్థితి. ఆకలి బాధ వేల మందిని కబళించింది. కరువు నుంచి బయటపడేందుకు చాలా మంది కోల్‌కతా, ఢాకా నగరాలకు వలస వెళ్లిపోయారు. కానీ గమ్యస్థానం చేరుకోకముందే అనేక మంది అసువులుబాశారు. అన్నం మెతుకుల కోసం స్త్రీ, పురుషులు, పిల్లలు నిస్సహాయంగా ఎదురుచూసిన నాటి దారుణ పరిస్థితుల గురించి ఎంత వర్ణించినా తక్కువే. ఈ చావులన్నీటికి కారణం బ్రిటీష్ పాలకులేనన్నది చాలా మంది చరిత్రకారుల అభిప్రాయం.

రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బర్మాలోని అనేక ప్రాంతాలను జపాన్ విజయవంతంగా ఆక్రమించింది. అప్పట్లో అది బ్రిటీష్ వారి సామ్రాజ్యంలో భాగం. ఈ ఆక్రమణ జరిగిన కొన్ని నెలలకే బెంగాల్‌లో కరువు సంభవించింది. ఆ విపత్కర పరిస్థితుల నుంచి బయటపడేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఆహార ధాన్యాల సరఫరాను బ్రిటీష్ పాలకులు ఉద్దేశ్యపూర్వకంగానే అడ్డుకున్నారు. ఈ సందర్భాన్ని తమ ప్రత్యర్థులు అవకాశంగా మల్చుకుంటారనే అనుమానం బ్రిటిష్ పాలకులకు కలిగింది. అవసరంలో ఉన్న వాళ్ళకు ఆహారం అందజేసి, తమకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడతారనే భయంతో బెంగాల్ ను కరువు కోరల్లో కూరుకుపోయేలా నిర్లక్షం చేశారు. అంటే తమ సొంత ప్రయోజనాల కోసం బ్రిటిష్ పాలకులు బెంగాల్ ను మరణశయ్యపై పడుకోబెట్టారన్నమాట.

అంతేకాదు, బర్మాను జపాన్ ఆక్రమించడంతో అక్కడి నుంచి బియ్యం దిగుమతిని బ్రిటీష్ వారు నిషేధించారు. అదే సమయంలో తమ సైన్యం, యుద్ధంలో పాల్గొంటున్న ఇతరుల కోసం బియ్యాన్ని బ్రిటీష్ వారు దాచిపెట్టారు. దీనికి తోడు జపాన్ చేసిన దాడులు పరిస్థితిని మరింత సంక్షోభంలోకి నెట్టాయి. ఈ పరిణామంతో భయపడిన బ్రిటీష్ వారు ఎద్దుల బండ్లు,

గుర్రపు బండ్లు, పడవలు స్వాధీనం చేసుకోవడమో లేదా నాశనం చేయడమో చేశారు. వాహనాల లేకపోవడంతో ఆహార సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ధరలు పెరిగిపోయాయి. పేదల కష్టాలకు అంతు లేకుండా పోయింది. బెంగాల్‌లో కరువు ముప్పై లక్షల మంది ప్రాణాలను బలి తీసుకుంది. నాటి చిత్రాలు ఇప్పటికీ మనసులను కదిలించివేస్తాయి.

ఈ దారుణ ఘటనలకు నాటి బ్రిటీష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్‌ను కూడా తప్పుబడతారు కొంత మంది చరిత్రకారులు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో కుట్రపూరితంగానే లక్షలాది మంది భారతీయులు ఆకలితో అలమటించేలా చర్చిల్ చేశారని వాదనలు ఉన్నాయి.

నలభైవ దశకం ప్రపంచవ్యాప్తంగా సవాళ్లతో కూడిన సమయమని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ మార్పులు స్వల్పస్థాయివి కావు. అవి అనూహ్యమైనవి, అవి ప్రపంచమంతా చెరిగిపోని ముద్రలుగా నిలిచిపోయాయి. చరిత్ర కొత్తగా మొదలైంది.

భారత స్వాతంత్ర్య పోరాటం తారస్థాయికి చేరింది. నిరసనలతో దేశం అట్టుడికింది. ఓ వైపు గాంధేయవాదులు, మరో వైపు విప్లవకారులు. ఎవరికి వారు స్వాతంత్ర్య పోరాటాన్ని ఉధృతం చేశారు. భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, రామ్‌ప్రసాద్ బిస్మిల్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలు యువతీ యువకుల్లో దేశభక్తి జ్వాలాలు రేపాయి. విప్లవం వర్థిల్లాలి నినాదం బ్రిటీష్ వారికి నేరుగా సవాల్ విసిరింది. అదే సమయంలో "సర్ఫరోషి కి తమన్నా అబ్ హామారే దిల్ మే హై, దేఖ్నా హై జోర్ కిత్నా బజు ఏ ఖాతిల్ మే హై" (విప్లవం మా గుండెల్లో నిండిపోయింది, మా ప్రత్యర్థుల శక్తి ఏంటో పరీక్షిద్దాం పదండి) అన్న పాటను విప్లవకారులు బాగా ప్రచారం చేశారు. అదే సమయంలో అహింసావాదులు "వందే మాతరం", "బ్రిటీష్ వారు దేశం విడిచి వెళ్లండి" (బ్రిటీష్ క్విట్ ఇండియా), స్వాతంత్ర్యం మా జన్మ హక్కు అనే నినాదాలతో ముందుకు సాగారు.

ఆ సమయంలో బ్రిటీష్ వారి ఏలుబడిలో ఉన్న ఒక ప్రాంతం మద్రాసు. దేశంలో బ్రిటీష్‌వారి పాలనలో ఉన్న అతి పెద్ద రాష్ట్రాల్లో అది ఒకటి. ప్రస్తుత తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ అంతా మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉండేది. కర్ణాటక, ఒడిషాలోని కొన్ని ప్రాంతాలు కూడా అందులో అంతర్భాగాలుగా ఉన్నాయి.

గుంటూరు జిల్లాలోని తెనాలి (ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్) కూడా అప్పట్లో మద్రాసు రాష్ట్రంలో ఒక భాగమే. కళలు, సంస్కృతి, సాహిత్యానికి అది నెలవు. కృష్ణదేవరాయల కొలువులోని అష్టదిగ్గజాల్లో ఒకరు తెనాలి రామకృష్ణుడు. ఆ కాలంలో అత్యంత శక్తిమంతుడైన రాజు కృష్ణదేవరాయలు. స్వయంగా కవి కావడంతో ఆయన ఈ ప్రాంతంలో సాహిత్యానికీ,

సంస్కృతికీ ఎంతో ప్రాధాన్యమిచ్చారు. అల్లసాని పెద్దన, నంది తిమ్మన, మాదయ్యగారి మల్లన, అయ్యలరాజు రామభద్రుడు, రామరాజ భూషణుడు, ధూర్జటి, పింగళి సూరన, తెనాలి రామకృష్ణ వంటి గొప్ప కవి పండితులు ఆయన కాలం నాటి వారే.

తెనాలి రామకృష్ణుడు కవి, పండితుడే కాక, పరిపాలనా వ్యవహారాల్లోనూ దిట్ట. పాలనా వ్యవహారాలు, శత్రువులను తుదముట్టించే వ్యూహాల్లో కృష్ణదేవరాయలకు తెనాలి రామకృష్ణుడు ఎన్నో సలహాలు ఇచ్చారని చరిత్ర చెప్తోంది. వారి ఇద్దరి గురించిన అనేక కథలు నేటికీ ప్రసిద్ధిగానే ఉన్నాయి. ఆ తర్వాత ఇలాంటి ప్రాముఖ్యతే అక్బర్–బీర్బల్‌కు కూడా లభించింది. మేధస్సు, తెలివితేటలు, హాస్య చతురతతో రామకృష్ణుడు మంచి పేరు సంపాదించుకున్నారు.

కళలు, సంస్కృతికి నెలవైన తెనాలిలో అనేక సామాజిక, రాజకీయ, సాంస్కృతిక ఉద్యమాలు పురుడు పోసుకున్నాయి. కవిరాజుగా ఖ్యాతిగాంచిన ఇరవైయ్యవ శతాబ్దపు కవివరేణ్యులు త్రిపురనేని రామస్వామి చౌదరి కూడా తెనాలికి చెందిన వారే. వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ పై అనేక సామాజిక ఉద్యమాలను రామస్వామి చౌదరి ప్రారంభించారు. బ్రాహ్మణుల పెత్తనాన్ని, మనుస్మృతిని ఆ ఉద్యమం నిలదీసింది. కులతత్వంపై తెనాలికి చెందిన సూర్యదేవర రాఘవయ్య చౌదరి మరో ఉద్యమం చేపట్టారు. సమాజంలో బ్రాహ్మణ పెత్తనాన్ని రాఘవయ్య చౌదరి, ఆయన అనుచరులు సవాల్ చేశారు. కుల, మత వివక్షకు వ్యతిరేకంగా గళం విప్పారు. సంఘంలో పెత్తనం చలాయించేందుకే బ్రాహ్మణులు పురాణాలు, గ్రంథాలు రాశారని వాదించారు. ఆర్థికంగా, సామాజికంగా ఉన్నతులైన కమ్మ కులానికి చెందిన ఈ నాయకులు తాము నిర్వహించిన పోరాట కార్యకలాపాలకు “ఆత్మ గౌరవ ఉద్యమం” అని నామకరణం చేసుకున్నారు. కమ్మ కులానికి చెందిన వారంతా తమ మతపరమైన ఆచారాలు, కార్యక్రమాలకు బ్రాహ్మణులను దూరం పెట్టారు. చాలా మంది సొంతంగా బ్రాహ్మణత్వాన్ని తీసుకొని స్వయంగా ఆచారాలు, కార్యక్రమాలు నిర్వహించడం మొదలుపెట్టారు.

స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కొంత మంది వామపక్షవాదులు హింసా మార్గాన్ని చేపట్టారు. శాంతి, అహింసతో ఆశించిన ఫలితాన్ని పొందలేమన్నది వారి నమ్మకం. బ్రిటీష్ వారిని దేశం నుంచి తరిమికొట్టాలంటే విప్లవం తప్పనిసరి అని, శత్రువుపై యుద్ధం చేస్తేనే విప్లవం సాధ్యమవుతుందని భావించారు. ఇటు తెలంగాణలోనూ కొంత మంది వామపక్ష నాయకులు నిజాం నవాబు, రజాకార్లపై కత్తులు దూశారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ వామపక్షీయులు ఇంగ్లీష్ వారి క్యాంపులను లక్ష్యంగా చేసుకున్నారు. దీంతో హైదరాబాద్‌లో నిజాం సైన్యం, ఆంధ్రలో బ్రిటీష్ పోలీసులు వామపక్షీయులను తుద ముట్టించడమే లక్ష్యంగా

వ్యవహరించాయి. ఈ పరిస్థితుల్లో తెనాలి, చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజలు ఎంతో మంది వామపక్ష నాయకులకు ఆశ్రయమిచ్చారు. తిరుగుబాటు, సోషలిజాన్ని చాలా మంది నమ్మడంతో తెనాలిలో వామపక్ష భావజాలం వెల్లివిరిసింది.

ఎన్నో స్వాతంత్ర్య పోరాట ఘట్టాల చరిత్రను తనలో దాచుకుంటున్న తెనాలి ఒక సంఘటనతో ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆగస్టు 1942లో బొంబాయిలో నిర్వహించిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశం తర్వాత బ్రిటీష్ ప్రభుత్వం గాంధీని అరెస్టు చేసింది. ఈ అరెస్టు తర్వాత బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు తీవ్రమయ్యాయి. తెనాలిలోనూ ప్రజాగ్రహం వెల్లువెత్తింది. కల్లూరి చంద్రమౌళి, వెలవోలు సీతారామయ్య, అయితు సుబ్బారెడ్డి వంటి స్థానిక కాంగ్రెస్ నాయకులు తెనాలి బంద్‌కు పిలుపిచ్చారు. ఆగస్టు 12న జరిగిన ఆ బంద్ బ్రిటీష్ వారికి వ్యతిరేక ప్రదర్శనలకు ఆరంభంగా నిలిచింది. తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలోని ఒక హోటల్‌ను కొంత మంది స్వాతంత్ర్య పోరాట యోధులు బలవంతంగా మూసేయించి, రైల్వే లైన్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనిని తీవ్రంగా తీసుకున్న బ్రిటీష్ ప్రభుత్వం తెనాలి పౌరులను అణిచివేసేందుకు లాఠీఛార్జ్‌కు దిగింది. గుంటూరు జిల్లా నుంచి అదనపు బలగాలు రప్పించబడ్డాయి. సూపరింటెండెంట్ ఆదేశాలపై నిరాయుధులైన నిరసనకారులపై పోలీసులు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో మాజేటి సుబ్బారావు, శ్రీగిరి లింగం, లక్ష్మీనారాయణ, తమ్మినేని సుబ్బారెడ్డి, గాలి రామకోటయ్య, ప్రయాగ రామకృష్ణయ్య, జాస్తి అప్పయ్యే అనే ఏడుగురు పోరాటయోధులు అమరులయ్యారు. ఆ అమానవీయ ఘటనతో బ్రిటీష్ వారిపై ప్రజాగ్రహం తీవ్రమైంది. స్వాతంత్ర్య కాంక్ష మరింత ప్రబలమైంది. ఈ కాల్పుల ఘటనను యావత్తు ప్రపంచం ఖండించింది. ప్రపంచవ్యాప్తంగా తెనాలి గురించి చర్చ జరిగింది.

ఇటువంటి చారిత్రక పోరాటాల కాలంలో మహనీయ ఉపేంద్రనాథ్ పురుడు పోసుకున్నారు. నిలువెల్లా దేశభక్తి, బ్రిటిష్ వ్యతిరేకతతో రగిలిపోతున్న తెనాలిలో 1942 వ సంవత్సరంలో అప్పటి ప్రముఖ వైద్యుడు నిమ్మగడ్డ సాంబశివరావు, ఆమె భార్య పుష్పవతిలకు రెండో సంతానంగా పుట్టిన మగ బిడ్డే మనం చెప్పుకుంటున్న ఆదర్శ పురుషుడు. తల్లిదండ్రులు ఎంతో ప్రేమతో తనకు ఉపేంద్రనాథ్ అని పేరు పెట్టారు. కొత్త చరిత్రకు నాంది పలికారు.

## 2. విధిరాత:

# డాక్టర్‌గా కర్తవ్యపాలన, కుటుంబ దుస్థితి

ఉపేంద్రనాథ్ గురించి మరింత బాగా అర్థం చేసుకోవాలంటే తను పుట్టిన కాలంతో పాటుగా, తనను కన్న తల్లిదండ్రుల గురించి, వారి ఆశయాల గురించి, తను పెరిగిన వాతావరణం గురించి కూడా తెలుసుకోవాలి. ఉపేంద్రనాథ్ తండ్రి సాంబశివరావుకు మంచి హస్తవాసిగల వైద్యుడిగా ఎంతో పేరుంది. నేత్రవైద్యుడిగానే కాదు ఆధునిక వైద్యశాస్త్రంలోనూ అపార ప్రతిభావంతుడాయన. ఆయన క్లినిక్ ఎప్పుడూ రోగులతో కిటకిటలాడుతూ ఉండేది. ఆయన దగ్గర చికిత్స చేయించుకునేందుకు దూరప్రాంతాల నుంచి కూడా రోగులు వచ్చేవారు. ఆ కారణంగా ఆయనకు క్షణం తీరికుండేది కాదు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేంత వరకు ఆస్పత్రిలోనే గడిపేవారు సాంబశివరావు. ఆయన చేతిలో ఏదో మహత్తు ఉందని చాలా మంది నమ్మేవారు. ఆయన రాసే మందులు వాడితే ఏ వ్యాధి అయినా మటుమాయమైపోతుందనే నమ్మకం ప్రజల్లో ఉండేది.

సాంబశివరావు కుటుంబంలో ఆయనే మొదటి వైద్యుడు. ఆయన తండ్రి తెనాలికి ఐదు కిలోమీటర్ల దూరంలోని దుగ్గిరాలలో ఉండేవారు. వారి కుటుంబానికి భారీగా వ్యవసాయం ఉండేది, దాంతో వారి జీవితం సాఫీగా సాగిపోయేది.  తొమ్మిది మంది సంతానంలో సాంబశివరావు రెండోవాడు. అందరిలోనూ తెలివైనవాడే కాదు అద్భుతమైన జ్ఞాపకశక్తి కూడా ఆయన సొంతం. సాంబశివరావులోని సామర్థ్యాన్ని గుర్తించిన తన తండ్రి అతన్ని వైద్యుడిని చేయాలని సంకల్పించారు. వైద్యులను నిజంగా దేవుళ్లుగా భావించే రోజులవి.

సాంబశివరావును ఆయన తండ్రి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. స్కూల్‌లో చేరిన నాటి నుంచి కూడా సాంబశివరావు తోటి విద్యార్థులకు తల్లో నాలుకలా మెలిగాడు. పదో తరగతి పరీక్షల్లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. ప్రీ-యూనివర్సిటీ పరీక్షల్లోనూ

చక్కగా రాణించడంతో మద్రాసులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో చోటు లభించింది. బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్, బ్యాచిలర్ ఆఫ్ సర్జరీలో (ఎంబిబిఎస్) సాంబశివరావుకు ప్రవేశం లభించింది. ఏడాది తర్వాత విశాఖపట్నంలో అప్పుడే ప్రారంభించిన ఆంధ్రా మెడికల్ కాలేజీకి ఆయన బదిలీ చేయబడ్డారు. ఈ కాలేజీ నుంచి సాంబశివరావు విజయవంతంగా తన వైద్య డిగ్రీ పూర్తి చేశారు. జనరల్ మెడిసిన్‌తో పాటు నేత్రవైద్యంలోనూ ఆయన అద్భుత ప్రతిభ కనబరిచారు.

అల్లోపతి వైద్యంపై నమ్మకం పెరుగుతున్న రోజులవి. అందుకే ఆధునిక అల్లోపతి వైద్యంలో నిపుణులైన వైద్యులు అతి కొద్ది మంది మాత్రమే ఉండేవారు. అటువంటి రోజుల్లో డాక్టరైన సాంబశివరావు పెద్ద నగరాలైన మద్రాసు, గుంటూరు, విజయవాడ, కాకినాడ, విశాఖపట్నంలో సొంత క్లినిక్ లేదా ఆస్పత్రి ప్రారంభిస్తే బాగా సంపాదించవచ్చని తెలిసినా తన ప్రాంతంలోని పేదలు, అభాగ్యులకు అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో సొంతూరు వచ్చి ప్రాక్టీస్ మొదలుపెట్టారు. చెల్లించే స్థోమత లేని వారి నుంచి ఆయన ఏనాడు ఫీజు ఆశించలేదు. సేవాభావంతో వైద్యం చేస్తున్న సాంబశివరావు అనతి కాలంలోనే గొప్ప పేరు తెచ్చుకున్నారు. పేదల వైద్యుడు అనే పేరు దశదిశలా వ్యాపించింది.

కుమారుడు వైద్య వృత్తిలో నిలదొక్కుకొని మంచి పేరు తెచ్చుకోవడంతో తగిన కోడలి కోసం అన్వేషణ చేపట్టారు సాంబశివరావు తండ్రి. సంగం జాగర్లమూడికి చెందిన పుష్పవతిని చూసిన తర్వాత ఆమే తన కొడుకుకు తగిన ఇల్లాలు అని భావించారు. అప్పటికే పుష్పవతి ప్రీ-యూనివర్సిటీ కోర్సు పూర్తి చేసింది. తండ్రి తలచినట్టుగానే తర్వాత కొంత కాలానికి సాంబశివరావు, పుష్పవతి దంపతులయ్యారు.

సంతోషంగా జీవిత ప్రయణాన్ని కొనసాగిస్తున్న సాగుతున్న సాంబశివరావు పుష్పవతి దంపతులకు మరింత సంతోషాన్ని కలిగించేలా మొదటి సంతానంగా అరుంధతి అరుదెంచింది. 1942లో రెండో సంతానంగా పుట్టిన అబ్బాయే ఉపేంద్రనాథ్. మూడో సంతానం అమ్మాయి ప్రఫుల్ల, నాలుగో సంతానంగా కుమారుడు లోక్‌నాథ్ బాబు కలిగారు.

వృత్తికే జీవితాన్ని అంకితం చేసిన సాంబశివరావు తన ఆరోగ్యాన్ని విస్మరించారు. రాత్రింబవళ్లు రోగుల చికిత్సలో నిమగ్నమవడం ఆయన శరీరంపై ప్రతికూల ప్రభావం చూపింది. బ్లడ్ ప్రెషర్ పెరిగిపోయేది. వైద్యుడిగా ఎంతో ఖ్యాతి తెచ్చుకున్న సాంబశివరావును హైపర్‌టెన్షన్ పట్టి పీడించింది. అది క్రమంగా ఆయన గుండె, మెదడు, మూత్రపిండాలను కబళించింది. రోగులకు చికిత్స అందించడంలో అలుపెరగకుండా పాటుపడిన సాంబశివరావుకు ఓ రోజున గుండెపోటు తీవ్రంగా వచ్చింది. ఆ అపర ధన్వంతరి ప్రాణాలను హరించింది. పేదల పాలిట కల్పతరవు శాశ్వతంగా కనిపించకుండా పోయారు.

తెనాలి, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో సాంబశివరావు మరణం అంతులేని విషాదాన్ని నింపింది. కుటుంబం తల్లడిల్లిపోయింది. భర్త మరణవార్త తెలిసి పుష్పవతి స్పృహ కోల్పోయారు. తల్లి పరిస్థితి చూసి పిల్లలు మరింత డీలా పడిపోయారు. తండ్రి చనిపోయేనాటికి లోక్‌నాథ్ బాబు ఇంకా చంటిపిల్లాడే. ఏడేళ్ల ఉపేంద్రనాథ్ ఆ విషాదాన్ని కళ్లారా చూశారు. లోలోపల కుమిలిపోతున్న తన తల్లి బాధను ఉపేంద్రనాథ్ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు. ఆ దుర్ఘటనే తల్లి పుష్పవతిని కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకునేలా చేసింది.

## 3. సంకల్పం:

# పిల్లల కోసం మాతృమూర్తి ప్రతిజ్ఞ

భర్తను కోల్పోయిన పుష్పవతిని ఆమె సోదరుడు కొసరాజు సుబ్బారావు తన ఇంటికి పిలిపించుకున్నాడు. పిల్లలతో పుష్పవతి తన పుట్టిల్లు చేరింది. తెనాలి, గుంటూరు పట్టణాల మధ్య ఉండే సంగం జాగర్లమూడిలో పుష్పవతి సోదరుడు, బంధువులు ఉండేవారు. పుష్పవతికి తండ్రి లేరు. ఆమెనూ, ఆమె పిల్లల బాధ్యతను తల్లి సీతారామాంజమ్మ, సోదరుడు సుబ్బారావు తీసుకున్నారు.

సంగం జాగర్లమూడి చేరిన వెంటనే పెద్ద కూతురు అరుంధతిని, పెద్ద కుమారుడు ఉపేంద్రనాథ్‌ను సమీపంలోని పంచాయతీ పాఠశాలలో చేర్పించారు పుష్పవతి. చక్కని వసతి సదుపాయాలతో కూడిన ప్రభుత్వ పాఠశాల అది. చెట్ల కింద, అరుగుల మీద పిల్లలు పాఠాలు చదువుకునే ఆ రోజుల్లోనే ఆ పాఠశాలలో విద్యార్థుల కోసం చక్కని బల్లలు, కుర్చీలు ఉండేవి.

ఆ రోజుల్లో పరోపకారిగా ఎంతో పేరు తెచ్చుకున్న కొత్త రఘురామయ్య పాఠశాల నిర్మాణం కోసం తన భూమిని ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చారు. అంతే కాదు పాఠశాల భవన నిర్మాణం, విద్యార్థులకు అవసరమైన ఫర్నీచర్ కోసం ఉదారంగా ధనాన్ని అందించారు. ఆ తర్వాత కాలంలో ఆయన పార్లమెంట్‌కు ఎన్నికై కేంద్రంలో మంత్రిగానూ పనిచేశారు.

ఉపేంద్రనాథ్ అమ్మమ్మ ఇంటి నుంచి ఆ పాఠశాల దాదాపు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉండేది. ఊరి పిల్లలతో కలిసి రోజూ పాఠశాలకు నడిచే వెళ్లేవారు. స్నేహితులతో మాట్లాడుతూ, ఆడుతూ వెళ్లడం వలన ఆ దూరం తెలిసేది కాదు. సంగమేశ్వర్, కిచ్చయ్య, మాధవ రెడ్డిలతో ఉపేంద్రనాథ్‌కు బలమైన స్నేహం ఏర్పడింది.

క్రమశిక్షణకు మారుపేరు ఆ పాఠశాల. ఎల్లప్పుడూ తరగతులు జరుగుతూ ఉండడంతో ఆ పాఠశాల ఆ ప్రాంతంలోని మిగిలిన వాటన్నీటికంటే చాలా భిన్నంగా ఉండేది. ఇతర పాఠశాలలతో పోల్చితే ఇక్కడ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఎంతో మెరుగ్గా ఉండేది. ఆ రోజుల్లో బోర్డు పరీక్షల్లో పాసవడమంటే మాటలు కాదు. అతి కొద్ది మంది విద్యార్థులు మాత్రమే ఆ పరీక్షల్లో గట్టెక్కేవారు. ఎంతో అనుభవశీలురైన ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన బోధనను విద్యార్థులకు అందించడంపైనే దృష్టి నిలిపేవారు. అంకితభావం కలిగిన ఆ ఉపాధ్యాయుల కారణంగా చదువుల్లో ఉపేంద్రనాథ్‌కు ఆసక్తి పెరిగింది. సామాన్య శాస్త్రం, గణితం అతన్ని బాగా ఆకర్షించిన విషయాలు. పాఠశాలలో నిర్వహించే ప్రతీ కార్యక్రమంలోనూ ఉపేంద్రనాథ్ ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవారు. చదువుతో పాటుగా స్నేహితులతో కలిసి తిరగడం, ఆడుకోవడం ఉపేంద్రనాథ్ నిత్యకృత్యంగా మారింది.

ఇద్దరు ఉపాధ్యాయులు ఉపేంద్రనాథ్‌పై తీవ్రమైన ప్రభావం చూపారు. వారిలో మొదటి వారు కొత్త రాజ బాబయ్య. ఆయన మాటలు విద్యార్థుల మనస్సుల్లో నాటుకుపోయేవి. విద్యార్థుల పరిజ్ఞానం పెరిగేలా ఆయన బోధనా శైలి ఉండేది. తమ పాఠశాలలో చదివే ప్రతీ విద్యార్థి బోర్డు పరీక్షల్లో విజయం సాధించి గొప్ప వ్యక్తులుగా ఎదగాలని ఆయన కాంక్షించేవారు.

ఉపేంద్రనాథ్‌ను బాగా ప్రభావితం చేసిన మరో ఉపాధ్యాయుడు బావయ్య చౌదరి. పాఠశాలలో క్రమశిక్షణను కాపాడేందుకు ఎంతో నిక్కచ్చిగా ఉండేవారు. అదే సమయంలో బావయ్య చౌదరి చదువుపరంగా విద్యార్థుల్లో నిరంతరం ప్రేరణ నింపేవారు. అయితే ఉపేంద్రనాథ్ తెలివైన విద్యార్థి అయినప్పటికీ తరగతిలో ఉన్నతంగా నిలవకపోయేవాడు. సైన్స్, గణితంలో చక్కగా రాణించినా ఇంగ్లిష్, తెలుగులో బాగా వెనుకబడి పోయేవాడు. సైన్స్ గురించి మాట్లాడటం, తెలుసుకోవడం ఉపేంద్రనాథ్‌కు ఎంతో ఆసక్తికరంగా ఉండేది. కానీ, మొదటి నుంచి సాహిత్యం, వ్యాకరణాన్ని ఒకింత దూరం పెట్టేవారు.

భర్త మరణం తర్వాత తన నలుగురు పిల్లలను డాక్టర్లుగా రాణింపజేయాలని పుష్పవతి భావించారు. అందుకే సమాజంలో వైద్యులు పొందే గౌరవాన్ని పిల్లలకు తెలియజెప్తూ వారికి నచ్చజెప్పారు. ప్రజలు తన భర్తను దేవుడిలాగా ఎలా కొలిచేవారో కళ్లారా చూశారామె. ఆయన పేరు ప్రఖ్యాతులు పుష్పవతి మనస్సుల్లో పదిలంగా నిలిచిపోయాయి. తన సంతానం నలుగురూ వైద్యులుగా ఎదిగి దేశానికి సేవ చేయాలనే ఏకైక తలంపు ఆమెది.

ప్రేమించిన భర్తను కోల్పోయినా పుష్పవతి తన కల ద్వారా ఆ బాధ నుంచి కొంత తెరిపినపడేవారు. తన ఆలోచనను ప్రతీ రోజు పిల్లలకు తెలియజెప్పేవారు పుష్పవతి. తండ్రిలాగా పెద్ద పేరు తెచ్చుకోవాలని ఉద్బోధ చేసేవారు. అదే సమయంలో ఆ కల సాకారం

చేసుకోవడం అంత సులభమైన విషయమేమీ కాదని కూడా పిల్లలను హెచ్చరించేవారు. డాక్టరు కావాలంటే ఎంతగానో శ్రమించాలనే విషయాన్ని పిల్లలకు చిన్నప్పటి నుంచే నూరిపోసేవారు పుష్పవతి. చిత్తశుద్ధి, కఠోర శ్రమ లేకుండా ఏ ప్రయత్నమూ ఫలించదని సున్నితంగా మందలించేవారు. ముందుకు సాగాలంటే కష్టాలు అనుభవించాల్సిందేనని బోధించేవారు. తల్లి తపనను నలుగురు పిల్లలు అర్థం చేసుకునేవారు. కానీ తన కల నిజం కాకపోతే తన పరిస్థితి ఏంటి అనే విషయం ఆమెకే తెలియదు.

డాక్టరు కావాలంటే ఏం చేయాలి? ఏం చదవాలి? అనేది స్కూల్‌కు వెళ్లే పిల్లలు పెద్దగా తెలిసి ఉండదు. కానీ తల్లి మాటల ప్రభావంతో వారంతా చదవుల్లో చక్కగా రాణించారు. ప్రతీ పరీక్షలోనూ మంచి మార్కులు సంపాదించేందుకు ఉపేంద్రనాథ్ తీవ్రంగా కృషి చేసేవారు.

పెద్ద కూతురు అరుంధతి పరీక్షల్లో తప్పడం పుష్పవతిని తీవ్రంగా కల్లోలపరచింది. చదువులపై తనకు పెద్దగా ఆసక్తి లేదని తల్లికి వివరించింది అరుంధతి. దాన్ని అర్థం చేసుకున్న తల్లి, కూతురిని ఒత్తిడి చేయలేదు. తనకు నచ్చిన పని చేసుకునేందుకు కూతురికి స్వేచ్ఛను ఇచ్చింది.

అరుంధతి కంటే ఉపేంద్రనాథ్ చిన్నవాడైనా తెలివితేటల్లో మాత్రం పెద్దవాడే. తన తల్లి కలలు సాకారం చేయాల్సిన బాధ్యత ఇప్పుడు తన భుజస్కంధాలపైనే ఉందనే విషయాన్ని గ్రహించాడు. చదువులపై మరింత శ్రద్ధ నిలిపాడు. పదో తరగతికి వచ్చేనాటికి ఎంత కష్టపడాలో ఆయనకు అర్థమైంది. తరగతిలో ముందు వరసలో నిలవకపోయినా బోర్డు పరీక్షల్లో మాత్రం చక్కని మార్కులతో ఉపేంద్రనాథ్ ఉత్తీర్ణుడవుతాడని పాఠశాల ఉపాధ్యాయులంతా భావించారు. వారిని ఉపేంద్రనాథ్ నిరాశపరచలేదు. 1955లో ఆయన 55 శాతం మార్కులతో బోర్డు పరీక్షల్లో విజయం సాధించాడు. ఆ రోజుల్లో అవి ఎంతో పెద్ద మార్కులు. చాలా పాఠశాలల్లో విద్యార్థులు ఈ పరీక్షల్లో తప్పేవారు. ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణుడు కాని పాఠశాలలు అనేకం ఉండేవి ఆ రోజుల్లో. ఉపేంద్రనాథ్‌తో చదివిన చాలా మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో గట్టెక్కలేకపోయారు. ఇంకా విశేషమేంటంటే ఆ సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో అతి పిన్న వయస్కుడు ఉపేంద్రనాథ్. పదమూడో ఏటనే ఆయన పదో తరగతి పూర్తి చేశారు. కష్టపడి చదివే తన కుమారుడు పదో తరగతి పరీక్ష పాసయ్యాడని తెలియగానే పుష్పవతి పొంగిపోయారు. భవిష్యత్‌లో తన కుమారుడు గొప్ప డాక్టరవుతాడని అంచనా వేసుకుంది.

# 4. తొలగిన భ్రమలు:

# భయంగొల్పే అవరోధాలను ఎదుర్కోవడం

ఉన్నత చదువుల కోసం కుమారుడు ఉపేంద్రనాథ్‌ను మంచి కళాశాలలో చేర్పించాలని పుష్పవతి భావించారు. అన్ని కోణాల్లో అన్నివిషయాలను జాగ్రత్తగా పరిశీలించిన ఆమె విజయవాడలో కొత్తగా నెలకొల్పిన ఆంధ్రా లయోలా కాలేజీ తగినదని అనుకున్నారు. సొసైటీ ఆఫ్ జీసస్‌కు చెందిన బిషప్‌లు ఆ కళాశాలను నెలకొల్పారు. బ్రిటీష్ వారి పాలనా సమయంలో మద్రాసు రాష్ట్రంలో సొసైటీ ఆఫ్ జీసస్ సంస్థ అనేక చోట్ల విద్యా సంస్థలు ఏర్పాటు చేసింది. విద్యార్థులకు అవసరమైన సంపూర్ణ మౌలిక వసతులు ఉండేలా సంస్థ చూసుకునేది. ఉపాధ్యాయుల ఎంపికలోనూ ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ అర్హత, అనుభవం కలిగినవారిని మాత్రమే నియమించేది.

సొసైటీ ఆఫ్ జీసస్ సంస్థ మద్రాసు నగరంలో (ప్రస్తుతం చెన్నై) 1925లో ప్రైవేట్ విద్యా సంస్థగా లయోలా కాలేజీని నెలకొల్పింది. కాలేజీ ఏర్పాటులో పాస్టర్ ఫ్రాన్సిస్ బెర్ట్రామ్ ఎంతో కీలక పాత్ర పోషించారు. 1870 జూలై 23న ఫ్రాన్స్‌లో పుట్టిన ఆయన మత ప్రచారం కోసం భారత్ వచ్చారు. అప్పట్లో మధురై మిషన్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న పాస్టర్ బ్యూటెల్యాంట్ మార్గదర్శకత్వంలో పనిచేశారు. 1908 నుంచి 1916 వరకు తిరుచ్చిలోని సెయింట్ జోసెఫ్ కాలేజీకి బెర్ట్రామ్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఆయన కఠిన శ్రమ, దూరదృష్టి, అంకితభావం కారణంగా సెయింట్ జోసెఫ్ కాలేజీ ఒక సమున్నతమైన విద్యా సంస్థగా పేరు అర్జించింది.

ఇలాంటి వినూత్నమైన విద్యా సంస్థ రాష్ట్రంలోని అతిపెద్ద నగరమైన మద్రాసులోనూ ఉండాలని బెర్ట్రామ్ తలపోశారు. దాన్ని నెలకొల్పాలని ఆయన సంకల్పించారు. 1925 నాటికి ఆయన శ్రమ ఫలించింది. ఆ కాలేజీకి వ్యవస్థాపక ప్రిన్సిపల్‌గా బెర్ట్రామ్ బాధ్యతలు

చేపట్టారు. నాణ్యమైన విద్యను అందించడంతో అనతి కాలంలోనే లయోలా కాలేజీ గురించి దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది.

లయోలా కాలేజీలో చదివేందుకు ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు రావడం మొదలైంది. కానీ ఆ కాలేజీలో ప్రవేశానికి చదవాలనే తపన ఒక్కటే సరిపోదు, ఒకటి నుంచి పదవ తరగతి వరకు అన్నింటిలోనూ మంచి మార్కులు సాధించి ఉండాలి. (నేటికి ఈ కాలేజీలో ప్రవేశానికి ఇదే ప్రమాణం). మార్కులను బట్టి విద్యార్థులను వడపోసి ఆ తర్వాత ఇంటర్వ్యూకు పిలిచేవారు. ఆ ఇంటర్వ్యూ ఆధారంగా చేర్చుకునే విద్యార్థుల జాబితాను కాలేజీ ప్రకటించేది. లయోలా కాలేజీలో ప్రవేశం దొరకడమంటే నేటికీ ఒక గొప్ప విషయమే. ఆ కాలేజీలో సీటు దొరికిందంటే ఆ విద్యార్థి జీవితం ఉన్నతంగా ఉంటుందని భరోసా. అక్కడ బోధించే ఉన్నత శ్రేణి పాఠాలు విద్యార్థులను ఇంజినీర్లు, డాక్టర్లు, శక్తిమంతమైన అధికారులుగా మార్చడంలో ఎంతో కీలకంగా ఉపయోగపడతాయి. చదువులపరంగా గొప్ప పేరుండటంతో దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఆ కాలేజీలో చేరేందుకు తహతహలాడేవారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత లయోలా కాలేజీలో ప్రవేశాలు పొందేందుకు ఆంధ్రా ప్రాంత విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని సొసైటీ ఆఫ్ జీసస్ గుర్తించింది. కాలేజీలో చేరిన తర్వాత చదువుకునేందుకు కుటుంబాన్ని వదిలి దూరాలకు వస్తున్న పరిస్థితులు, ఆర్థికంగా ఎదురయ్యే సమస్యలు తెలుసుకుంది.

లయోలా కాలేజీలో ఉన్న ప్రమాణాలతో విజయవాడలో విద్యాసంస్థను ఏర్పాటు చేయాలని గుంటూరుకు చెందిన ఇగ్నేషియస్ ముమ్మడి, ఇతర మత ప్రముఖులు సొసైటీ ఆఫ్ జీసస్ సంస్థకు విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తి మేరకు సొసైటీకి చెందిన కరణం దేవయ్య, మధురై నుంచి విజయవాడ వచ్చి కాలేజీ ఏర్పాటుకు సంబంధించిన ప్రయత్నాలు ప్రారభించారు. సంస్థ లక్ష్యాలు తెలియడంతో స్థానిక సంఘ సేవకులు చాలా మంది తమ తోడ్పాటు అందించారు. అలాంటి వారి సహకారంతో 111 ఎకరాల సువిశాల స్థలంలో 1953లో విజయవాడలో ఆంధ్ర లయోలా కాలేజీ ఏర్పాటు అయింది. కళాశాల మొదటి ప్రిన్సిపల్ థిరో మథియాస్.

1954లో ఆంధ్రా లయోలా కాలేజీలో తరగతులు ప్రారంభమైయ్యాయి. అత్యంత ప్రతిభావంతులు ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. విద్యార్థుల ఎంపికకు సంబంధించి మద్రాసులో అనుసరించిన ప్రమాణాలే ఇక్కడ పాటించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్యకు చక్కని సంస్థ ఆంధ్రా లయోలా కాలేజీయేనని పుష్పవతి తెలుసుకున్నారు. ఆ కారణంతోనే ఆమె తన కుమారుడికి ఈ కొత్త కాలేజీలో చేర్పించాలని

భావించారు. మిగతా విద్యార్థులతో పోల్చితే పదో తరగతిలో ఉపేంద్రనాథ్ మార్కులు ఎక్కువే కావడంతో ఆయనకు ప్రవేశం లభించింది. ఇంటర్వ్యూలోనూ ఉపేంద్రనాథ్ తన జ్ఞానాన్ని, ధైర్యాన్ని చూపారు. సీటు సంపాదించారు.

ఆంధ్రా లయోలా కాలేజీ రెండో బ్యాచ్‌లో ఉపేంద్రనాథ్ భాగమయ్యారు. డాక్టరు కావాలన్న తన తల్లి ఆకాంక్ష మేరకు సైన్స్, మ్యాథ్‌ను ఎంచుకున్నారు. ఆ రోజుల్లో పదో తరగతి తర్వాత ప్రీ-యూనివర్సిటీ కోర్సును విద్యార్థులు చేయాలి. రెండేళ్ల ఆ కోర్సులో మూడు విభాగాలు ఉండేవి: సైన్స్, కామర్స్, ఆర్ట్స్, హ్యూమానిటీస్. సైన్స్ విభాగంలో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీని ప్రధాన విషయాలుగా ఎంచుకున్నారు ఉపేంద్రనాథ్.

ఉపేంద్రనాథ్ ఉంటున్న ఊరి నుంచి కాలేజీ యాభై కిలోమీటర్ల దూరంలో ఉండటంతో, అతను హాస్టల్‌లో ఉండటం సబబని భావించింది తల్లి పుష్పవతి. కొత్త కాలేజీ కావడంతో ఇంకా హాస్టళ్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం తాత్కాలిక హాస్టళ్లు నెలకొల్పారు. ఈ తాత్కాలిక హాస్టళ్లు గుడిసెల మాదిరిగా ఉండేవి. అలాంటి గుడిసెల్లోనే ఉంటూ ఉపేంద్రనాథ్ తన రెండేళ్ల ప్రీ-యూనివర్సిటీ కోర్సు పూర్తి చేశారు. తనను డాక్టరుగా చూడాలన్న తన తల్లిని నిరాశపడకుండా చూసేందుకు ఉపేంద్రనాథ్ ఏనాడు తన చదువులను అలక్ష్యం చేయలేదు. ఫలితంగా మంచి మార్కులతో ప్రీ-యూనివర్సిటీ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు. పదిహేనేళ్లకే ప్రీ-యూనివర్సిటీ పరీక్ష పాసైన ఏకైక విద్యార్థి ఉపేంద్రనాథ్.

ఆ రోజుల్లో ప్రీ-యూనివర్సిటీ మార్కులను బట్టి మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలు ఉండేవి. మంచి మార్కులు రావడంతో ఎంబిబిఎస్ చేసేందుకు ఆయనకు అర్హత లభించింది కానీ, వయస్సు అడ్డంకిగా మారింది. వైద్య విద్యలో చేరాలంటే విద్యార్థి వయస్సు కనీసం పదిహేడు సంవత్సరాలు ఉండాలి. మార్కులపరంగా ఎంతో ముందంజలో ఉన్నప్పటికీ వయస్సు కారణంగా ఉపేంద్రనాథ్ వెనుకబడిపోయారు.

ఇది ఆయన తల్లిని అంతులేని నిరాశకు గురిచేసింది. దాన్నుంచి బయటపడేందుకు ఆమెకు చాలా కాలం పట్టింది. తన పెద్ద కుమారుడు వైద్యుడి కాలేడని భావించిన ఆమె, చిన్నవారైన ప్రఫుల్ల, లోక్‌నాథ్‌పై ఆశలు పెంచుకుంది.

## 5. తలుపు తట్టిన అదృష్ట దేవత:
## కుటుంబానికి కొత్త అవకాశం

ముందు చదువుల కోసం ఉపేంద్రనాథ్ బ్యాచిలర్ అఫ్ సైన్స్ (బీ.ఎస్సీ)లో చేరారు. అదృష్టమో, బహుశా ఆయన తల్లి పూజల ఫలమో తెలియదు కానీ, ఆ యువకుడు వైద్యరంగం వైపు మరలేలా కొన్ని సంఘటనలు చోటుచేసుకున్నాయి.

దేశవ్యాప్తంగా అనేక విద్యా, పరిశోధన సంస్థలు ఏర్పాటు చేస్తున్న ఆ రోజుల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందుతోంది. వైద్య పరిశోధన, విద్యకు కూడా చేయూత లభించేంది. అదే సమయంలో రాష్ట్రాల పునర్విభజన చోటుచేసుకుంది. రాష్ట్రాల పునర్విభజనలో ఆంధ్ర ప్రాంత ప్రజలు కీలక పాత్ర పోషించారు. అప్పట్లో ఆంధ్రా ప్రాంతం మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉండేది. స్వాతంత్ర్యనంతరం ఈ ప్రాంతంపై తమిళుల ఆధిపత్యం పెరిగింది. తాము అణిచివేతకు గురవుతున్నామని, తమ సాంస్కృతిక, భాష గుర్తింపును కోల్పోతున్నామన్న ఆందోళన తెలుగు ప్రజల్లో పెరిగింది. ఆ రోజుల్లో ఉత్తరాది వాళ్లు, పశ్చిమ ప్రాంతం వాళ్లు తెలుగు మాట్లాడేవారిని మద్రాసీలని పిలిచేవారు. అలా పిలిపించుకోవడాన్ని తెలుగు ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలనే డిమాండ్ బాగా పెరిగిపోయింది. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం గాంధేయవాది పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. 56 రోజుల నిరాహార దీక్ష తర్వాత డిసెంబర్ 15, 1952న పొట్టి శ్రీరాములు అమరజీవి అయ్యారు. ఆయన మరణంతో ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం తారస్థాయికి చేరింది. ఆ క్రమంలో ఆంధ్ర ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రకటించారు. కోస్తా, రాయలసీమ ప్రాంతం కొత్త రాష్ట్రంలో భాగమై పోయింది. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు బాధ్యతలు చేపట్టారు. ఈ ఉద్యమంతో భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్

దేశవ్యాప్తంగా తీవ్రతరమైంది. దీంతో రాష్ట్రాల పునర్విభజన కమిషన్ ఏర్పాటు చేయాలని కేంద్ర నిర్ణయించింది.

స్వాతంత్ర్య భారతదేశంలో డిసెంబర్ 22, 1953న జస్టిస్ ఫజల్ అలీ ఛైర్మన్‌గా మొట్టమొదటి రాష్ట్రాల పునర్విభజన కమిషన్ ఏర్పాటైంది. హృదయనాథ్ కుంజ్రూ, కె.ఎం.ఫణిక్కర్ ఆ కమిషన్‌లో ఇతర సభ్యులు. ఆ ముగ్గురు రాజనీతిజ్ఞులతో కూడిన కమిషన్ దేశవ్యాప్తంగా ఉన్న పరిస్థితిని అధ్యయనం చేసి, రాజకీయ నాయకులు, మేధావులతో సంప్రదింపులు జరిపి డిసెంబర్ 30, 1955న తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. రాష్ట్రాల పునర్విభజనకు జాతీయ సమగ్రత, పరిపాలనా, ఆర్థికపరమైన సాధ్యాసాధ్యాలు, ఆర్థిక అభివృద్ధి, భాష, మైనార్టీల ప్రయోజనాల పరిరక్షణ వంటి వాటిని పునర్విభజనకు ప్రాతిపదికగా తీసుకోవాలని కమిషన్ స్పష్టం చేసింది. కమిషన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. రాష్ట్రాల పునర్విభజన చట్టాన్ని 1956లో పార్లమెంట్ ఆమోదించింది. ఆ క్రమంలో స్వాతంత్ర్య భారతదేశంలో 14 రాష్ట్రాలు, ఆరు కేంద్రపాలిత ప్రాంతాలు ఏర్పాటయ్యాయి. దక్షిణాదిన తమిళుల కోసం తమిళనాడు, తెలుగు మాట్లాడేవారి కోసం ఆంధ్రప్రదేశ్, మలయాళం మాట్లాడేవారి కోసం కేరళ, కన్నడిగుల కోసం కర్ణాటక ఏర్పాటయ్యాయి.

నవంబర్ 1, 1956న కొత్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైంది. అప్పటి వరకు నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ ప్రాంతం కూడా ఆంధ్రప్రదేశ్‌లో భాగమైపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణను చేర్చడం చాలా మందికి నచ్చలేదు. తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఉంచాలనే వాదనలు వినిపించాయి. ప్రస్తుత ఏర్పాటును అంగీకరించాలని అసంతృప్తి వ్యక్తం చేసినవారిని నెహ్రూ బుజ్జగించారు. ముఖ్యమైన విషయమేంటంటే మొత్తం తెలంగాణ ప్రాంతంతో పాటు, మరాఠీ, కన్నడ మాట్లాడే కొన్ని ప్రాంతాలు కూడా అప్పట్లో నిజాం పాలనలో హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా ఉండేవి. ఆగస్టు 15, 1947న భారతదేశం స్వాతంత్ర్యం పొందిన సమయంలో హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు నిజాం నిరాకరించారు. హైదరాబాద్‌ను ప్రత్యేక దేశంలో ఉంచాలన్నది ఆయన అభిమతం. ఈ క్రమంలో తన లక్ష్యాన్ని సాధించుకునేందుకు ఆయన పాకిస్తాన్ నుంచి సాయం పొందే ప్రయత్నం చేశారు. కానీ, అప్పటి ప్రముఖ నాయకుల్లో చాలా మంది హైదరాబాద్ భారత్‌లో విలీనం కావాలని ఆకాంక్షించారు. ఆగస్టు 15న భారతదేశంలోని దాదాపు అన్ని ప్రాంతాలు స్వాతంత్ర్యం పొందినా హైదరాబాద్ సంస్థానం మాత్రం స్వేచ్ఛ కోసం పోరాటం చేస్తూనే ఉంది. హైదరాబాద్ రాష్ట్రంలో జనాభాలో ఎక్కువ మంది హిందువులే, కానీ పాలించే ప్రభువు మాత్రం ముస్లిం. బ్రిటీష్ వారు దేశం విడిచివెళ్లిన తర్వాత హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని హిందువులంతా

భావించారు. కానీ పాకిస్తాన్ తరహాలో ముస్లిం రాజ్యంగా హైదరాబాద్ ఉండాలన్నది నిజాం ఆలోచన. నిజాం నిర్ణయాన్ని ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకించారు. నిరసనను అణిచివేసేందుకు నిజాం తీవ్రమైన చర్యలకు పాల్పడ్డారు. ప్రజలను హింసించేందుకు నిజాం ఆధ్వర్యంలో ఖాసిం రిజ్వి నేతృత్వంలో రజాకర్ సైన్యం రూపుదిద్దుకుంది. ఇక్కడి ప్రజల విజ్ఞప్తుల మేరకు అప్పటి భారత హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్, "పోలీస్ చర్య" చేపట్టేందుకు భారత సైన్యాన్ని పంపించారు. సెప్టెంబర్ 18, 1948న నిజాం సైన్యం భారత సైన్యానికి లొంగిపోవడంతో హైదరాబాద్ రాజ్యం భారతదేశంలో విలీనమైంది.

రాష్ట్రాల పునర్విభజన కమిషన్‌ను ప్రధానమంత్రి నెహ్రూ ఏర్పాటు చేసిన సమయంలో తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో తెలుగు మాట్లాడే ప్రజలే ఎక్కువుండటంతో తెలంగాణ, ఆంధ్రను విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చర్యను చాలా మంది తెలంగాణ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. రాష్ట్రాల పునర్విభజనకు భాషను ప్రాతిపదికగా తీసుకోవడంతో, అసంతృప్తితో ఉన్న హైదారాబాద్ రాష్ట్ర నాయకులను నెహ్రూ బుజ్జగించారు. హైదరాబాద్ సంస్థానంలోని మరాఠీ మాట్లాడే ప్రాంతాలను మహారాష్ట్ర పరిధిలోకి, కన్నడ మాట్లాడే ప్రాంతాన్ని కొత్తగా ఏర్పాటు చేసిన కర్ణాటక రాష్ట్రంలోకి బదలాయించారు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలతో కలిసి తెలుగు ప్రజలకోసం ఆంధ్రప్రదేశ్ అనే నూతన రాష్ట్రం రూపుదిద్దుకుంది.

కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా నీలం సంజీవరెడ్డి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర బహుముఖ అభివృద్ధి కోసం నాయకులు శ్రమించారు. కొత్త రాష్ట్రం అభివృద్ధిపథంలో సాగాలని ఆకాంక్షించారు.

ఆ రోజుల్లో ప్రముఖ రాజకీయ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడైన మండలి వెంకటకృష్ణారావు దేశ ప్రజల భవిష్యత్ కోసం చరిత్రలో నిలిచిపోయే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టాలని తలపోశారు. మద్రాసు రాష్ట్రంలో ముఖ్యమంత్రి చక్రవర్తుల రాజగోపాలాచారి కేబినెట్‌లో ఆయన విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. విద్యా, వైద్యరంగంలో ప్రజలకు సేవ చేయాలన్నది ఆయన ఆకాంక్ష. ఆంధ్రా ప్రాంతంలో కొత్తగా వైద్యకళాశాల ప్రారంభించాలని భావించారు. అదే సమయంలో ఆంధ్ర ప్రాంత అభివృద్ధికి ఇక్కడి ప్రజల బాగోగుల కోసం మరో రాజకీయనాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, దానశీలి దాట్ల సత్యనారాయణ రాజు రాత్రింబవళ్లు కృషి చేశారు.

పశ్చిమ గోదావరి జిల్లా పోడూరులో ఆగస్టు 28, 1904న జన్మించిన సత్యనారాయణరాజు ఒక తెలివైన విద్యార్థి. విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీ నుంచి ఎంబిబిఎస్ డిగ్రీ పొందారు. లండన్, వియన్నాలో తదుపరి చదువులు

కొనసాగించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు వ్యక్తిగత వైద్యుడిగా పనిచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1957 ఎన్నికల్లో ఆయన రాజమండ్రి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. గోదావరి జిల్లాల్లో ఆధునిక వైద్యసదుపాయాలు లేకపోవడం ఆయనను కలిచివేసింది. ఆ ప్రాంతంలో ఒక గొప్ప మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని ఆయన సంకల్పించారు. ప్రభుత్వం నుంచి ఆ దిశగా ఎటువంటి చొరవ లేకపోవడంతో ఆయన ప్రైవేట్ మెడికల్ కాలేజీ స్థాపించాలని నిర్ణయించారు.

కృష్ణారావు, సత్యనారాయణ రాజు ప్రయత్నాల్లో సారూప్యత ఇద్దరినీ ఏకం చేసింది. మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసేందుకు ఇద్దరు ప్రముఖ రాజకీయ నాయకులు కృషి చేస్తున్నారని తెలియడంతో వారికి సాయపడేందుకు అనేక మంది ముందుకు వచ్చారు. లక్కరాజు సుబ్బరాజు నివాసంలో జరిగిన సమావేశంలో వైద్య కళాశాల ఎలా ఉండాలనే దానిపై ఒక నమూనా రూపొందించారు. ఆ సమావేశంలో ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి కూడా పాల్గొన్నారు. పిఠాపురం మహారాజు వెంకట కుమార్ మహీపతి సూర్యారావు తన రాజభవనాన్ని కళాశాల కోసం విరాళంగా ఇస్తానని ప్రకటించారు. పరోపకారి కోటమర్రి వెంకన్న తనకు చెందిన ఆరున్నర ఎకరాల స్థలాన్ని వైద్య కళాశాలకు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ ఐదు లక్షల రూపాయల భూరి విరాళాన్ని అందజేశారు. అలా చాలా మంది ప్రజలు విరాళాలు అందజేశారు.

వారందరి భూరి విరాళాలతో కాకినాడలో వైద్య కళాశాల ఏర్పాటైంది. కళాశాల ఏర్పాటుకు భారీ విరాళం ఇచ్చిన ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ గారి బావగారు పెండ్యాల శ్రీరామచంద్ర వెంకటకృష్ణ రంగారావు (రంగా) పేరిట ఆ కళాశాలకు రంగరాయ వైద్య కళాశాలగా నామకరణం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అదే మొదటి ప్రైవేట్ వైద్య కళాశాల. శరీర ధర్మశాస్త్రంలో నిష్ణాతుడు, పట్నా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి బాసుదేవ్ నారాయణ్ కళాశాల మొదటి ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు.ఇండియన్ మెడికల్ కౌన్సిల్‌కు ఆయన అప్పట్లో ఉపాధ్యక్షుడిగా ఉండేవారు. అనాటమీ విభాగం మొదటి ప్రొఫెసర్‌గా డాక్టర్ ఎస్.ఎల్.బోస్, బయో కెమిస్ట్రీ మొదటి ప్రొఫెసర్‌గా డాక్టర్ డి.నారాయణ రావు నియమితులయ్యారు. బోధనా సిబ్బందిగా అత్యంత ప్రతిభావంతులను మాత్రమే నియమించేలా మేనేజ్‌మెంట్ అన్ని చర్యలు చేపట్టింది.

ప్రైవేట్ రంగంలో కాకినాడలో వైద్య కళాశాల ఏర్పాటైందని విషయం తెలియగానే పుష్పవతిలో కొత్త ఆశలు చిగురించాయి. ఉపేంద్రనాథ్‌ను డాక్టర్‌గా చూడాలనుకున్న ఆశలు తిరిగి ప్రాణం పోసుకున్నాయి. చదువుకున్న స్త్రీ కావడం, క్రమం తప్పకుండా దినపత్రికలు

చదవడం వలన చుట్టు పక్కల జరుగుతున్న విషయాలు ఆమెకు అవగతమవుతుండేవి. ఆమె దృష్టంతా తన పిల్లల చదువులపైనే. తన పిల్లలు వైద్య వృత్తిలో ప్రవేశించాలన్నది ఆమె కల. విద్యారంగానికి సంబంధించిన పత్రికల్లో కనిపించే చిన్న విషయమైనా, పెద్ద విషయమైనా ఆమె నిశితంగా పరిశీలించేవారు.

కాకినాడలో రంగరాయ మెడికల్ కాలేజీ ఏర్పాటు పుష్పవతికి ఎంతో సంతోషం కలిగించింది. ఏ మాత్రం జాప్యం చేయకుండా తన కుమారుడు ఉపేంద్రనాథ్‌ను ఆ కాలేజీలో చేర్పించాలని అనుకున్నారు. ప్రైవేట్ కాలేజీ కాబట్టి విద్యార్థుల ఎంపికపై మేనేజ్‌మెంట్‌దే తుది నిర్ణయం.

కొత్త కాలేజీ కాబట్టి, దాతల కోసం మేనేజ్‌మెంట్ అన్వేషిస్తుండేది. ఎంబిబిఎస్ కోర్సుకు ఫీజు ఇంత అని నిర్ణయించారు. కానీ, కళాశాల అభివృద్ధికి విరాళాలు అందించేందుకు ముందుకు వచ్చే తల్లిదండ్రులున్న విద్యార్థులకు ప్రాధాన్యత ఇచ్చేవారు.

ఉపేంద్రనాథ్‌కు ప్రవేశం కల్పించాలంటే ఆరు వేల రూపాయల విరాళంగా ఇవ్వాలని రంగరాయ కాలేజీ షరతు విధించింది. ఏ మాత్రం సంశయించకుండా ఆ మొత్తం చెల్లించేందుకు పుష్పవతి సిద్ధపడ్డారు. ఆ రోజుల్లో ఆరు వేల రూపాయలు అంటే చాలా పెద్ద మొత్తం. ఆ మొత్తంతో కృష్ణా, గోదావరి జిల్లాలు, గుంటూరు జిల్లాలో ఒక ఎకరం సారవంతమైన భూమిని కొనవచ్చు. సంపద విలువ పుష్పవతికి మొదటి నుంచి తెలుసు. భర్త సంపాదించిన మొత్తాన్ని ఆమె చాలా జాగ్రత్తగా దాచుకున్నారు. ఆయన కష్టపడి సంపాదించిన మొత్తానికి ఇంత కంటే ఎక్కువ విలువ లభించదని ఆమెకు తెలుసు. అలా 1958లో రంగరాయ మెడికల్ కాలేజీలో ఉపేంద్రనాథ్ ను చేర్పించారు. లయోలా కాలేజీలో బి.ఎస్సీ, పూర్తి చేసిన తర్వాత ఉపేంద్రనాథ్ వైద్య విద్యార్థిగా మారారు.

# 6. అభ్యాసం:

# వైద్యశాస్త్రం చదివేందుకు నిద్రలేని రాత్రులు

తన చదువు కోసం తన తల్లి ఎన్నో త్యాగాలు చేసిన విషయం ఉపేంద్రనాథ్‌కు తెలుసు. ఆమె కఠోర శ్రమ, అంకితభావం, దృఢ సంకల్పం వల్లే ఆయనకు మెడికల్ కాలేజీలో ప్రవేశం లభించింది. మెడిసిన్ అద్భుతంగా చదివి అన్ని పరీక్షల్లో ఘనవిజయం సాధిస్తానని ఆయన శపథం చేశారు.

యాదృచ్ఛికంగా, అదే సంవత్సరం ఆయన చిన్న బాబాయ్ నిమ్మగడ్డ హరనాథ్ బాబు కూడా రంగరాయ మెడికల్ కాలేజీలో చేరారు. తొమ్మిది మంది సోదరుల్లో హరనాథ్ చిన్నవాడు. హాస్టల్‌లో చదువుకున్న అనుభవానికి తోడు, బాబాయ్ కూడా సహాధ్యాయిగా కాకినాడలో ఉండటం ఉపేంద్రనాథ్‌కు ఎంతో ఉపశమనం కలిగించింది.

కాలేజీ మొదటి రోజు ఉపేంద్రనాథ్ మనస్సు మొత్తం ఎంతో ఉద్విగ్నతతో నిండిపోయింది. డాక్టరుగా మారే దారిలో నడుస్తున్నాననే సంతోషం వెల్లివిరిసింది. చదువుల్లో ఏనాడూ వెనుకబడరాదని ఆనాడే ప్రతిజ్ఞ చేశారు. అద్భుతమైన వైద్యశాస్త్ర లోతుపాతులు తెలుసుకోవాలని కఠినంగా నిర్ణయించుకున్నారు.

ఎంబిబిఎస్ మొదటి సంవత్సరంలో ఏటా వంద మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించేందుకు రంగరాయ మెడికల్ కాలేజీకి అనుమతి లభించింది. 1959లో అలా ఎంపికైన విద్యార్థుల్లో 8 మంది మాత్రమే అమ్మాయిలు.

ప్రస్తుత సిలబస్ మాదిరిగానే అప్పట్లోనూ ఎంబిబిఎస్ మొదటి సంవత్సరంలో విద్యార్థులకు అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ బోధించేవారు. లయోలా కాలేజీలో బి.ఎస్సీ బయోకెమిస్ట్రీ చదవడంతో ఆ విషయాన్ని ఆకళింపు చేసుకోవడంలో ఉపేంద్రనాథ్‌కు పెద్దగా కష్టపడాల్సిన అవసరం రాలేదు. కానీ చాలా మంది విద్యార్థులు అందులో

తడబడేవారు. జీవుల్లో చోటుచేసుకునే రసాయన చర్యలు, ప్రక్రియలకు సంబంధించిన శాస్త్రం బయోకెమిస్ట్రీ. కర్బన అణువులు, రసాయన చర్యలు, ప్రతిచర్యలు కూడా అందులో భాగమే. కార్బొహైడ్రేట్లు, లిపిడ్స్, ప్రోటీన్లు, న్యూక్లియిక్ యాసిడ్లలో జీవపరమైన అణువులకు సంబంధించిన లోతైన అధ్యయనం కూడా బయోకెమిస్ట్రీలో భాగంగా ఉంటుంది.

అనాటమీ తరగతిలో విద్యార్థులందరూ ఇబ్బంది పడ్డారు. జీవుల్లో చోటుచేసుకునే రసాయన ప్రక్రియలకు సంబంధించిన అధ్యయన శాస్త్రం అది. బతికిన లేదా మరణించిన జీవుల నిర్మాణానికి సంబంధించిన శాస్త్రం అది. అందులో శరీరాలు కోసి పరిశీలించాల్సి ఉంటుంది.

తరగతి గదిలో అనాటమీ చదివేటప్పుడు విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఉండేవి కావు, కానీ ప్రయోగశాలలో అడుగుపెడితే చాలు అందరి కాళ్లు, చేతులు చల్లబడిపోతుండేవి. స్పృహ తప్పిపడిపోయే విద్యార్థులు కూడా అనేక మంది ఉండేవారు. ప్రయోగశాలలో కొన్ని సార్లు శవాన్ని కోసి అందులోని అవయవాల అధ్యయనం చేయాల్సి ఉంటుంది. శవాన్ని చూడగానే చాలా మంది విద్యార్థులు వాంతి చేసుకునేవారు. కొందరు చీదరించుకునేవారు. శవం నుంచి వచ్చే దుర్వాసన యువతీయువకులను చాలా రోజులు పట్టి పీడించేది.

అనాటమీ ల్యాబ్‌కు వెళ్లేందుకు మొదటి రెండు నెలలు చాలా ఇబ్బందిపడ్డారు ఉపేంద్రనాథ్. ఆ తర్వాత భయాన్ని పక్కన పెట్టి తనను తాను కుదుటపరచుకున్నారు. కానీ చాలా మంది విద్యార్థులు ఆరు నెలలైనా అసౌకర్యంగానే ఉండేవారు.

కాలేజీలో అడుగుపెట్టిన మొదటి రోజు సర్జన్ కావాలని ఉపేంద్రనాథ్ గట్టిగా నిర్ణయించుకున్నారు. సర్జన్‌గా ఆయన తండ్రి ఎంతో పేరు తెచ్చుకున్నారు. తండ్రి అడుగుజాడల్లో నడవాలనే లక్ష్యమే ఆయనను ఆలోచింపజేసి ఉంటుంది. మంచి సర్జన్ కావాలంటే మానవ శరీరాన్ని సంపూర్ణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందనే వాస్తవాన్ని గ్రహించారు ఉపేంద్రనాథ్. అంతే కాదు మానవ శరీరావయవాలకు సంబంధించి లోతుగా చదవాల్సిన అవసరముందని తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ఎప్పుడైతే గుర్తించారో.. అప్పటి నుంచి ఆయన మిగతా విద్యార్థులతో పోల్చితే ఎక్కువ సమయం అనాటమీ ల్యాబ్‌లో గడిపేవారు ఉపేంద్రనాథ్. మానవ శరీరం గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యమనే ప్రొఫెసర్ల ఉద్బోధను బాగా గుర్తు చేసుకునేవారు. ఇలా క్రమంగా ఉపేంద్రనాథ్‌కు అనాటమీ అత్యంత ఆసక్తికరమైన విషయంగా మారిపోయింది.

మొదటి సంవత్సరంలో మరో ముఖ్యమైన సబ్జెక్టు ఫిజియాలజీ. వైద్యశాస్త్రంలో ఒక భాగంగా నిలిచే ఫిజియాలజీ శరీర ధర్మాన్ని అధ్యయనం చేస్తుంది. మానవ శరీర ధర్మం, బాహ్య వాతావరణం దానిపై చూపే ప్రభావాన్ని ఇది తెలియజేస్తుంది.

ప్రొఫెసర్లు దిశానిర్దేశం చేసిన సవాళ్లతో కూడిన ఆ మార్గంలో ప్రయాణించాల్సింది విద్యార్థి మాత్రమేననే సత్యాన్ని గుర్తించేందుకు ఉపేంద్రనాథ్‌కు ఎక్కువ సమయం పట్టలేదు. మొదటి సంవత్సరంలోని మూడు విషయాల్లో పట్టు సాధించేందుకు ఉపేంద్రనాథ్ తీవ్రంగా శ్రమించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించారు. కానీ అన్ని సబ్జెక్టులలో ఉత్తీర్ణులయ్యింది ఎనిమిది మంది విద్యార్థులు మాత్రమే. అందులో ఒకరు ఉపేంద్రనాథ్. ఆయన బ్యాచ్‌లో చాలా మంది విద్యార్థులు ఒకటి రెండు సబ్జెక్టులు తప్పారు. మూడు సబ్జెక్టులు తప్పిన విద్యార్థులు కూడా కొందరున్నారు. చక్కని తెలివితేటలు, మంచి జ్ఞాపకశక్తి, కఠిన శ్రమ, అంకితభావం ఉపేంద్రనాథ్‌ను ముందు నిలబెట్టాయి. అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో ఉపేంద్రనాథ్ బాబాయ్ కూడా ఒకరు. అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులైన అమ్మాయి వెనిగళ్ల ఉషారాణి ఒక్కరే.

# 7. ప్రణయతీరం:
# రహస్యంగా చేరిన ప్రేమరాగం

ఉషారాణిది మధ్యతరగతి కుటుంబం. ఆమె తండ్రి వెనిగళ్ల అంజయ్య. ఆయనకు కొన్ని ట్రక్కులు ఉండేవి. వాటిపై వచ్చే ఆదాయంతో వారి కుటుంబం గడిచేది. ఉషారాణి తల్లి పెద్దగా చదువుకోలేదు. మూడో తరగతితోనే ఆమె చదువు ఆపేసింది. కానీ తన పిల్లలు ఉన్నత చదువులు చదివి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలన్నది ఆమె కోరిక. ముగ్గురు సంతానంలో చివరి వ్యక్తి ఉషారాణి. ఆమెకు ఓ అన్నయ్య, ఓ అక్క ఉన్నారు.

ఉషారాణి మంచి తెలివైన విద్యార్థిని. పీయూసీ పరీక్షలో ఆమె మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. కానీ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చేరేందుకు ఆ మార్కులు సరిపోలేదు. కానీ కూతురు డాక్టరు కావాలనే తపన ఆమె తల్లిలో తీవ్రంగా ఉండేది.

ఉపేంద్రనాథ్ తల్లి మాదిరిగానే ఉషారాణి తల్లికి కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన మొదటి ప్రైవేట్ వైద్య కళాశాల గురించి తెలిసింది. ఏది ఏమైనా కూతురు ఆ కాలేజీలో చేరాలని ఆమె గట్టిగా నిర్ణయించుకుంది. కానీ వాళ్లు అడిగిన డొనేషన్ మొత్తం చాలా ఎక్కువ. ఆ ఆలోచననే ఉషారాణి తండ్రి తీవ్రంగా వ్యతిరేకించారు. కూతురు చదువుకు డబ్బు ఖర్చు పెట్టేందుకు భర్త నిరాకరించడంతో తన దగ్గరున్న బంగారు ఆభరణాలన్నీ భర్త ముందు ఉంచి వాటిని అమ్మి అయినా కూతురు చదివించాలని పట్టుబట్టింది. మెడికల్ కాలేజీలో ఉషాను చేర్చేంతవరకు ఇంట్లో ప్రశాంతత ఉండదని తెలుసుకున్న వెనిగళ్ల అంజయ్య, డొనేషన్ మొత్తం చెల్లించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అలా రంగరాయ మెడికల్ కాలేజీలో ఉషారాణి అడుగుపెట్టారు.

చదువుల్లోనే కాదు ఆటలు, విద్యాయేతర విషయాల్లోనూ ఉష చాలా ముందుండేవారు. అందానికి ప్రతిబింబంగా ఉండటమే కాదు మృదు స్వభావిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అందరితో కలిసిపోయే గుణం కారణంగా కాలేజీలో ఆమె మంచి పేరు సంపాదించుకున్నారు.

పరీక్షల్లో ఉపేంద్రనాథ్ తర్వాతి రోల్ నెంబర్ ఆమెది. ఇద్దరి పేర్లు U తోమొదలు కావడం దీనికి కారణం. ఉపేంద్రనాథ్ తర్వాతి పేరు ఉషారాణిది. ఆమె అందమైన రూపం, మాటల్లో తీయదనం, తెలివితేటలు ఉపేంద్రనాథ్‌ను ముగ్ధుడిని చేశాయి. తెలియకుండానే ఉషారాణితో ప్రేమలో పడేశాయి. ఆమెతో ఎక్కువ సమయం గడిపేందుకు మక్కువ చూపినా ఏనాడూ తన ప్రేమను బహిరంగంగా వ్యక్తం చేయలేదు ఉపేంద్రనాథ్. ఉపేంద్రనాథ్ అంటే ఉషకూ అభిమానమే. అందుకే ఇద్దరు మంచి స్నేహితులయ్యారు. ఇద్దరి మధ్య బంధం రోజు రోజుకూ బలపడసాగింది.

## 8. కేడెట్‌గా జీవితం:

# ఎన్‌సిసి ద్వారా ఆదర్శ పురుషుడిగా మారడం

ఉపేంద్రనాథ్, ఆయన బాబాయ్, మరో ముగ్గురు సహచరులు కలిసి కాలేజీ క్యాంపస్ వెలుపుల ఒక గది అద్దెకు తీసుకున్నారు. ఎందుకంటే కాలేజీలో కొంత మంది అల్లరి విద్యార్థుల తీరుతో రాఘవరావు, శ్రీహరి, మనోహర్, ఉపేంద్రనాథ్, హేమంత్ బాబు విసిగిపోయారు. రంగరాయ మెడికల్ కాలేజీలో చేరిన విద్యార్థులు చాలా మంది సంపన్న కుటుంబాలకు చెందిన వారే. వారిలో ఎక్కువ మంది బుద్ధిగానే ఉండేవారు. కానీ కొందరు మాత్రం తమ కుటుంబ హోదా, దర్పాన్ని ప్రదర్శించేందుకు తహతహలాడేవారు. చదువుకన్నా తమ గొప్పతనాన్ని చాటుకునేందుకు ఎక్కువ మక్కువ చూపేవారు. మిగతా విద్యార్థులను తమ వెంట తిప్పుకుంటూ తమ పనికిమాలిన పనుల్లో వారిని పాల్గొనేలా చేసేవారు. ఈ కారణంగా ఆ ఐదుగురు కాలేజీ క్యాంపస్ నుంచి బయటకు వచ్చి వేరుగా ఉండటం మొదలుపెట్టారు. తమ పూర్తి ఏకాగ్రతను చదువులపైనే నిలిపారు.

ఆ ఐదుగురు విద్యార్థులు ఇతర కార్యకలాపాలను పక్కన పెట్టి పూర్తి ధ్యాసంతా చదువులపైనే నిలిపారు. ఐదుగురు చక్కగా కలిసిపోయి తరచూ కలిసి చదువుకునేవారు. వాకింగ్ చేయాలనుకున్నా, మార్కెట్‌కు వెళ్లాలనుకున్నా అంతా కలిసికట్టుగానే వెళ్లేవారు. వినోదం కోసం ఉపేంద్రనాథ్ అప్పుడప్పుడు సహచరులతో క్రికెట్ ఆడేవారు. నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి) లోనూ భాగస్వామయ్యారు.

ఎన్‌సిసి ప్రాథమిక లక్ష్యాలు మూడు. మొదటిది, దేశవ్యాప్తంగా యువతను ప్రేరణనిచ్చి, నాయకత్వ బాధ్యతలు చేపట్టేలా శిక్షణ ఇచ్చి తగిన మానవ వనరులు ఏర్పాటు చేయడం. రెండు, సైనికదళాల్లో చేరేలా యువతను ప్రేరేపించడం, చివరిది, వ్యక్తిత్వ నిర్మాణం, స్నేహబంధం, క్రమశిక్షణ, లౌకికవాదం, ధైర్యసాహసాలు, స్వయం సేవ, స్వచ్ఛందసేవా

స్ఫూర్తిని నింపడం. పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులందరూ ఎన్‌సిసిలో చేరవచ్చు. వారికి ప్రత్యేకమైన శిక్షణ తరగతులు ఉంటాయి, అందులో వారికి సమాజ సేవ, కఠిన శ్రమ ఔన్నత్యాన్ని బోధిస్తారు. భద్రతాదళాల సిబ్బంది తరహాలో సీనియర్ విద్యార్థులకు శిక్షణ అందుజేయబడుతుంది.

ఎన్‌సిసిలో చేరే విద్యార్థులు ఈ ప్రమాణాన్ని చేయాల్సి ఉంటుంది:

"నేషనల్ కేడెట్ కార్ప్స్‌కు చెందిన కేడెట్స్ అయిన మేము

భారతదేశ ఐక్యతను నిలిపి ఉంచుతామని ప్రతిజ్ఞ చేస్తున్నాం

క్రమశిక్షణ, బాధ్యత కలిగిన దేశపౌరులుగా ఉంటామని శపథం చేస్తున్నాం

నిస్వార్థంగా మేము సమాజానికి సానుకూల సేవలందిస్తామని ప్రతిన బూనుతున్నాం

మా తోటి వారి పట్ల ఆదరంగా ఉంటాం"

శిక్షణ పొందే విద్యార్థులకు ఎన్‌సిసి మూడు రకాల సర్టిఫికేట్లు A, B, C ప్రదానం చేస్తుంది. ఇందులో C సర్టిఫికేట్ అత్యున్నతమైనది. అంతే కాదు ఈ A, B, C లో పాయింట్లు ఆధారంగా గ్రేడ్లు కూడా ఉంటాయి. ఆల్ఫా A అన్నది అత్యున్నత గ్రేడ్. గ్రేడులో ముందుకు సాగుతున్న కొద్దీ పరీక్షలు, శిక్షణ కఠినతరంగా మారుతూ ఉంటాయి. భారత సైన్యంలో కల్నల్ హోదా కలిగిన ఉన్నతాధికారులు ఈ పరీక్షలు, గ్రేడ్లను పర్యవేక్షిస్తూ ఉంటారు. కఠినమైన శారీరక శిక్షణ పరీక్షల్లో విజయం సాధించి, B గ్రేడ్ కంటే మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు C సర్టిఫికెట్ అందజేస్తారు. ఈ సర్టిఫికెట్లు విద్యార్థులకు అనేక రీతులుగా ప్రయోజనం అందిస్తుంటాయి. A సర్టిఫికేట్ పొందిన విద్యార్థులు కంపెనీ సర్జెంట్ మేజర్ (సీఎస్ఎం) పోస్టు పొందవచ్చు. అలాగే B సర్టిఫికేట్ కలిగినవారు జూనియర్ అండర్ ఆఫీసర్ (జేయూఓ) పోస్టుకు అర్హులు. C సర్టిఫికేట్ గ్రహీతలకు కంపెనీ సీనియర్ అండర్ ఆఫీసర్ (సీఎస్‌యూఓ) అవకాశాన్ని అందుకోవచ్చు. C సర్టిఫికేట్ పొందిన విద్యార్థులకు సైన్యం, పారామిలటరీ బలగాల్లోనే కాదు వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఉంటుంది. C సర్టిఫికేట్ పొందిన విద్యార్థులకు సోల్జర్ జీడీ శ్రేణి, సోల్జర్ టెక్ శ్రేణిలో 10% మార్కులు అదనంగా ఇస్తారు. అంతే కాదు ఎయిర్‌ఫోర్సులో ప్రవేశానికి (5 పాయింట్లు), సరిహద్దు భద్రతలో (10 పాయింట్లు), నావికా దళంలో చేరేందుకు వెసులుబాటు ఉంటుంది. ఉన్నత విద్య కోసం వివిధ కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందేలా చూడటంలోనూ ఎన్‌సిసి సర్టిఫికేట్లు దోహదపడతాయి. మెడికల్, ఇంజినీరింగ్ లేదా ఇతర విద్యాసంస్థల్లో ఎన్‌సిసి కేడట్ల కోసం ప్రత్యేక సీట్లు ఉంటాయి. ఎన్‌సిసిలో చేరడం వలన ఉపేంద్రనాథ్‌లో ఆదర్శభావం, దేశభక్తి అలవడింది.

## 9. ప్రత్యేక అనుభవం:

# ప్రయోజనకరంగా నిలిచిన ఉపన్యాసాలు

ఉపేంద్రనాథ్‌లో ఒక గొప్ప లక్షణం ఏ విషయమైనా సునిశితంగా రాసుకోవడం. క్లాసుకు హాజరైన ప్రతీసారి ప్రొఫెసర్లు చెప్పేది ఏకాగ్రతతో వినడమే కాదు, వాటికి సంబంధించిన ప్రతీ విషయాన్ని సవివరంగా రాసుకునేవారు. చాలా మంది విద్యార్థుల్లో ఈ గుణం ఉండదు. ఉపన్యాసాన్ని విని, దాన్ని అర్థం చేసుకొని, గుర్తుంచుకునేందుకే మక్కువ చూపేవారు. ఉపేంద్రనాథ్ తీరు పూర్తి భిన్నంగా ఉండేది. రూమ్‌కు వచ్చిన వెంటనే తాను రాసుకున్న నోట్స్ చదివి, మాస్టరు చెప్పిన పాఠాన్ని మననం చేసుకునేవారు. చాలా మంది విద్యార్థులు పరీక్షల సమయంలోనే పాఠాలు గుర్తు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తూ ముప్పుతిప్పలు పడేవారు. వారితో పోల్చితే ఉపేంద్రనాథ్ ఎంతో ప్రశాంతంగా ఉండేవారు. పరీక్షలంటే చాలా మంది విద్యార్థులు భయంతో వణికిపోయేవారు. కానీ, ఉపేంద్రనాథ్‌లో ఆ జంకు ఏ కోశానా ఉండేది కాదు. శ్రద్ధగా పాఠాలు వినడం, క్రమం తప్పకుండా నోట్స్ రాసుకోవడం, వాటిని ఎప్పటికప్పుడు మననం చేసుకోవడం దానికి కారణం. మెడికల్ కాలేజీ పరీక్షల విషయంలో ఉపేంద్రనాథ్‌లో పెద్దగా ఆందోళన లేకపోయినా "మౌఖిక పరీక్ష" వైవాల విషయంలో కొంత ఆందోళన నెలకొని ఉండేది. ఎగ్జామినర్ ఏం ప్రశ్నలు అడుగుతారోననే కంగారు కనిపించేది. కానీ, ఈ భయం ఉన్నా వైవాలోనూ ఆయన చక్కగా రాణించారు.

ఎంబిబిఎస్ రెండో సంవత్సరంలో విద్యార్థులకు కమ్యూనిటీ మెడిసిన్, ఫోరెన్సిక్ మెడిసిన్, పాథాలజీ, ఫార్మాకాలజీ, మైక్రోబయాలజీ సబ్జెక్టులు ఉండేవి. ఉపేంద్రనాథ్‌ను పాథాలజీ ప్రొఫెసర్ సుందర శివరావు బాగా ప్రభావితం చేశారు. పాథాలజీ ల్యాబ్‌లో మైక్రోస్కోప్ గురించి, "మెదడుకు తెలియనిది మీ కళ్లు చూడలేవని" రావు చెప్పిన మాటలు ఉపేంద్రనాథ్ మనస్సుపై చెరగని ముద్రవేశాయి. ఒక గొప్ప సామెతను ఆ మాటలు పరిపుష్టం చేశాయి.

చూడటం, ఆకళింపు చేసుకోవడమన్నది వాటికి సంబంధించిన పరిజ్ఞానంతో కలిసికట్టుగా జరగాలనే విషయం గ్రహించేలా చేశాయి. చూడటం మాత్రమే కాదు, దాన్ని అర్థం చేసుకోవడం, అన్ని కోణాల నుంచి దాన్ని అధ్యయనం చేయడం వైద్యుడికి చాలా అవసరం. అలా చేసినప్పుడే రోగుల సమస్య, అనారోగ్యం లేదా వ్యాధిని తెలుసుకోగలుగుతారు. వ్యాధిని గుర్తించకుండా సరైన చికిత్స అందించడం అసాధ్యం. జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ నారాయణరెడ్డి మేధస్సు కూడా ఉపేంద్రనాథ్‌లో ఆసక్తి రేకెత్తించింది. కల్నల్ రాజుగా పేరుగాంచిన దాట్ల సత్యనారాయణరాజు  ధైర్యం కూడా ఉపేంద్రనాథ్ మనస్సులో నిక్షిప్తం అయిపోయింది.

ఎంబిబిఎస్ మొదటి, రెండో సంవత్సరం క్లాసురూములు, ప్రయోగశాలల్లోనే గడిచిపోయేది. ఆ సమయంలో రోగులను చూడటం, వారితో మాట్లాడే అవకాశం విద్యార్థులకు ఉండదు. ఆస్పత్రులకు వెళ్లడం, మెడిసిన్, సర్జరీ, ఆబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీ, పీడియాట్రిక్స్ విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు వారి అసిస్టెంట్లతో కలిగి రోగులను చూసే అవకాశం మూడో సంవత్సరంలోనే విద్యార్థులకు లభిస్తుంది.

తూర్పు గోదావరి జిల్లా హెడ్‌క్వార్టర్స్ ఆస్పత్రిని బోధనా ఆస్పత్రిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రంగరాయ మెడికల్ కాలేజీకి కేటాయించింది. ప్రొఫెసర్లు, వారి అసిస్టెంట్ల పర్యవేక్షణలో ఉపేంద్రనాథ్, తోటి విద్యార్థులు ఆ ఆస్పత్రిని సందర్శించేవారు. కానీ, రోగులకు స్వతంత్రంగా చికిత్స అందించేందుకు ఈ విద్యార్థులకు అనుమతి ఉండేది కాదు. రోగిని ప్రొఫెసర్లు పరీక్షించేవారు, ఆ విషయాలన్నీ విద్యార్థులు నోట్ చేసుకునేవారు. ఆస్పత్రి సందర్శన ద్వారా వివిధ రకాల వ్యాధులు, వాటికి సంబంధించిన చికిత్స విధానాలు విద్యార్థులకు ప్రత్యక్షంగా అవగతమయ్యేవి. అలా మూడో సంవత్సరంలో విద్యార్థులు తమ ప్రొఫెసర్లు, వారి సహాయకుల ద్వారా చికిత్స విధానాన్ని నేర్చుకున్నారు. రోగులకు స్వతంత్రంగా చికిత్స అందించడంపై నిషేధం ఉండేది.

మెడిసిన్, సర్జరీ, గైనకాలజీ, అబ్‌స్టెట్రిక్స్ తరగతులు ప్రారంభమైన తర్వాత ఉపేంద్రనాథ్, ఉషారాణి మధ్య స్నేహం మరింత బలపడింది. పరస్పరం కలుసుకునేందుకు, సమయం గడిపేందుకు ఇద్దరికీ అనేక అవకాశాలు లభించాయి. టీ కోసమని ఉషారాణిని ఉపేంద్రనాథ్ ఆహ్వానించేవారు. వాళ్లిద్దరూ ప్రేమలో పడ్డారనే విషయం కాలేజీలోని మిగతా విద్యార్థులకు తెలిసిపోయింది.

ఆ తర్వాత సైకియాట్రీ, ఆర్థోపెడిక్స్, స్కిన్ పాథాలజీ, ఆప్తాల్‌మాలజీ, ఈఎన్‌టీ చికిత్సలు, పీడియాట్రిక్స్, రేడియాలజీ, అనెస్థిషియా ఇతర విషయాలను ఉపేంద్రనాథ్ నేర్చుకున్నారు.

# 10. కొన్ని మైలురాళ్లు:
# భర్తగా, హౌస్ సర్జన్‌గా మారడం

శస్త్రచికిత్సలు నేర్చుకునే అవకాశం లభించినప్పుడు ఉపేంద్రనాథ్ మనస్సు ఉత్సాహంతో నిండిపోయింది. సర్జన్‌గా రాణించాలని సంకల్పించుకున్నారు. ఆపరేషన్ థియేటర్‌లో జరిగే శస్త్రచికిత్సలను ప్రారంభంలో చూసే అవకాశం మాత్రమే ఉండేది. ప్రొఫెసర్లు శస్త్ర చికిత్స చేస్తూ ఆ వ్యాధి గురించి వివరాలు, దాని చికిత్స విధానాన్ని విద్యార్థులకు వివరించేవారు. ఆ తర్వాత కొన్నాళ్లకు ప్రొఫెసర్ల పర్యవేక్షణలో చిన్న శస్త్ర చికిత్సలు చేసే అవకాశం విద్యార్థులకు లభించేది.

సొంతంగా ఒక పెద్ద శస్త్ర చికిత్స చేయాలనే కోరిక ఉపేంద్రనాథ్‌లో ఉండేది. కానీ, నిబంధనలను సాకుగా చూపి ప్రొఫెసర్లు అనుమతించేవారు కాదు. కానీ ఉపేంద్రనాథ్ వంటి నిపుణులైన విద్యార్థులకు శస్త్రచికిత్స అనంతరం రోగులకు డ్రెస్సింగ్ చేసే బాధ్యత అప్పగించేవారు. దీంతో ఆయన సంతృప్తి చెందేవారు, ఒకింత నిరాశకు లోనయ్యేవారు. శస్త్రచికిత్సలు చూడటం, చిన్న ప్రక్రియలు చేయడం ద్వారా తాను అనుకున్న జ్ఞానాన్ని పొందలేకపోతున్నాననే బాధ ఉండేది ఉపేంద్రనాథ్‌లో.

అలా నాలుగేళ్ల శిక్షణ పూర్తైన తర్వాత హౌస్ సర్జన్ అయ్యే అవకాశం ఉపేంద్రనాథ్‌కు లభించింది. వైద్య విద్యార్థులందరూ ఒక సంవత్సరం పాటు హౌస్ సర్జన్‌గా పనిచేయాల్సి ఉంటుంది. ఆ సమయాల్లో వారు కొన్ని నిర్దేశిత గంటల పాటు ఆస్పత్రిలో ఉంటూ ఎమర్జెన్సీ వార్డుకు (లేదా ఇతర ఏదైనా వార్డు) వచ్చే రోగులను పరీక్షించాల్సి ఉంటుంది. ఆ సమయంలో వారు ప్రొఫెసర్లు లేదా వారి అసిస్టెంట్లకు చికిత్స వివరాలు తెలిపి తమ సిఫార్సులు సూచించేవారు. ఆ సూచనల ఆధారంగా సదరు విద్యార్థి ఆ వ్యాధిని అంచనా వేసేందుకు సరైన వైద్య విధానాన్ని ఎంచుకుంటున్నారా అని ప్రొఫెసర్లు గుర్తించేవారు.

హౌస్ సర్జన్‌గా ఉన్న సమయంలో ఉపేంద్రనాథ్ ఎన్నో ఆసక్తికర విషయాలు గమనించారు. ఒక రాత్రి ఆస్పత్రి డ్యూటీలో ఉండగా అర్ధరాత్రి సమయంలో నర్సు వచ్చి ఒక రోగిని అత్యవసరంగా చూడాలని, అతని పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని చెప్పింది. ఆ రోగి శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారనే విషయాన్ని ఉపేంద్రనాథ్ గుర్తించారు. రోగి నాడి, బ్లడ్ ప్రెషర్, గుండె చప్పుడు పరీక్షించి ఆ రోగికి గుండె జబ్బు ఉందని నిర్ధారణకు వచ్చారు. శరీరంలోంచి నీటిని తగ్గించే కొన్ని మందులు రాసిచ్చారు. మందులు రాస్తున్న సమయంలోనే రోగి హఠాత్తుగా ఉపేంద్రనాథ్ చేతులు పట్టుకొని, తనను ఎలాగైనా బతికించాలని, తనకు చావాలని లేదని, తనను కాపాడితే వంద రూపాయలు ఇస్తానని ప్రాధేయపడ్డాడు. అలా అంటుండగానే అతని కంటి నుంచి కన్నీళ్లు ప్రవహించాయి. అది చూసిన ఉపేంద్రనాథ్, కంగారు పడకండి, నేను రాసిచ్చిన మందులు వేసుకోండి, మీకు ఏం కాదని భరోసా ఇచ్చారు. ఆ మందులు వేసుకున్న కొన్ని గంటలకు ఆ రోగి ఆరోగ్యం కుదటపడింది. కానీ, మూడు రోజుల తర్వాత ఆ రోగి మరణించాడనే విషయం ఉపేంద్రనాథ్‌కు తెలిసి చాలా బాధపడ్డారు.

మరో ఆసక్తికరమైన సంఘటన కూడా చోటుచేసుకుంది. జ్వరం, పొత్తి కడుపులో నొప్పి అంటూ ఓ మహిళ ఆస్పత్రికి వచ్చింది. ఆ రోజు డ్యూటీలో ఉపేంద్రనాథ్ ఉన్నారు. ఆమె చెప్పింది విని, ఆమెను పరీక్షించిన తర్వాత ఉపేంద్రనాథ్, ఆయన సహచరుడు ఆమెకు గ్యాల్‌స్టోన్ సమస్య ఉందని నిర్ధారణకు వచ్చారు. కానీ, ఆ ఆస్పత్రిలో అసిస్టెంట్ సర్జన్‌గా ఉన్న ఉపేంద్రనాథ్ అభిప్రాయాన్ని సూపరింటెండెంట్ అంగీకరించలేదు. ఆ మహిళకు కామెర్లు ఉన్నాయని ఆయన తేల్చారు. అంతే కాదు యువకులైన ఆ డాక్టర్లపై తన అధికారాన్ని చూపారు. ఇద్దరు ఏం స్పందించకుండా మౌనంగా ఉండిపోయారు.

ఈ విషయం ప్రొఫెసర్‌కు చేరింది. ఆయన సందేహంలో పడ్డారు. కానీ, ఉపేంద్రనాథ్, ఆయన సహచరుడు డయాగ్నైజ్ చేసిందే సరైనదని, రాళ్లు తొలగించేందుకు ఆమెకు శస్త్రచికిత్స చేయాలని సిఫార్సు చేశారు. ఆపరేషన్ సమయంలో అసిస్టెంట్ సర్జన్ సహ ఉపేంద్రనాథ్, ఆయన సహచరుడు అక్కడే ఉండాలని ప్రొఫెసర్ ఆదేశించారు. ఆ రోజుల్లో అల్ట్రా సౌండ్ పరీక్ష నిర్వహించే సదుపాయం వైద్య కళాశాలల్లో ఉండేది కాదు. ఆ కారణంగానే గ్యాల్ బ్లాడర్‌లో రాళ్లు ఉన్నాయా లేదా అని స్పష్టంగా నిర్ధారణకు రాలేకపోయేవారు. ప్రొఫెసర్ ఆపరేషన్ మొదలుపెట్టారు. రాళ్ల కారణంగానే ఆమెకు జ్వరం, నొప్పి వస్తున్న విషయం స్పష్టమైంది. ఆ శస్త్ర చికిత్స తర్వాత ఆ అసిస్టెంట్ సర్జన్ చాలా ఇబ్బందిపడ్డారు. ఉపేంద్రనాథ్, ఆయన సహచరుడు అహంభావంతో వ్యవహరించకుండా మౌనంగా ఉన్నారు. పొరపాట్లు ఎవరైనా చేస్తారనే విషయం వినయం కలిగిన ఆ ఇద్దరికి తెలుసు.

ఒకరోజున చోటుచేసుకున్న ఘటన ఆస్పత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ శస్త్రచికిత్స అనుభవలేమిని తేటతెల్లం చేసింది. కొంత మంది విద్యార్థులకు బోధించేందుకు ఆ ఆఫీసర్ ఆ రోజు వాసెక్టమీ ఆపరేషన్ నిర్వహించాలి. ఒక పురుష రోగిని ఆపరేషనల్ థియేటర్‌కు తీసుకొచ్చారు. రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ కూడా థియేటర్‌కు వచ్చారు. విద్యార్థులంతా అప్పటికే అక్కడికి చేరారు. ఆఫీసర్ శస్త్రచికిత్స ప్రారంభించారు. చాలా సేపు ఉన్న తర్వాత కూడా కుడి వీర్యనాళాన్ని ఆ ఆఫీసర్ గుర్తించలేకపోయారు. ఆయన సామర్థ్యలేమిని అది బట్టబయలు చేసింది.

సర్జరీ డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ షణ్ముగేశ్వరరావు ఎంతో అనుభవం, అపారమైన నైపుణ్యం కలిగిన సర్జన్. డాక్టరు రావు క్లాస్ ద్వారా విద్యార్థులకు అనేక కొత్త విషయాలు బోధపడేవి. శస్త్రచికిత్సకు సంబంధించి అనేక విషయాలు ఆయన విద్యార్థులకు తెలియజేసేవారు. అలాగే శస్త్రచికిత్సకు ముందు రోగి, రోగి కుటుంబంతో ఎలా వ్యవహరించాలనే విషయాన్ని విద్యార్థులకు విడమరిచి చెప్పేవారు. ఆస్పత్రిలో అనేక ప్రధాన శస్త్రచికిత్సలు చేస్తూ క్షణం తీరిక లేకుండా ఉండేవారు డాక్టరు రావు. ఆయన ఎక్కువ సమయం గడిపేది ఆపరేషన్ థియేటర్‌లోనే. అయినప్పటికీ సమయం తీసుకొని విద్యార్థులకు శస్త్రచికిత్స విధానాలు బోధించేవారు. ఆయన నుంచి ప్రశంసలు పొందేందుకు చాలా మంది విద్యార్థులు విపరీతంగా శ్రమించేవారు.

ఆ రోజుల్లో కాకినాడలోని జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఒకే థియేటర్‌లో ఏకకాలంలో రెండు శస్త్రచికిత్సలు నిర్వహించేవారు. ఒక టేబుల్‌పైన ఒక రోగికి హెర్నియా ఆపరేషన్ జరుగుతుంటే, ఆ టేబుల్‌కు కొంత దూరంలో మరో టేబుల్‌పై మరో రోగికి పొత్తి కడుపు శస్త్ర చికిత్స జరుగుతూ ఉండేది. అలా ఆపరేషన్లు చేసేందుకు ఈ రోజుల్లో అనుమతి లేదు. ఆ రోజుల్లోనూ అలా చేయడం నేరంగానే పరిగణించేవారు. ఆ రోజుల్లో ఆ ప్రాంతంలో కొన్ని ఆస్పత్రులు మాత్రమే ఉండేవి. ఆ ఉన్న ఆస్పత్రుల్లోనూ ఒకటో రెండు ఆపరేషన్ థియేటర్లు ఉండేవి. కానీ రోగుల సంఖ్య మాత్రం ఎక్కువ. కాబట్టి, ఒకే ఆపరేషన్ థియేటర్‌లో ఏకకాలంలో రెండు శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ ఉండేవారు.

ఎంబిబిఎస్ చదివే సమయంలో కుటుంబ నియంత్రణ, గాల్‌బ్లాడర్ శస్త్రచికిత్సలు మినహా పెద్ద శస్త్రచికిత్సలు ఉపేంద్రనాథ్ చేయలేదు. ప్రొఫెసర్ల పర్యవేక్షణలో గడ్డలు, కణుతులు తొలగించే చిన్నపాటి శస్త్రచికిత్సలు నిర్వహించారు. చాలాసార్లు ఆయన ఆపరేషన్‌కు ముందు డిస్ఇన్ఫెక్షన్, స్టెరిలైజేషన్ పనులు నిర్వహించేవారు. చాలా రోజుల పాటు ఎమర్జెన్సీ, ట్రామ్ కేర్ సెంటర్‌లో పనిచేసే అవకాశం ఉపేంద్రనాథ్‌కు లభించింది. ఆ విధి నిర్వహణల్లోనే ఆయన అనేక విషయాలు నేర్చుకున్నారు. తరచుగా జరుగుతున్న

యాక్సిడెంట్లతో తీవ్రంగా గాయపడిన రోగులకు ఎలాంటి సంరక్షణ అందించాలనే విషయాన్ని ఆయన బాగా ఆకళింపు చేసుకున్నారు.

హౌస్ సర్జన్‌గా విధి నిర్వహణలో ఉన్న ఓ రోజు ఒక రోగి ప్రాణాలను ఉపేంద్రనాథ్ కాపాడారు. యాక్సిడెంట్ జరిగి ఆ రోగిని ఆస్పత్రికి తీసుకొచ్చిన సమయంలో ఎమర్జెన్సీ రూమ్‌లో డాక్టర్లు ఎవరూ లేరు. రోగి పరిస్థితి విషమంగా ఉంది. కాళ్లు, చేతులకు ఫ్రాక్చర్ అయి రక్తం కారిపోతూ ఉంది. సీనియర్ డాక్టర్లు లేకపోవడంతో ఆ రోగికి ఉపేంద్రనాథ్ చికిత్స అందించడం మొదలుపెట్టారు. ముందు రక్తం కారకుండా చేసి ఆ తర్వాత నొప్పి తగ్గించేందుకు ఔషధాలు ఇచ్చారు. ఆ రోగికి అయిన అనేక గాయాలకు కూడా చికిత్స అందించారు. నొప్పితో తల్లడిల్లితూ ఆస్పత్రికి చేరిన ఆ రోగికి నిమిషాల్లోనే ఉపశమనం లభించింది. తాను త్వరలోనే కోలుకుంటాననే నమ్మకం అతనికి కలిగింది.

ఉపేంద్రనాథ్ హౌస్ సర్జన్‌గా పనిచేస్తున్న సమయంలో ఒక రోజు తనను పెళ్లి చేసుకోవాలని ఉషారాణి తన కోరికను వెలిబుచ్చింది. ఆమెకు అదే విషయం చెప్పాలని ఆలోచిస్తున్న ఉపేంద్రనాథ్, తాను ప్రేమిస్తున్న వ్యక్తి నుంచే ఆ మాట రాగానే వెంటనే సరేనన్నారు. ఇద్దరు తమ కుటుంబాలకు ఆ శుభవార్త తెలియజేశారు. రెండు వైపుల నుంచి వివాహానికి సమ్మతి లభించింది. వెంటనే పెళ్లి ఏర్పాట్లు జరిగిపోయాయి. ఆ వేడుకలు ముగిసిన తర్వాత ఇద్దరు తమ వైద్య విద్యను కొనసాగించారు.

కోర్సు పూర్తైన తర్వాత తుది పరీక్షలు జరిగాయి. ఆ పరీక్షల్లో ఉపేంద్రనాథ్ తరగతిలో అగ్రస్థానంలో నిలిచారు. ఐదేళ్ల తర్వాత కేవలం ఎనిమిది మంది విద్యార్థులు మాత్రమే ఎంబిబిఎస్ కోర్సు పూర్తి చేయగలిగారు. ఆ ఎనిమిది మందిలో ఉపేంద్రనాథ్ బాబాయ్, ఉషారాణి కూడా ఉన్నారు. ఆ బ్యాచ్‌లోని మిగిలిన 92 మంది విద్యార్థులు ఏదో ఒ?క సబ్జెక్టులో తప్పారు.

తన కుమారుడు కాలేజీ టాపర్‌గా నిలుస్తాడని ఊహించుకుంటున్న పుష్పవతి ఆ విషయం తెలియగానే పొంగిపోయారు. కాలపరీక్షలో ఆమె విశ్వాసం నెగ్గింది. తన తెలివితేటలు చక్కగా ఉపయోగించుకొని ఆ కుమారుడు ఆ తల్లి కల నెరవేర్చాడు. తన కుమారుడు ఉపేంద్రనాథ్ అద్భుతమైన వైద్యుడిగా రాణిస్తాడని, తండ్రి సాంబశివరావును ఆదరించినట్టుగానే ఉపేంద్రనాథ్‌ను ప్రజలు ఆదరిస్తారని పుష్పవతి గట్టిగా నమ్మారు. అదే సమయంలో ఆ కుటుంబం మరో శుభవార్త అందుకుంది. ఉపేంద్రనాథ్, ఉషారాణి దంపతులకు ఏప్రిల్ 24, 1966న కుమార్తె పుట్టింది. ఆమెకు మాధవి అని పేరు పెట్టారు.

# 11. ఉద్యోగం:

# రైల్వే శాఖలో విధి నిర్వహణ

ఎంబిబిఎస్ డిగ్రీ చేతికందిన తర్వాత అనేక అవకాశాలు ఉపేంద్రనాథ్ ముందుకు వచ్చాయి. సొంతంగా ప్రాక్టీస్ పెట్టడం.. లేదా ఏదైనా ఆస్పత్రిలో చేరడం.. లేదా పై చదువులు కొనసాగించడం. మెడిసిన్‌లో ఎం.డి. లేదా ఎం.ఎస్. వంటి కోర్సుల్లో చేరడం. ఆయన భార్య ఉషారాణికి కూడా అవే అవకాశాలు వచ్చాయి. ఇద్దరూ పీజీ కోర్సులకు దరఖాస్తు చేసుకున్నారు. కాకినాడలో గైనకాలజీ, అబ్‌స్టెట్రిక్స్‌లో ఉషారాణికి పీజీ సీటు, జనరల్ సర్జరీలో ఉపేంద్రనాథ్‌కు సీటు వచ్చింది. కానీ వాటిని వదులుకొని అమెరికా వెళ్లాలని ఆ జంట నిర్ణయించుకుంది.

ఆ రోజుల్లో ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశంగా ఎదిగిన అమెరికాలో డాక్టర్ల కొరత ఉండేది.  కానీ, ఆ దేశంలో ప్రతీ రంగంలోనూ నిరంతర ప్రగతి ఉండేది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మిగతా అన్ని దేశాలకన్నా అమెరికా ఎంతో ముందు ఉండేది. ఆరోగ్యం, ఔషధాల విషయంలో అమెరికా మిగిలిన ప్రపంచ దేశాలకు అందనంత దూరంలో ఉండేది. అత్యంత వేగంగా కొత్త పరిజ్ఞానం ఆవిర్భవించేది. పరిశోధనలు భారీ స్థాయిలో జరుగుతుండేవి. కానీ, జనాభా నిష్పత్తితో పోల్చితే వైద్యుల కొరత కనిపించేది. ఆ కారణంగా అమెరికాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు ఇతర దేశాల్లోని వైద్యులను తమ దేశానికి ఆహ్వానిస్తూ ఉండేవి.

రంగరాయ మెడికల్ కాలేజీలో ఉపేంద్రనాథ్ విద్యాభ్యాసం సాగుతున్న రోజుల్లో ప్రముఖ వైద్య పత్రికల్లో అమెరికాలో వైద్యులు కావాలనే ప్రకటనలు తరచూ కనిపిస్తూ ఉండేవి. వాటిని చూసిన ఉపేంద్రనాథ్, అమెరికా వెళ్లాలని, అక్కడ తన సేవలందించాలని సంకల్పించుకున్నారు.

ఎంబిబిఎస్ కోర్సులో భాగంగా విద్యార్థులు తెలుసుకున్న అనేక పరికరాలు భారతదేశంలోని చాలా ఆస్పత్రుల్లో లేవని విషయాన్ని ఆయన గ్రహించారు. దానికి ఉదాహరణ అల్ట్రా సౌండ్ స్కానింగ్ మెషీన్లు. అలాగే వాళ్లు నేర్చుకున్న అనేక పరీక్షలు.. ఉదాహరణకు లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్ టెస్టుల వంటి భారతదేశంలోని అనేక ఆస్పత్రుల్లో ఉండేవి కాదు. దేశంలోని చాలా ఆస్పత్రుల్లో కేవలం ఎక్స్-రే మెషీన్లు, బ్లడ్ షుగర్ పరీక్షల వెసులుబాటు మాత్రమే ఉండేది.

కాకినాడలో విద్యాభ్యాసం సందర్భంగా పుస్తకపరిజ్ఞానమే తప్ప ఆచరణాత్మక పరిజ్ఞానం అంతగా పొందలేదనే విషయాన్ని ఉపేంద్రనాథ్ గుర్తించారు. సొంతంగా రోగులకు చికిత్స అందించే అవకాశం లేదా ఏదైనా శస్త్రచికిత్స చేసే అవకాశమూ లభించలేదు. రోగులకు చికిత్స అందించేందుకు ఆయన పూర్తిస్థాయిలో సంసిద్ధులుగా లేరు. దానికి ఆచరణాత్మక అర్హత కావాలి, అదే కేవలం అనుభవం, శిక్షణ ద్వారా మాత్రమే పొందగలం అని గుర్తించారు.

ఎంబిబిఎస్ నాలుగో సంవత్సరంలోనే అమెరికా వెళ్లి మెడికల్ సైన్స్‌లో నిష్ణాతుడిని కావాలని ఉపేంద్రనాథ్ భావించి తగిన ఏర్పాట్లు చేసుకోవడం మొదలుపెట్టారు. వివిధ రకాల జర్నల్స్ చదువుతూ వైద్యశాస్త్రం పరంగా అమెరికా సాధిస్తున్న పురోగతి, కొత్త ప్రయోగాల గురించి నేర్చుకునేవారు. ప్రపంచంలోని ఉత్తమ వైద్యులంతా అమెరికాలోనే ఉన్నారని గుర్తించారు. ఆ రోజుల్లో అమెరికాలోని అనేక ఆస్పత్రుల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలు అందుబాటులో ఉండేవి.

ఆ రోజుల్లో అమెరికాలోని ఏదైనా ఆస్పత్రిలో రెసిడెంట్ డాక్టరు కావాలన్నా లేదా ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నా విదేశీ వైద్య విద్యార్థుల కోసం నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి. ఆ పరీక్ష రాయాలని నిర్ణయించుకున్న ఉపేంద్రనాథ్ దాని కోసం చెన్నై వెళ్లారు.

చెన్నై రైల్వే స్టేషన్‌లో ఓ విచిత్రమైన సంఘటన చోటుచేసుకుంది. ఆ స్టేషన్‌లో భారతీయ రైల్వేలో పనిచేస్తున్న ఓ వైద్యాధికారి ఉపేంద్రనాథ్‌కు పరిచయమయ్యారు. మాటల సందర్భంగా తాను ఎంబిబిఎస్ పూర్తి చేశానని, ఉద్యోగ అన్వేషణలో ఉన్నట్టు ఉపేంద్రనాథ్ వివరించారు. దానికి ఒక పరీక్ష రాయమని ఆయన సలహా ఇచ్చారు. పరీక్షలంటే ఉపేంద్రనాథ్‌కు ఏనాడు భయం లేదు కాబట్టి ఆ పరీక్ష రాసేందుకు ఉత్సాహంగా అంగీకరించారు. ఉపేంద్రనాథ్ సామర్థ్యాన్ని గుర్తించిన ఆ అధికారి వెంటనే రైల్వే శాఖలో

డాక్టరు ఉద్యోగం ఇచ్చారు. ప్రారంభంలో గుంతకల్‌లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ రోజుల్లో గుంతకల్ రైల్వే స్టేషన్ చాలా పెద్దది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలోని ఆ పట్టణం మీదుగా అనేక రైళ్లు రాకపోకలు సాగిస్తూ ఉండేవి. చెన్నై నుంచి ముంబయి, బెంగళూరు నుంచి ముంబయి వెళ్లే రైళ్లన్నీ ఈ జంక్షన్ మీదుగానే వెళ్లేవి. మాధవి కొంత ఎదిగేంత వరకు భారతదేశంలోనే ఉద్యోగం చేయాలని ఆ తర్వాత అమెరికా వెళ్లవచ్చని భావించారు ఉపేంద్రనాథ్.

# 12. రెక్కలు:
# దృఢసంకల్పంతో అమెరికాకు పయనం

కూతురు మాధవితో కలిసి ఉపేంద్రనాథ్, ఉషారాణి గుంతకల్‌లో జీవితాన్ని ప్రారంభించారు. మేధావి అయిన డాక్టర్ ఉషారాణికి కూడా రైల్వేలో ఉద్యోగం లభించింది. కుటుంబ నియంత్రణ విభాగానికి ఉపేంద్రనాథ్ బాధ్యత వహించగా, గైనకాలజీ, అబ్‌స్టెట్రిక్స్ విభాగంలో పనిచేసే అవకాశాన్ని ఉషారాణి పొందారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల బాధ్యతలను ఉపేంద్రనాథ్‌కు అప్పగించారు. ఇద్దరూ రైల్వేలో ఉద్యోగం చేస్తుండటంతో రైల్వే పాసులు పొందేందుకు ఇద్దరికీ అర్హత ఉండేది. సెలవులు ఉన్నప్పుడు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లే అవకాశం వారికి లభించేది. ఆగ్రా వెళ్లి తాజ్‌మహాల్ చూసి ఆ అందానికి ఇద్దరు ముగ్ధులైపోయారు. ఢిల్లీతో పాటు అనేక నగరాలను వారు సందర్శించారు. కేరళ పర్యటనకు మాధవిని కూడా వెంట తీసుకెళ్లారు.

గుంతకల్‌లో కొన్నాళ్లు పనిచేసిన తర్వాత ఉపేంద్రనాథ్, ఉషారాణిని తమిళనాడులోని సేలంకు బదిలీ చేశారు. అదే సమయంలో ఉపేంద్రనాథ్ సోదరి ప్రఫుల్ల నిశ్చితార్థం జరిగింది. వివాహ తేదీ ఖరారు కాగానే ఉపేంద్రనాథ్, ఉషారాణి తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి పెళ్లికి హాజరయ్యేందుకు సొంత ఊరు సంగం జాగర్లమూడి వచ్చారు. వివాహ వేడుకలు ముగిసిన తర్వాత అమెరికా వెళ్లాలని వారు నిర్ణయించుకున్నారు. అమ్మాయి కూడా ఎదగడంతో ప్రయాణానికి ఇబ్బంది ఉండదని భావించారు.

ఉషారాణి స్నేహితురాలు శ్రీమతి వీర్రాజు, డాక్టరైన తన భర్తతో కలిసి అమెరికాలోని షికాగో నగరంలో ఉండేది. తాముండే నగరానికి రావాలని ఆమె ఈ దంపతులను ఆహ్వానించింది. ఉషారాణి ప్రీ-యూనివర్సిటీ కోర్సు చదివేటప్పుడు ఆమె సహచరి. ఆ తర్వాత ఆమె అమెరికా వెళ్లి స్థిరపడిపోయింది. ఆమె సలహాను అనుసరించి షికాగోకు

వెళ్లాలని ఉపేంద్రనాథ్, ఉషారాణి నిర్ణయించుకున్నారు. షికాగోలోని ఇల్లినాయిస్ మ్యాసోనిక్ ఆస్పత్రిలో ఇద్దరు ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ రెండు దరఖాస్తులకు ఆమోదం లభించింది.

కూతురు మాధవితో కలిసి ఉపేంద్రనాథ్, ఉషారాణి అమెరికాకు చేరుకున్నారు. విమానంలో ప్రయాణించడం ఉపేంద్రనాథ్‌కు అదే మొదటిసారి. విమానం గాల్లో ఎగరగానే ఉపేంద్రనాథ్‌లో ఆశలు పురివిప్పాయి. కొత్త ఆశలు, ఆశయాలు, కొత్త లక్ష్యాలతో ఆయన మనస్సు ఉప్పొంగిపోయింది. అమెరికాలో అత్యాధునిక వైద్య సదుపాయలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని, మంచి సర్జన్‌గా పేరు తెచ్చుకోవాలని శపథం చేశారు. అమెరికాలో తగిన శిక్షణ, అనుభవం సంపాదించుకుని భారతదేశం తిరిగి వచ్చి అద్భుతమైన ఆస్పత్రి నిర్మించాలని కలలుగన్నారు. అలా అనుకున్న సమయంలో ఆయన కళ్ల ముందు తగిన సదుపాయాలు లేని, వ్యాధిని సరిగ్గా నిర్ధారించేందుకు ఆధునిక పరికరాల లేమితో కూడిన గుంటూరు, తెనాలిలోని ఆస్పత్రులు కదలాడాయి. భారతదేశంలో నిపుణులు, సమర్థులైన వైద్యులు ఎంతో మంది ఉన్నా ఆస్పత్రుల్లో సదుపాయాల కొరత వారిని అడ్డుకుంటుందనే విషయాన్ని గుర్తించారు. ఆ వైద్యులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు తాను పరిష్కారం చూపాలని ఆకాంక్షించారు.

# 13. గమ్యస్థానం:
# స్వల్పకాలంలోనే అమెరికాతో మమేకం

షికాగో చేరిన ఉపేంద్రనాథ్, ఉషారాణికి ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు శ్రీమతి వీర్రాజు. విమానాశ్రయం నుంచి వారి ఇంటికి చేరుకునే తొలి ప్రయాణం ఉపేంద్రనాథ్‌ను మైమరపింపజేసింది. పూర్తిగా ఒక కొత్త ప్రపంచంలో అడుగుపెట్టిన భావన ఆయనలో ఏర్పడింది. పరిశుభ్రమైన, విశాలమైన రహదారులను చూసి ఆయనకు స్వదేశంపై జాలి కలిగింది. పేదరికం నుంచి బయటపడి అమెరికా స్థాయిలో భారత్ ఎదగాలంటే కొన్ని సంవత్సరాలు పడుతుందని గ్రహించారు. దారి పొడవునా ఉన్న బహుళ అంతస్తుల భవనాలను చూస్తూ ప్రయాణాన్ని కొనసాగించారు. అద్భుతమైన నిర్మాణ కౌశలానికి అవి ప్రతిబింబాలు. షికాగో నగర అందాలు, పరిశుభ్రత ఉపేంద్రనాథ్ మనస్సును దోచేశాయి. మొదటి చూపులోనే అమెరికా ఆయనను కట్టిపడేసింది. తాను చేరాల్సిన చోటుకే చేరాననే నమ్మకం ఉపేంద్రనాథ్‌లో ఏర్పడింది.

డాక్టర్ వీర్రాజు దంపతులు వీరికి చక్కని ఆతిథ్యం అందించారు. ఇల్లినాయిస్ మ్యాసోనిక్ ఆస్పత్రిలో ఉండేందుకు ఏర్పాట్లు జరిగేంత వరకు ఉపేంద్రనాథ్, ఉషారాణి, డాక్టర్ వీర్రాజు ఇంట్లోనే ఉన్నారు. అమెరికా ప్రజల జీవనశైలి, వారి ఆచార వ్యవహారాలను వారికి పరిచయం చేశారు. శ్రీమతి వీర్రాజుతో కలిసి షాపింగ్ చేసిన ఉషారాణి క్రమంగా అక్కడి వారి అలవాట్లు తెలుసుకున్నారు. ఆ రోజుల్లో షికాగో నగరంలో తెలుగువారి సంఖ్య చాలా తక్కువ. మొత్తం నగరంలో ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన కుటుంబాలు ఐదారు మించి ఉండేవి కావు.  ఆస్పత్రి ప్రాంగణంలో ఫ్లాట్ కేటాయించడంతో ఉపేంద్రనాథ్, ఉషారాణి, కూతురు మాధవితో కలిసి అక్కడికి మారిపోయారు.

పిల్లలు, పెద్దవారికి తగిన ఆరోగ్య సంరక్షణ అందించాలని అమెరికా ప్రభుత్వం భావిస్తున్న రోజులవి. వివిధ దేశాల్లోని వైద్యులను తమ దేశానికి అమెరికా ఆహ్వానం వెనుక కారణం అదే. దేశానికి ఉపయోగపడతారని భావించినట్టు అయితే డాక్టర్లకు శిక్షణ అందించేందుకు కూడా ఏర్పాట్లు చేసేది. వేరే దేశాల నుంచి వచ్చిన వైద్యులపై అమెరికా ప్రజలు కూడా గౌరవాభిమానాలు చూపేవారు.

కొన్ని రోజులకు ఉపేంద్రనాథ్, ఉషారాణి ఆస్పత్రిలో ఇంటర్న్‌షిప్ ప్రారంభించారు. ఇల్లినాయిస్‌లోని ఆ ఆస్పత్రి ప్రైవేటుది. ఇంటర్న్‌షిప్ కూడా ఇంచుమించు హౌస్‌సర్జన్ తరహాలో ఉండేది. ఇంటర్న్‌గా ఉపేంద్రనాథ్ నెల జీతం 500 డాలర్లు. ఉచిత వసతితో పాటు పని వేళల్లో ఆస్పత్రి వారే భోజనం సమకూర్చేవారు.

ఆస్పత్రి ప్రాంగణంలోనే పెద్ద సూపర్ మార్కెట్ ఉండేది. ఇంటికి కావాల్సిన సరుకులను ఉపేంద్రనాథ్, ఉషారాణి అక్కడే కొనేవారు. ఆ రోజుల్లో ధరలు అందుబాటులోనే ఉండేవి. ఐదు డాలర్లకే వారానికి సరిపడా గృహావసర సరుకులు వచ్చేవి. ఒక గ్యాలన్ పాలు ధర కేవలం 50 సెంట్లే. ఉపేంద్రనాథ్, ఉషారాణి దంపతులు జీవితం సంతృప్తికరంగా, సంతోషంగా, ప్రశాంతంగా సాగిపోయేది.

ఆ ఆస్పత్రిలో రోగులపట్ల వైద్యులు చూపే ఆదరణ ఉపేంద్రనాథ్‌ను బాగా ఆకట్టుకునేది. ప్రతీ రోగిని ఎంతో శ్రద్ధగా పరీక్షించేవారు. అందరికీ ఒకలాగే చూసేవారు. గొప్ప–పేద, బ్లాక్–వైట్, స్థానికులు–పరదేశీయులు అనే వ్యత్యాసం డాక్టర్లు చూపకపోయేవారు. పని ప్రదేశంలో వివక్ష లేకపోవడం ఉపేంద్రనాథ్‌కు బాగా నచ్చింది.

అమెరికాలో ఉన్న డాక్టర్లలో ఎక్కువ మంది యూదులు అనే విషయం ఈ డాక్టరు దంపతులను ఆశ్చర్యపరిచింది. అమెరికా జనాభాలో ఎక్కువ మంది క్రిస్టియన్లు ఉంటారనే భావనతో ఉపేంద్రనాథ్ అమెరికాలో అడుగుపెట్టారు. యూదులైనా, క్రిస్టియన్లు అయినా డాక్టర్లు అందరూ బాగా చదువుకున్నవారు, మంచి నిపుణులు. నైతిక విలువలు, నియమ నిబంధనల విషయంలో ఎక్కడా రాజీ అన్నది ఉండేది కాదు.

అమెరికాకు వచ్చిన కొత్తలో అక్కడి ఇంగ్లీష్ యాసను అర్థం చేసుకునేందుకు ఇద్దరూ బాగా ఇబ్బందిపడ్డారు. స్థానిక యాసను అర్థం చేసుకోవడం బాగా కష్టంగా ఉండేది. ఆ భాష. యాస అర్థం చేసుకునేందుకు కొన్నాళ్లు పట్టింది. నిదానంగా అక్కడి వారితో మాట్లాడటం మొదలుపెట్టిన తర్వాత అమెరికన్లు పలికే విధానాన్ని బాగా ఆకళింపు చేసుకోగలిగారు.

కొన్ని నెలల్లోనే డాక్టరు దంపతులకు అమెరికా పట్ల అభిమానం ఏర్పడింది. అమెరికన్లు చాలా మంది స్నేహశీలురు, ఉదారవాదులనే విషయాన్ని గ్రహించారు. ఆస్పత్రిలో చేరిన కొన్నాళ్లకే చాలా మంది ఇతర వైద్యులు వీరిని తమ ఇంటికి భోజనానికి ఆహ్వానించేవారు. అలా ఆహ్వానించిన వారిలో ఇల్లినాయిస్ మ్యాసోనిక్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ కూడా ఉన్నారు. పరస్పర ఆహ్వానాలు అక్కడ సాధారణ సంప్రదాయం. చాలాసార్లు ఉపేంద్రనాథ్ తోటి వైద్యులు, వారి కుటుంబాలతోనే భోజనం చేసేవారు. తోటి డాక్టర్లు చూపే అదరాభిమానాలు ఉపేంద్రనాథ్, ఉషారాణి దంపతులను ముగ్ధులను చేశాయి. అమెరికా తమ సొంత దేశమనే భావన ఇద్దరిలో క్రమంగా మొదలైంది.

# 14. కాఠిన్యం:

# రెసిడెంట్ డాక్టరుగా కఠోర శ్రమ

ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్ చేసిన తర్వాత ఉపేంద్రనాథ్, ఉష రెసిడెన్సీకి అర్హత సాధించారు. రెసిడెంట్ డాక్టర్‌గా ఉండటమన్నది ఓ విధంగా పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సు చేయడం వంటిదే. ఆ నాటి నిబంధన ప్రకారం రెసిడెన్సీ వ్యవధి నాలుగు సంవత్సరాలు. ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్, నాలుగేళ్ల రెసిడెన్సీ తర్వాత డాక్టర్లు సీనియర్ రెసిడెంట్లు అవుతారు. దీని ద్వారా అన్ని రకాల శస్త్రచికిత్సలు స్వతంత్రంగా చేయగల సామర్థ్యాన్ని అందిపుచ్చుకుంటారు.

రెసిడెంట్ డాక్టరుగా అన్ని రకాల శస్త్రచికిత్స ప్రక్రియల్లో ఉపేంద్రనాథ్ లోతైన నైపుణ్యం సాధించారు. మరో వైపు ఉషారాణి ఉద్యోగం చేస్తూనే కూతురి ఆలనాపాలనా చూసేందుకు వీలు ఉంటుంది కాబట్టి అనెస్తీయాలజీలో ఇంటర్న్ షిప్ చేయాలని నిర్ణయించుకున్నారు. చిన్నారి మాధవిని చూసుకునేందుకు వీలుగా డ్యూటీలు ఉండేలా భార్యాభర్తలు వెసులుబాటు చేసుకున్నారు. అయినప్పటికీ ఇద్దరూ ఆస్పత్రి విధుల్లో పూర్తిగా నిమగ్నమై ఉన్న సమయంలో పాపను చూసుకునేందుకు ఓ పని అమ్మాయిని నియమించుకున్నారు.

ఇల్లినాయిస్ ఆస్పత్రిలో పనిచేస్తున్న సమయంలో ఉపేంద్రనాథ్ అనేక కొత్త విషయాలు నేర్చుకున్నారు. ఆ రోజుల్లో అమెరికా నియంత్రణలో ప్యూర్టో రికా నుంచి అనేక మంది రోగులు ఆస్పత్రికి వచ్చేవారు. నేరాలకు సంబంధించిన అనేక ఘటనలు ఆ ద్వీపంలో తరచూ చోటుచేసుకునేవి. అమాయకుల దగ్గర నుంచి డబ్బు దోచుకోవడమే కాదు అల్లరిమూకలు కొన్నిసార్లు ప్రాణాలూ తీసేవారు. అలా గాయపడిన అనేక మంది ఈ ఆస్పత్రికి వస్తుండేవారు. కత్తిపోట్లతో గాయాలబారిన పడ్డ అనేక మందికి చాలా సందర్భాల్లో ఉపేంద్రనాథ్ వైద్యం అందించేవారు.

చాలా సందర్భాల్లో రోగుల పరిస్థితి విషమంగా ఉండేది. తలకు అయ్యే గాయాల కారణంగా చాలా మంది ప్రాణాలు విడిచేవారు. డ్యూటీలో ఉండగా అలాంటి అనేక కేసులను ఉపేంద్రనాథ్ చూశారు. స్వయంగా శస్త్రచికిత్సలు చేసి చాలా మంది ప్రాణాలు కాపాడారు.

ఎంతటి పెద్ద శస్త్ర చికిత్స అయినా చేయగలరని రెసిడెన్సీ మూడు సంవత్సరంలో ఉపేంద్రనాథ్ నిరూపించుకున్నారు. తుపాకీ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తిని ఆస్పత్రికి తీసుకొచ్చిన సమయంలో ఆ ఘటన చోటుచేసుకుంది. బుల్లెట్ అతని కడుపులోకి చీల్చుకుపోయింది. పేగులను అది తీవ్రంగా గాయపరిచింది. కడుపులోకి రక్తం లీకవుతోంది. విషమంగా ఉన్న ఆ రోగి పరిస్థితి ఇప్పుడో, అప్పుడో అన్నట్టుగా మారింది. అలాంటి రోగికి ఒకటి కాదు రెండుకాదు మూడు శస్త్రచికిత్సలు నిర్వహించారు డాక్టర్ ఉపేంద్రనాథ్. ఎంతో నేర్పుగా చేసిన ఆ శస్త్రచికిత్సలు ఆ మనిషి ప్రాణాలు నిలబెట్టాయి. అతని పరిస్థితి ఎంత విషమంగా ఉందంటే శస్త్ర చికిత్సల తర్వాత కూడా అతను నెల రోజులపాటు ఆస్పత్రిలోనే ఉండాల్సి వచ్చింది. ఆ నెల పాటు ఆ రోగిని ఉపేంద్రనాథ్ ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. కోలుకొని ఆ రోగి ఇంటికి వెళ్తూ మనస్ఫూర్తిగా ఉపేంద్రనాథ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆ శస్త్రచికిత్స తర్వాత మిగతా డాక్టర్లంతా ఉపేంద్రనాథ్ ఒక అద్భుతమైన సర్జన్ అని అంగీకరించారు.

ఆ ఆస్పత్రిలో డాక్టర్ పీరయ్య సీనియర్ రెసిడెంట్‌గా ఉండేవారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు చెందిన ఆయన అనేక విషయాల్లో ఉపేంద్రనాథ్‌కు సాయమందించారు. అమెరికాలో ఎలా వ్యవహరించాలి? పని ప్రదేశంలో ఎలా మసలుకోవాలో ఉపేంద్రనాథ్ దంపతులకు నేర్పించింది ఆయనే.

# 15. ద్వితీయ ఆశీస్సు:
# విధి నిర్వహణలో ఉండగా శుభవార్త

అదే సమయంలో ఉషారాణి మరోసారి గర్భవతయ్యారు. అయినప్పటికీ ఆమె ఆస్పత్రికి రావడం మానలేదు. క్రమం తప్పకుండా ఆమె తన విధులు నిర్వర్తించేవారు. ఎనిమిదో నెలలోనూ ఆమె రోజంతా ఆస్పత్రిలో పనిచేశారు. అలా విధి నిర్వహణలో ఉండగానే ఆమెకు నొప్పులు వచ్చాయి. వెంటనే ఆమెను మెటర్నిటీ వార్డుకు తీసుకెళ్లారు. రెండో కాన్పులో ఆమె అబ్బాయికి జన్మనిచ్చింది. రెండో సంతానం పుట్టే సమయంలో ఉపేంద్రనాథ్ డ్యూటీలోనే ఉన్నారు. మీ కుమారుడు ఈ భూమి మీదకు వచ్చాడని తోటి డాక్టరు ఆ శుభవార్తను ఉపేంద్రనాథ్‌కు తెలిపారు. సంతోషంతో పొంగిపోయిన ఉపేంద్రనాథ్, పరుగున ఉషారాణి దగ్గరకు వచ్చారు. ఆనందాన్ని అస్వాదించిన ఆ దంపతులు ఆ బాబుకు శ్రీధర్ అని పేరుపెట్టారు.

ఆ విషయం ఉపేంద్రనాథ్ గ్రామానికి చేరింది. పుష్పవతి చాలా సంతోషించింది. శ్రీధర్ ఆలనాపాలనా చూసుకునేందుకు అమెరికా వస్తానని పుష్పవతి చెప్పడం, సంతోషంగా ఆమెను అమెరికాకు ఉపేంద్రనాథ్ ఆహ్వానించడం వెంటవెంటనే జరిగిపోయాయి. అదే సమయంలో డాక్టరేట్ చేసేందుకు ప్రఫుల్ల కూడా అమెరికా వచ్చారు. కోల్‌కతాలోని మెడికల్ కాలేజీలో ఆమె ఎంబిబిఎస్ పూర్తి చేశారు. కోల్‌కతాలో నిమ్మకాయల వ్యాపారం చేసే బంధువు దగ్గర ఉండి ఆమె తన చదువులు పూర్తిచేశారు. ఆమె కూడా ఒక డాక్టరునే వివాహమాడారు. అత్యాధునిక వైద్యసదుపాయలతో ప్రయోజనం పొందేందుకు అమెరికా రావాలని సోదరికి ఉపేంద్రనాథ్ సూచించారు. అన్న సలహాను అనుసరించి ఆమె అమెరికా వచ్చారు.

ఇల్లినాయిస్ ఆస్పత్రిలో ఐదేళ్లు గడిపి ఉపేంద్రనాథ్, ఉష తమ రెసిడెన్సీ పూర్తి చేశారు. ఇప్పుడు ఇద్దరు అమెరికాలో పూర్తి లైసెన్స్ పొందిన వైద్యులయ్యారు. స్వతంత్రంగా రోగులకు చికిత్స అందించేందుకు వారు ఇప్పుడు అర్హులు.

## 16. ఖ్యాతి:

# బరువు తగ్గించే సర్జరీ ద్వారా గుర్తింపు పొందడం

సీనియర్ రెసిడెంట్ అయిన తర్వాత ఇల్లినాయిస్ ఆస్పత్రిని విడిచి డాక్టర్ ఇలియట్ గోల్డిన్‌తో పనిచేయాలని ఉపేంద్రనాథ్ నిర్ణయించుకున్నారు. బారియాట్రిక్ సర్జన్‌గా మంచి పేరు ప్రఖ్యాతలు కలిగిన వైద్యుడు గోల్డిన్. ఇలియట్ గోల్డిన్‌కు చెందిన నార్త్ సబర్బన్ క్లినిక్‌లో భాగస్వామిగా చేరారు ఉపేంద్రనాథ్. ఆయన బృందంలో వేర్వేరు అంశాలపై నిష్ణాతులైన అరవై మంది వైద్యులు ఉండేవారు. ఆ రోజుల్లోనే అత్యాధునిక వైద్యసదుపాయాలు, పరికరాలు కలిగిన ఆస్పత్రి అది. ఆస్పత్రిలోని సర్జరీ విభాగంలో ఉపేంద్రనాథ్ చేరారు. కానీ ఇల్లినాయిస్ ఆస్పత్రిలోనే అనెస్తియాలజీలో సీనియర్ రెసిడెంట్‌గా కొనసాగాలని ఉషారాణి నిర్ణయించుకున్నారు.

ఆరోగ్యం గురించి అమెరికా ప్రజలు తీవ్రంగా ఆందోళన చెందుతున్న సమయం అది. ప్రజల ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయింది. ప్రధానమైన అంశంగా ఆరోగ్యం మారింది. ఆహార అలవాట్లు మారాయి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, పోషకాలతో కూడిన సమతుల ఆహారానికి ప్రాధాన్యమివ్వసాగారు. ఊబకాయంతో ఉన్నవారు బరువు తగ్గించుకునేందుకు కష్టపడేవారు. ఎంత తింటున్నామనేదానిపై ఆ రోజుల్లో అమెరికా ప్రజల్లో ఎటువంటి నియంత్రణ ఉండేది కాదు. చాలా మంది అతిగా తినేవారు, వేపుళ్లు, బర్గర్లు, పిజ్జాలు, ఫ్రెంచ్ ఫ్రైల వంటివి విపరీతంగా ఇష్టపడేవారు. మద్యానికి బానిసలైన వారి సంఖ్య కూడా ఎక్కువే. ఈ రకమైన జీవనశైలి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీసింది. ఊబకాయంతో అమెరికన్లు తల్లడిల్లేవారు. ఊబకాయం కారణంగా హైపర్‌టెన్షన్, మధుమేహం, గుండె, మూత్రపిండాలు, కాలేయ సమస్యలు చుట్టుముట్టేవి. భారీ శరీరాల కారణంగా చాలా మంది ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితి.

ఊబకాయం తగ్గించేందుకు అనేక మార్గాలు కనుగొనబడ్డాయి. డాక్టర్లు, సర్జన్లు అనేక ప్రయోగాలు నిర్వహించేవారు.

1954లో మొదటి బరువు తగ్గించే శస్త్రచికిత్స నిర్వహించారు. ఊబకాయంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి గ్యాస్ట్రిక్ బైపాస్ సర్జరీ నిర్వహించారు డాక్టర్ ఎ.జె.క్రెమెన్ ఆయన బృందం. పెద్ద మొత్తంలో క్యాలరీలు చేరకుండా ఉండేందుకు ఆ రోగిలో పెద్ద పేగులు, చిన్న పేగులను కలిపారు. ఇలా రకరకాల ప్రయోగాలు ఆ రోజుల్లో డాక్టర్లు చేపట్టేవారు. ఆ క్రమంలో ఊబకాయ సర్జరీలు మొదలయ్యాయి.

ఈ శస్త్ర చికిత్సల ప్రధాన సూత్రం తీసుకునే ఆహారాన్ని తగ్గించడం లేదా పరిమితం చేయడం. ఇలా చేయడం వలన పొట్ట, పేగులు గ్రహించే ఆహారం తగ్గిపోయేది. గ్యాస్ట్రిక్ బైపాస్ సర్జరీ విధానాన్ని ఎక్కువగా అనుసరించేవారు. ఈ శస్త్రచికిత్స ప్రక్రియలో ఉదరపు పై భాగాన్ని కట్టేసి కింది భాగాన్ని చిన్న పేగులకు కలిపేవారు. ఇలా చేయడం వలన ఆహారం నేరుగా చిన్న పేగులకు చేరుతుంది. మామూలు కంటే తక్కువ తిన్నా కడుపు నిండిన భావన గ్యాస్ట్రిక్ బైపాస్ సర్జరీతో కలిగేది. దీంతో తక్కువ ఆహారం తీసుకునేవారు. దాంతో క్రమంగా బరువుపై నియంత్రణ సాధించడం సులువయ్యేది.

బరువు తగ్గించేందుకు అనుసరించిన మరో ప్రక్రియ గ్యాస్ట్రిక్ స్లీవ్ సర్జరీ. ఈ విధానంలో పొట్ట పరిమాణాన్ని తగ్గించేవారు. ఈ రోజుల్లో ఈ తరహా చికిత్సలను ల్యాప్రోస్కోపిక్ పరికరాల ద్వారా నిర్వహిస్తున్నారు.

ఇలియట్ గోల్డిన్‌తో కలిసి ఉపేంద్రనాథ్ విజయవంతంగా ఎన్నో ఊబకాయ తగ్గింపు శస్త్రచికిత్సలు నిర్వహించారు. బరువు తగ్గించే శస్త్రచికిత్సలు నిర్వహించడంలో వారి ఆస్పత్రి ఎంతో పేరు తెచ్చుకుంది. ల్యాప్రోస్కోపిక్ సర్జరీల పరంగా కూడా మిగిలిన ఆస్పత్రులన్నింటి కన్నా అది ఎంతో ముందుండేది. ల్యాప్రోస్కోపి, కొలనోస్కోపి, ఎండోస్కోపి, గ్యాస్ట్రోస్కోపి శస్త్రచికిత్సలు చేయడం ఉపేంద్రనాథ్ ప్రారంభించారు.

ఓసారి పొరపాటు జరగడంతో కొన్నిరోజుల పాటు ఆస్పత్రిలో ఊబకాయ శస్త్ర చికిత్సలు చేయడం ఆపేశారు. ఊబకాయంతో ఉన్న ఓ వ్యక్తి మధుమేహం, హైపర్‌టెన్షన్ సమస్యలతో ఆస్పత్రికి వచ్చారు. బరువు తగ్గించుకునే శస్త్రచికిత్స చేయించుకోవాలని వైద్యులు సూచించారు. అతనికి సర్జరీ చేశారు. కానీ, కొన్ని రోజులకే ఇతర సమస్యలు తలెత్తాయి. అతని జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేయడం మానేసింది. అతిసారం సమస్య కూడా తలెత్తింది. మరో వైపు బ్లడ్ ప్రెషర్‌లో ఒడిదొడుకులు. అంతే కాదు అతనికి కిడ్నీ, గుండె సమస్యలూ ఏర్పడ్డాయి. ఆ సమయం ఒక ప్రయోగదశగా మారిపోయింది. ఊబకాయం

తగ్గించేందుకు అనేక రకాల విధానాలు అనుసరించారు. కొన్ని పనిచేశాయి, కొన్ని విఫలమయ్యాయి. ఈ ప్రయత్నాల ద్వారా భవిష్యత్తులో రోగులకు ఉపయోగపడే కొత్త పరిజ్ఞానాన్ని ఉపేంద్రనాథ్, ఇతర వైద్యులు తెలుసుకోగలిగారు. ఈ ప్రయోగాల ఫలితంగా ఊబకాయం తగ్గించేందుకు సురక్షితమైన, ప్రభావవంతమైన శస్త్రచికిత్సా విధానాలు కనుగొనబడ్డాయి.

అదే సమయంలో ఉపేంద్రనాథ్ సోదరి ప్రఫుల్ల కూడా అదే ఆస్పత్రిలో చేరారు. గైనకాలజీ, అబ్‌స్టెట్రిక్స్‌లో శిక్షణ పూర్తి చేసిన తర్వాత ఆమె సొంత ప్రాక్టీసు ప్రారంభించారు. ఎన్నో సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ తీరిక లేకుండా ఉండేవారు ఉపేంద్రనాథ్. దాదాపు 250 పౌండ్లు (113 కేజీల) బరువున్న వ్యక్తికి శస్త్రచికిత్స చేసే అవకాశం ఓ సారి ఉపేంద్రనాథ్‌కు లభించింది. ఆ వ్యక్తి పనులు చేసుకునేందుకు కాదు కదా, నాలుగు అడుగులు వేసేందుకు కూడా చాలా ఇబ్బందిపడేవాడు. అతని భారీకాయానికి ఆపరేషన్ థియేటర్‌లోని టేబుల్ కూడా సరిపోలేదు. ఆస్పత్రి బెడ్‌పైనే అతనికి ఆపరేషన్ చేశారు. సర్జరీ తర్వాత అతను బరువు తగ్గాడు. అనేక ఇతర సమస్యల నుంచి బయటపడ్డాడు. కానీ కొన్ని నెలల తర్వాత మళ్లీ అదే సమస్యలు. పరిస్థితి విషమంగా మారడంతో ఆపరేషన్ తిరిగి చేయాల్సి వచ్చింది. బరువు తగ్గించే శస్త్ర చికిత్స చాలా సున్నితమైనది, రోగిపరంగా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. జీవనశైలిలో మార్పులు చేసుకోవడమే కాదు ఆరోగ్యకరమైన, సమతుల ఆహారం తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే రోగి అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. డాక్టర్లు చెప్పిన సూచనలను ఆ రోగి పాటించకపోవడం వల్లే అది తిరగబెట్టిందని ఉపేంద్రనాథ్ అనుమానించారు.

మరో సంక్లిష్టమైన కేసును కూడా ఉపేంద్రనాథ్ ఎదుర్కోవాల్సి వచ్చింది. తీవ్రమైన కడుపు నొప్పితో ఒక రోగి ఆస్పత్రికి వచ్చారు. మందుల వలన ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో అతనికి ఎండోస్కోపి చేయాలని ఉపేంద్రనాథ్ నిర్ణయించారు. ఆ రోగి చిన్న పేగుల్లో ముడులు ఉన్న విషయం ఉపేంద్రనాథ్‌ను ఆశ్చర్యపోయేలా చేసింది. అలాంటి కేసులు చాలా అరుదుగా ఉంటాయి. వాటికి చాలా జాగ్రత్తగా చికిత్స అందించాల్సి ఉంటుంది. ముడులు విడదీసి పేగులను సరిగ్గా చేయాలని ఉపేంద్రనాథ్ భావించారు. కానీ ఆ పని అంత సులభం కాదు. ముడులు చాలా ఉన్నాయి, వాటిని విప్పదీయడం ముప్పుతో కూడుకున్న వ్యవహారం. ఆ సంక్లిష్టమైన శస్త్రచికిత్సను అనేక జాగ్రత్తలతో ఉపేంద్రనాథ్, ఆయన సహచరులు విజయవంతంగా నిర్వహించారు.

సర్జరీలపరంగా సాధిస్తున్న విజయాలు ఉపేంద్రనాథ్‌లో సంతృప్తిని నింపాయి. సమర్థుడైన సర్జన్‌గా అమెరికాలో ఉపేంద్రనాథ్ పేరు మార్మోగింది. భవిష్యత్ గురించి ఆలోచన చేసిన ఉపేంద్రనాథ్ తన భావాలను జీవిత భాగస్వామి ఉషారాణితో పంచుకున్నారు. 58 ఏళ్ల వయస్సులో వైద్య రంగం నుంటి రిటైర్ కాదలిచానని ఆయన స్పష్టంగా తెలియజేశారు. ఆయన నిర్ణయం విన్న ఉషారాణి ఎంతో ఆశ్చర్యపోయారు. కారణాలు కనుక్కునే ప్రయత్నం చేశారు. వైద్యుడిగా కాదు జీవితంలో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని ఆయన చెప్పడంతో ఆయన ఆలోచనలను అర్థం చేసుకున్న ఆమె వాటికి అండగా నిలిచారు.

# 17. పెట్టుబడి:
# మన్మోహన్ సింగ్ విధానాల ప్రభావం

90 దశకం ప్రారంభం నుంచి భారతదేశం రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అనేక మార్పులకు లోనైంది. 1989 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఏ పార్టీకి స్పష్టంగా పట్టం కట్టలేదు. కానీ, రాజీవ్‌గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ మాత్రం తీవ్ర పరాభావాన్ని ఎదుర్కొన్న విషయం మాత్రం తేటతెల్లమైంది. ఇందిరాగాంధీ హత్య తర్వాత 1984లో జరిగిన ఎన్నికల్లో 542 లోక్‌సభ స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ 426 సీట్లలో విజయం సాధించింది. 1989 ఎన్నికల్లో ఆ స్థానాలు 197కు పడిపోయాయి. ఏకంగా 217 సీట్లు కాంగ్రెస్ పార్టీ కోల్పోయింది. జనతాదళ్, తెలుగుదేశం పార్టీ, ద్రవిడ మున్నేట్ర కజగం, అస్సాం గణపరిషత్ వంటి పార్టీలన్నీ నేషనల్ ఫ్రంట్‌గా ఏర్పడి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.

కాంగ్రెస్ పార్టీని వీడి జనతాదళ్ పార్టీలో చేరిన విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ డిసెంబర్ 2, 1989న భారతదేశ ఎనిమిదో ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన తీసుకున్న ఒక నిర్ణయంతో దేశంలో రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మండల్ కమిషన్ చేసిన సిఫార్సులను విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ అమల్లోకి తెచ్చారు. మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తున్నట్టు నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ప్రకటించిన వెంటనే ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. ఉన్నత కులాలు ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించాయి. అదే సమయంలో అయోధ్యలో రామాలయం నిర్మించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ ఉద్యమాన్ని ప్రారంభించింది.

విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ నిర్ణయం జనతాదళ్‌లోనే చాలా మంది ఎంపీలకు మింగుడుపడలేదు. ఆ అసమ్మతి వర్గం చంద్రశేఖర్ నేతృత్వంలో సొంత కుంపటి పెట్టుకుంది. విశ్వనాథ్ ప్రతాప్ రాజీనామా చేయడం, నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం పతనమవడం చకచకా జరిగిపోయాయి. చంద్రశేఖర్ వర్గానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించడంతో నవంబర్ 10, 1990న భారతదేశ కొత్త ప్రధానిగా చంద్రశేఖర్ ప్రమాణస్వీకారం చేశారు. కానీ ఆ ప్రభుత్వం కూడా ఎక్కువ రోజులు మనుగడ సాగించలేకపోయింది. కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉపసంహరించడంతో ఆ ప్రభుత్వం కూడా కూలిపోయింది. లోక్‌సభకు తిరిగి ఎన్నికలు జరిగాయి. ఆ క్రమంలో తమిళనాడులోని శ్రీపెరంబదూరులో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తున్న రాజీవ్ గాంధీపై ఆత్మాహుతి దళం దాడి జరిపింది.

1991 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. పి.వి.నరసింహరావు భారతదేశ పదో ప్రధానమంత్రి అయ్యారు. ఎన్నో ఆశ్చర్యకరమైన నిర్ణయాలు ఆయన తీసుకున్నారు. రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్, ప్రఖ్యాత ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్‌ను తన కేబినెట్‌లో చేర్చుకొని ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారు. సీనియర్ రాజకీయవేత్తకు ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగిస్తారని పలువురు వేసిన అంచనాలు తప్పాయి. దేశ బలహీన ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయంగా చోటుచేసుకున్న మాంద్యం కారణంగా ఆర్థికవేత్తకు ఆర్థికశాఖ బాధ్యతలు అప్పగించారని రాజకీయ నిపుణులు అంచనాకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే మన్మోహన్ సింగ్ అనేక ఆర్థిక సంస్కరణలు ప్రారంభించారు. ఆ సంస్కరణల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ స్థితి, దిశ సమూలంగా మారిపోయింది. దేశ రోజువారీ ఖర్చులకు బంగారం తాకట్టు పెట్టిన పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థ పగ్గాలు చేపట్టిన మన్మోహన్ సింగ్ నవశకానికి నాంది పలికారు. ఆర్థిక సరళీకరణకు మార్గం సుగమం చేస్తూ ఆయన భారత ఆర్థిక వ్యవస్థను బార్లా తెరిచారు. లైసెన్స్ రాజ్‌కు ముగింపు పలికారు. పన్ను తగ్గించారు, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించి విదేశీ వ్యాపారులు భారత్‌కు వచ్చేలా ఆకర్షించారు.

సమర్థుడైన సర్జన్‌గా అమెరికాలో మంచి పేరు తెచ్చుకున్న ఉపేంద్రనాథ్‌పై మన్మోహన్ సింగ్ ఆర్థిక విధానాలు ప్రభావం చూపాయి. దేశ ప్రధాని కూడా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి కావడం, విదేశాల్లో స్థిరపడిన భారతీయులు భారత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్న పిలుపు ఉపేంద్రనాథ్ మనస్సులో లోతుగా నిలిచిపోయింది. ఆ మాటలకు ఆకర్షితులైన ఉపేంద్రనాథ్ తన వంతు పాత్ర నిర్వర్తించేందుకు మనస్సును సిద్ధం చేసుకున్నారు.

# 18. వ్యవస్థాపకత:
# విజయవంతంగా కష్టాలను అధిగమించడం

భారత మార్కెట్ ద్వారాలు తెరుచుకోవడంతో పెట్టుబడులు రాబట్టేందుకు అనేక మంది భారతీయ పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అమెరికా బాట పట్టారు. అమెరికాలో నివసించే భారతీయులను కలుసుకొని వీరంతా తమ ప్రాజెక్టుల గురించి వివరించి పెట్టుబడుల కోసం విజ్ఞప్తులు చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా అనేక మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు అన్వేషిస్తూ అమెరికాకు రాసాగారు. సంపదతో పాటు ఖ్యాతిని కూడా ఉపేంద్రనాథ్ అర్జించడంతో పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు లేదా వారి ప్రతినిధులు కూడా వచ్చి ఆయనను కలుస్తుండే వారు. ప్రస్తుతం అమలవుతున్న ప్రాజెక్టులు లేదా ప్రతిపాదిత ప్రాజెక్టుల గురించి వివరించి పెట్టుబడులు పెట్టండి అని అభ్యర్థించేవారు.

సింగపూర్‌కు చెందిన కంపెనీలో తన మొదటి పెట్టుబడి పెట్టారు ఉపేంద్రనాథ్. ప్రింటర్ సర్క్యూట్ బోర్డులు తయారు చేసే ఆ సింగపూర్ సంస్థ గురించి ఓ స్నేహితుడు ఆయనకు చెప్పారు. ఆ సంస్థను అమ్మేయాలని దాని యజమానులు భావిస్తుండటంతో స్నేహితుడు సూచించారు దాన్ని కొనాలని. ఆ కంపెనీ గురించి పూర్తిగా తెలుసుకునేందుకు మూడుసార్లు ఆ దేశం వెళ్లొచ్చారు ఉపేంద్రనాథ్. ఆ కంపెనీని కొనుగోలు చేసి, చక్కగా నిర్వహిస్తే లబ్ధి పొందవచ్చని భావించారు. నలుగురు స్నేహితులతో కలిసి ఆ కంపెనీని తన అధీనంలోకి తీసుకున్నారు. ఇతర భాగస్వాములతో పోల్చితే అందులో ఉపేంద్రనాథ్ వాటా చాలా పెద్దది.

ఈ కొనుగోలు తర్వాత ముంబయికి చెందిన వ్యాపారవేత్త భగవాన్‌దాస్ దోషి, ఆ కంపెనీకి చెందిన పరికరాలన్నీ ముంబయి తీసుకొన్ని అక్కడ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభిస్తే బాగుంటుందని సూచించారు. సింగపూర్ మార్కెట్‌లో పోటీ తీవ్రంగా ఉండటం, పోటీ

కంపెనీలు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తుండటంతో తన కంపెనీ మనుగడ గురించి ఉపేంద్రనాథ్ సందేహంలో పడ్డారు. ఈ కారణంగా ఆయన దోషి సలహా పాటించి కంపెనీ పరికరాలన్నీ ముంబయికి తరలించి అక్కడ కొత్త ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించారు. ఫైన్-లైన్ పేరుతో కార్యకలాపాలు ప్రారంభించిన ఆ కంపెనీ ఇప్పటికీ కూడా మంచి లాభాలతో సాగుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త గల్లా రామచంద్రనాయుడు సంస్థలోనూ ఉపేంద్రనాథ్ పెట్టుబడులు పెట్టారు. భారతదేశంలో ఇంజినీరింగ్ చదివిన రామచంద్రనాయుడు ఉన్నత చదువుల కోసం అమెరికా వచ్చారు. అమెరికాలోనే కొన్నాళ్లు ఉద్యోగం చేశారు. అక్కడ కొన్నేళ్లు పనిచేసిన తర్వాత సొంత రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమ పెట్టాలని నిర్ణయించి అమర్ రాజా ఎలక్ట్రానిక్స్ కంపెనీని స్థాపించారు. ఈ కంపెనీలో ఉపేంద్రనాథ్, మరి కొందరు సహచరులు కూడా పెట్టుబడులు పెట్టారు. ఇంకా చెప్పాలంటే కంపెనీ వ్యవస్థాపకుల్లో ఉపేంద్రనాథ్ కూడా ఒకరు. చిత్తూరు జిల్లా రేణిగుంటలో నెలకొల్పిన ఆ ఫ్యాక్టరీలో యూపీఎస్‌లు తయారవుతాయి. అనతికాలంలోనే ఆ సంస్థ వటుడింతై అన్నట్టుగా నాలుగింతలైంది. ఆ తర్వాత బ్యాటరీల ఉత్పత్తిని కూడా సంస్థ ప్రారంభించింది. ఆ తర్వాత ల్యాంకో ఇండస్ట్రీలోనూ పెట్టుబడి పెట్టారు ఉపేంద్రనాథ్. ఆ కంపెనీలో భారీ పెట్టుబడులు పెట్టిన వారిలో ఆయన ప్రముఖుడు. నిర్మాణం, స్థిరాస్తి వ్యాపారంతో అడుగుపెట్టిన ల్యాంకో ఆ తర్వాత బాగా విస్తరించింది. ల్యాంకోలో పెట్టిన పెట్టుబడుల వలన ఉపేంద్రనాథ్ మంచి లబ్ధి పొందారు.

ఫైన్ లైన్, అమర్ రాజా, ల్యాంకో సహ మొత్తం 12 సంస్థల్లో ఉపేంద్రనాథ్ పెట్టుబడులు పెట్టారు. అందులో ఈ మూడు మాత్రమే నిలదొక్కుకోగలిగాయి. మిగిలిన తొమ్మిది కాలపరీక్షకు తట్టుకోలేకపోయాయి. ఫార్మా, రియల్ ఎస్టేట్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టినా వాటి నుంచి ఆశించిన ఫలితాలు రాబట్టలేకపోయారు. అయితే, ఆ తొమ్మిది సంస్థల వలన కలిగిన నష్టం చాలా తక్కువ. మూడు ప్రముఖ కంపెనీల్లో పెట్టుబడుల వలన వచ్చిన లాభాలు భారీగా ఉండడంతో నష్టాలు ఉపేంద్రనాథ్‌పై అంతగా ప్రభావం చూపలేకపోయాయి.

# 19. పాఠాలు:

# వ్యాపారంలో ఒడిదొడుకుల ద్వారా గుణపాఠాలు

వ్యాపారవేత్తగా మారిన తర్వాత ఎన్నో పాఠాలు నేర్చుకున్నారు ఉపేంద్రనాథ్. అన్ని రకాల మనుషులు ఈ లోకంలో ఉంటారనే నీతి ఆయనకు బోధపడింది. డబ్బు సంపాదించేందుకు అబద్ధమాడేవారు కొందరైతే, మోసగాళ్లు, వెన్నుపోటుదార్లు మరికొందరు ఉంటారనే విషయం అర్థం చేసుకున్నారు. పెట్టుబడులకు సంబంధించి అందరు చెప్పే విషయాలను గుడ్డిగా అనుసరించరాదని తెలుసుకున్నారు.

చాలా మంది పెట్టుబడుల కోసమే ప్రాజెక్టులు ప్రతిపాదిస్తుంటారు. కాగితాలపై వాటి గొప్పదనం, సమర్థత, అందించే లాభాలు చూస్తే పెట్టుబడికి అవి మంచి అవకాశాలుగా కనిపిస్తాయి. కానీ, డబ్బు అందుకున్న తర్వాత వారు మాయమవడం లేదా ఏదో సాకు చెప్పడం పరిపాటి అనే విషయం కూడా ఉపేంద్రనాథ్ గుర్తించారు. పెట్టుబడికి గొప్ప అవకాశమంటూ వచ్చిన అనేక మందిని ఆయన చూశారు. మరో వైపు భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టేందుకు ఉపేంద్రనాథ్ ఆసక్తిగా ఉన్నారనే మాట ఆ నోటా, ఈ నోటా అంతటా వ్యాపించింది. దాని వలన అనేక రకాల వ్యాపారులు వచ్చి ఆయనను కలిశారు. ప్రారంభంలోనే అనేక మంది మోసగాళ్లను చూసిన ఉపేంద్రనాథ్, ఇప్పుడు అప్రమత్తంగా ఉండటం మొదలుపెట్టారు. తనను కలిసేందుకు వచ్చే వారి నేపథ్యం గురించి క్షుణ్ణంగా విచారణ జరిపేవారు. ఆ తర్వాత ఆ ప్రాజెక్టుకు సంబంధించి లోతుగా అధ్యయనం చేసి నిపుణులను సంప్రదించడం జరిగేది. వారు ఆ ప్రాజెక్టు ద్వారా వచ్చే లాభాలు అంచనా వేయడమే కాదు దానితో ముడిపడి ఉన్న ముప్పులను విశ్లేషించేవారు. అవన్నీ సవ్యంగా ఉన్నాయని భావించిన తర్వాతే ఉపేంద్రనాథ్ ముందడుగు వేసేవారు.

మొత్తం పరిస్థితిని నియంత్రణలో ఉంచుకోవడం అసాధ్యమనే విషయమూ ఆయన తెలుసుకున్నారు. ఉదాహరణ, ఒక ప్రాజెక్టును ప్రతిపాదిస్తున్న వ్యక్తి నిజాయితీపరుడై, వారి ప్రాజెక్టు కూడా నమ్మదగినదిగా ఉండి, అందులో పెట్టబడి పెట్టిన తర్వాత అందులో ప్రమాదాలు చోటుచేసుకొని, నష్టాలకు దారితీయవచ్చునే వాస్తవాన్ని గ్రహించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిమాణాలు కూడా ప్రణాళికలు, ప్రాజెక్టులపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. రిస్కులు తీసుకోకుండా వ్యాపారవేత్తగా లేదా ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా రాణించలేరనే విషయాన్ని తెలుసుకునేందుకు ఉపేంద్రనాథ్‌కు ఎక్కువ సమయం పట్టలేదు. కేవలం పెట్టుబడి పెడితే సరిపోదు, భవిష్యత్‌ను అంచనా వేయగలగాలి. చోటుచేసుకునే పరిణామాలను ముందుగానే పక్కాగా అంచనా వేయగలిగితే ప్రతికూల సంఘటనలు చోటుచేసుకున్నా నిరాశ కలిగించవు. విజయవంతమైన పెట్టుబడి అంటే పరిశ్రమ గురించి పరిశోధన చేయడం, నష్టాలను ఊహించడం, భవిష్యత్ కోసం పక్కా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడమే అనే గొప్ప పాఠాన్ని ఉపేంద్రనాథ్ నేర్చుకున్నారు.

భారీ స్థాయి పరిశ్రమల్లో పెట్టుబడి పెట్టాలని భావించడం వెనుక భారీగా లాభాలు అర్జించవచ్చునే ఆలోచన ఏనాడూ ఉపేంద్రనాథ్‌కు లేదు. ప్రధాని నరసింహారావు, ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ విధానాలకు ప్రభావితమైన ఆయన దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు తన వంతు సహకారం అందించాలని భావించారు. అప్పుడు, ఇప్పుడు ఎప్పుడూ కూడా ఆయన తపనంతా ఒక్కటే మాతృభూమి కోసం ఏమైనా చేయాలని. శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనే కాదు వైద్య సేవలు, ఇతర రంగాల్లో ప్రథమ శ్రేణి దేశాలతో పోల్చితే భారత్ ఎంతో వెనుకబడి ఉందనే విషయం ఆయనకు తెలుసు. ప్రపంచస్థాయి శాస్త్రవేత్తలు, మేధావులు, ఆర్కిటెక్టులు, ఇంజినీర్లు భారతదేశంలో ఉన్నారు. ప్రతీ రంగంలోనూ భారతదేశాన్ని ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచన వారిది. కానీ, ఆ ప్రణాళికలను ఆచరణ రూపంలోకి మార్చేందుకు తగిన వనరుల లేమి. వనరుల సమీకరణకు నిధుల కొరత. ఈ కారణంగానే భారత్‌లో అభివృద్ధిని పరుగులుపెట్టించగలిగే ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని ఉపేంద్రనాథ్ భావించారు. మాతృభూమి అంటే ఆయనకు ఎనలేని మమకారం. ఆయన పెట్టుబడిన పెట్టిన పన్నెండు ప్రాజెక్టుల్లో పది సొంత రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఉండటమో లేదా ముడిపడి ఉన్నావో అయి ఉండటం విశేషం.

వైద్యరంగానికి భారీస్థాయిలో చేయూత అందించాలనే ఆలోచన ఆయనలో ఉండేది. వైద్యరంగం ఆయనకు ఎంతో ప్రియమైనది కావడం దానికి కారణం. 58 ఏళ్లకు రిటైరవ్వాలని ఎప్పుడైతే నిర్ణయించుకున్నారో భారతదేశంలో వైద్యసదుపాయులు మెరుగపరిచేందుకు కృషి చేయాలని ఆ నాడే సంకల్పించారు. ఆయన రిటైర్మెంట్ ఆలోచన విని అమెరికాలోని ఆయన తోటి వైద్యులు, స్నేహితులు ఆశ్చర్యపోయారు. ఉపేంద్రనాథ్

చాలా బిజీ డాక్టరు. ఆయన సామర్థ్యం ఖండాంతరాల్లోనూ ప్రశంసలు అందుకుంది. అదే సమయంలో ఏదైనా అనుకుంటే ఆ విషయంలో పట్టుదలగా ఉంటారనే విషయమూ చాలా మందికి తెలుసు. ఎంతో ఆలోచన చేసి అన్ని విషయాలను ఆచితూచి నిర్ణయం తీసుకుంటారు, ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే వెనక్కి వెళ్ళరు. ఆయన గురించి పెద్దగా తెలియని వారు డాక్టరుగా రిటైర్ అవ్వాలన్న ఆయన నిర్ణయం చూసి నవ్వుకున్నారు. వారి మాటలు విని నవ్వుకునే ఉపేంద్రనాథ్, "నా జీవితం ముగిసే లోపు నేను జీవితం నుంచి మరింత పొందాలి. కేవలం ఒక పని మాత్రమే చేయాలని (ఆ పని చేయడంలో నా సామర్థ్యం ఎలా ఉన్నప్పటికీ) నేను కోరుకోవడం లేదు" అంటారు.

# 20: తీరని శోకం:

# ప్రియమైన పుత్రుడిని కోల్పోవడం

జీవితంలో కోరుకున్నవన్నీ అనుకున్నట్టుగానే సాగిపోతున్నాయని ఉపేంద్రనాథ్ సంతోషిస్తున్న సమయం అది. డాక్టరుగా, పారిశ్రామికవేత్తగా, కుటుంబ పెద్దగా బాధ్యతలన్నీ సక్రమంగా నిర్వర్తిస్తున్నానని ఉపేంద్రనాథ్ సంతృప్తిగా ఉంటున్న సమయం అది. కానీ జీవితంలో అనుకున్నవన్నీ అనుకున్నట్టుగా సాగవు కదా. సంతోషాలు వేగంగా విషాదాలుగా మారిపోతాయి, ఆశ స్థానంలోకి నిరాశ చొరబడుతుంది. భవిష్యత్‌లో జీవితం ఎలా ఉంటుందో తెలియని అనిశ్చితి. జీవితం, జీవించే తీరు గురించి అనేక మంది విజ్ఞులు తమదైన రీతిలో భాష్యం చెప్పారు. కానీ ప్రతీ ఒక్కరు పుట్టుక నుంచి మరణం వరకు రకరకాల అనుభవాలు చవిచూస్తారు. కొందరి జీవితాలు చూస్తుంటే ఒక్కలాగే ఉన్నట్టు కనిపిస్తుంది. కానీ, ఏ రెండు జీవితాలు ఒక్కలాగా ఉండవన్నది వాస్తవం. గొప్పగానో లేదా మామూలుగానో ఉండవచ్చు, కానీ ప్రతీ ఒక్కరికీ ఒక్క కథ ఉంటుంది. ఒకరు సంతోషంగా గడుపుతుంటే అదే సమయంలో మరొకరు అంతులేని వేదనలో ఉండవచ్చు. జనన, మరణ చక్రంలో సంతోషం–విషాదం, ఆశ–నిరాశ, బాధ–ఆనందమన్నవి భాగాలే.

ఉద్యోగరీత్యా క్షణం తీరికలేకుండా గడిపే ఉపేంద్రనాథ్, ఉషారాణికి పిల్లలతో కలిపి ఆనందం గడిపే అవకాశాల అంతగా దొరికేకావు. పిల్లలిద్దరూ మాధవి, శ్రీధర్ ప్రముఖ పాఠశాలల్లో చదివే వారు. అమెరికా సంస్కృతి ప్రభావం తీవ్రంగా ఉండేది. తల్లిదండ్రుల నుంచి ఎటువంటి ఆంక్షలు ఉండకపోవడంతో స్వతంత్రంగా జీవించేందుకు ఇద్దరు బాగా అలవాటుపడ్డారు. వారి నాన్నమ్మ పుష్పవతి, తన పిల్లలు తన భర్తలాగే గొప్ప వైద్యులు కావాలని ఆకాంక్షించారు. ఉపేంద్రనాథ్, ప్రఫుల్ల విషయంలో ఆమె విజయం సాధించారు. పెద్ద కూతురు అరుంధతి వేరే మార్గాన్ని ఎంచుకుంది. అదృష్టవశాత్తు, ఉపేంద్రనాథ్

తమ్ముడు లోకేశ్ కూడా వైద్యరంగంలోకి అడుగుపెట్టారు. పిల్లలు ఇలా డాక్టర్లు కావడం వెనుక తల్లి దృఢ సంకల్పం ఉంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు రాకపోయినా ఉపేంద్రనాథ్‌ను ఆమె ప్రైవేట్ కాలేజీలో చేర్పించారు. ఎంబిబిఎస్ చదివేందుకు కూతురు ప్రఫుల్లను కోల్‌కతా పంపించారు. చిన్న కుమారుడు కూడా ప్రైవేట్ మెడికల్ కాలేజీలోనే చదువుకున్నాడు.

తనలాగే తన పిల్లలను కూడా డాక్టర్లను చేసి వారసత్వాన్ని ఉపేంద్రనాథ్ నిలబెడతారని అంతా ఆశించారు. కానీ, పిల్లలిద్దరూ అమెరికా వాతావరణంలో పెరగడంతో వారి నిర్ణయాలు వారు తీసుకునే స్వేచ్ఛ వారికుండేది. సొంతంగా ఏదైనా పరిశ్రమ స్థాపించాలనే ఆలోచన కలిగిన మాధవి ఏనాడు చదువులపై పెద్దగా శ్రద్ధ చూపలేదు. ఆమె కోరికను తల్లిదండ్రులు అంగీకరించారు, వైద్య వృత్తి వైపు రావాలని ఎప్పుడూ ఒత్తిడి చేయలేదు. శ్రీధర్, ఆలోచనలు, లక్ష్యాలు చాలా భిన్నంగా ఉండేవి. వాటిని మార్చుకోవాలని తల్లిదండ్రులిద్దరూ ఏనాడు బలవంత పెట్టలేదు.

అమ్మానాన్న ఎక్కువ సేపు ఆస్పత్రిలోనే గడుపుతుండటంతో పిల్లల్లిద్దరు ఎక్కువ సమయం నాన్నమ్మతోనే గడిపేవారు. మనవడు అంటే పుష్పవతికి చాలా ప్రేమ. బహుశా దాని వల్లేనేమో లేక ఇంకేమైనా కారణాలు ఉన్నాయో తెలియదు కానీ అతను ఆధ్యాత్మికం వైపు మళ్లాడు. కౌమారప్రాయంలోనే అతడు ఆధ్యాత్మికత గురించి ఎందుకు మాట్లాడుతున్నాడో ఎవరికీ తెలిసేది కాదు. పుట్టపర్తి సత్యసాయి మాటలకు ఆకర్షితుడైన అతను ఆయనను తన ఆధ్యాత్మిక గురువుగా భావించేవాడు. సత్యసాయి మిషన్‌లో చేరిన ఆ కుర్రాడు, బాబా అనుచరులతో కలిసి వారు చేపట్టే ఆధ్యాత్మిక, సామాజిక, భగవత్ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు.

పుట్టపర్తి సత్యసాయి బాబా వారి ఖ్యాతి ఖండాంతరాల్లో వ్యాపించిన రోజులవి. ఆయన మహిమలను ప్రపంచంలోని అనేక మంది చర్చించుకునేవారు. సత్యసాయి బాబా ఆంధ్రప్రదేశ్‌లోని ఓ సాధారణ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి పేరు పెద్ద వెంకన్న రాజు రత్నాకరం. తల్లి పేరు మీసరగండ ఈశ్వరమ్మ. వారు భట్రాజు కులస్తులు. రాజులు, చక్రవర్తుల ఆస్థానంలో కవులు, సంగీతకారులుగా ఉంటూ పాలకులను పొగడటం ఆ కులస్తుల వృత్తి.

నవంబర్ 23, 1926న ఈశ్వరమ్మ, రత్నాకరం దంపతులకు కుమారుడు పుట్టారు. సత్యనారాయణ రాజు అని బాలుడుకి పేరు పెట్టారు. చిన్ననాటి నుంచే ఆ అబ్బాయికి సంగీత, సాహిత్యాలంటే ఆసక్తి. తన పూర్వీకుల అడుగుజాడలు అనుసరిస్తున్నట్టు కనిపించేవాడు. పెరిగి పెద్దయ్యాక తమ కుమారుని తీరు ఎలా ఉంటుందోననే అనుమానం

ఏనాడు ఆ దంపతులకు కలుగలేదు. హఠాత్తుగా తన పద్నాలగవ ఏటా ఆ బాలుడు తాను షిర్డి సాయిబాబా అవతారమని ఎంతో దృఢంగా ప్రకటించాడు. ఇక నుంచి తనను సత్యసాయిబాబా అని పిలవాలని తన చుట్టుపక్కల వారందరికీ చెప్పాడు. సన్యాసులు ధరించే కాషాయ వస్త్రాలు ధరించి మహిమలు చూపడం ప్రారంభించాడు. సమస్యలతో తన దగ్గరకు వచ్చిన వారికి పరిష్కార మార్గాలు చూపేవాడు. బాబా ఇచ్చే ప్రసాదం ఆరగించడం ద్వారా తమ సమస్యలన్నీ తీరిపోయాయని నమ్మేవారి సంఖ్య పెరిగిపోయింది. గాల్లోంచి పూవులు, ఫలాలు సృష్టించి ఆయన భక్తులకు అందించేవారు. తన మాయలతో అప్పుడప్పుడు విభూతిని గాల్లోంచి సృష్టించేవారు. ఆయన శక్తులు లేదా అసాధారణ ప్రతిభ చూసి చాలా మంది ఆకర్షితులయ్యారు. ఆ మాటలు ఆ నోటా, ఈ నోటా సర్వత్రా వ్యాపించాయి. సమస్యల పరిష్కారం కోసం జనాలు పుట్టపర్తి రావడం మొదలైంది. రోజు రోజుకూ భక్తుల రాక పెరిగిపోసాగింది.

1944లో కొంత మంది పుట్టపర్తిలో ఆయనకు ఆలయం కట్టారు. దానికి ప్రశాంతి నిలయం అని బాబా స్వయంగా పేరు పెట్టి అందులోనే నివసించసాగారు. పెద్ద సంఖ్యలో భక్తులు ప్రతీ రోజు ఆయన దర్శనం కోసం రావడం మొదలైంది. బాబా చేసిన సాయానికి చాలా మంది భక్తులు మనస్ఫూర్తిగా కానుకలు, విరాళాలు సమర్పించుకునేవారు. భక్తుల సంఖ్య పెరిగినట్టుగానే ప్రశాంతి నిలయం వైభవం పెరగసాగింది. హైదరాబాద్, బెంగళూరు, ముంబయి వంటి నగరాల్లోని భక్తులు బాబాకు మందిరాలు నిర్మించారు. భక్తులు ఇచ్చే విరాళాలను పేదల సంక్షేమానికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు బాబా వెచ్చించేవారు. కరువుబారిన పడిన అనేక గ్రామాలకు నీరందించే బృహత్ కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఆయన పర్యవేక్షణలో పేదల కోసం పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు రూపొందాయి. ఆ సంస్థలు ఒక్క రూపాయి కూడా వసూలు చేయవు. గొప్ప పరోపకారిగా సత్యసాయిబాబా పేరు మార్మోగిపోయింది. విదేశాల్లో ఉండే అనేక మంది కూడా ఆయనకు భక్తులయ్యారు.

బాబా అనేక పాటలు, కీర్తనలు, భజనలు రచించి ఆలపించారు. ఆ పాటలు ప్రజల్లో బాగా ప్రాచుర్యం కూడా పొందాయి. ఆయన ప్రవచనాలు చాలా మందిని ఆకట్టుకున్నాయి. తన మాటల్లో ప్రేమ గురించి ఆయన నొక్కి చెప్పేవారు. ప్రేమ లేకపోతే జీవితానికి అర్థం లేదనేవారు. రోజును ప్రేమతో ప్రారంభించండి, ప్రేమతో రోజును గడపండి, రోజంతా ప్రేమతో నిండి ఉండండి, ప్రేమతోనే రోజును ముగించండి, ఇలా చేయగలిగితే దేవుడికి సన్నిహితమవుతారని భక్తులకు ఉద్బోధిస్తుండేవారు. నాపై నమ్మకం ఉంచితే నా దీవెనలు, కరుణతో మీరు లబ్ధి పొందుతారని హితవు పలికేవారు. నమ్మకం లేకపోతే దేవుడు కూడా మీ ప్రార్థనలకు సమాధానం చెప్పడు అని ప్రవచించేవారు. ఆపదలో ఉన్నవారికి సాయపడండి, దాన్ని భగవత్ కార్యంగా భావించండని ఆయన తన అనుచరులకు పదేపదే చెప్తుండేవారు.

సత్యం, మతం, శాంతి, ప్రేమ, అహింస అనేవి జీవితంలో అత్యంత విలువైనవి, ప్రతీ వ్యక్తి ఆ లక్షణాలను కలిగి ఉంటే జీవితంలో రాణిస్తారని సూచించేవారు.

పనిలో తీరిక లేకుండా ఉండేవారు ఉపేంద్రనాథ్. తన కుమారుడిపై సత్యసాయి ప్రభావం తీవ్రంగా ఉందనే విషయాన్ని ఆయన గుర్తించలేకపోయారు. బాబా చేపట్టే సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో శ్రీధర్ చురుగ్గా పాల్గొనడం గమనించిన తర్వాతే ఆయనకు తెలిసింది కుమారుడు ఊహించని మరో మార్గాన్ని ఎంచుకున్నాడని. కాలిఫోర్నియాలో సత్యసాయిబాబా భక్తులు నిర్మించిన ఆశ్రమం శ్రీధర్ నివాసం అయింది. నెలకోసారో, రెండుసార్లు కుటుంబ సభ్యులను కలిసేందుకు వచ్చేవాడు. అతని తీరుకు కుటుంబంలో ఎవరూ కూడా అభ్యంతరం చెప్పలేదు. శ్రీధర్ సంతోషంగా ఉండాలనే అంతా కోరుకున్నారు. ఉపేంద్రనాథ్, ఉషారాణి ఎంతో కష్టపడి చాలా డబ్బు సంపాదించారు. తన కష్టంతో అందిన ఫలాలు సంతానం పొందాలని ఆకాంక్షించారు.

అంతా సవ్యంగా సాగిపోతూ కుటుంబంలో ఎవరి జీవితాల్లో వారు మునిగిపోయిన సమయంలో హఠాత్తుగా ఒక దుర్వార్త అందింది. అది విని ఉపేంద్రనాథ్, ఆయన కుటుంబం థ్రాన్పడిపోయింది. ఆ మాటలు విని ఉపేంద్రనాథ్ తన చెవులను తానే నమ్మలేకపోయారు. ఉషారాణి, పుష్పవతి మెదడు మొద్దుబారిపోయింది. ఎంతో ప్రియమైన కుమారుడు కాలిఫోర్నియాలో ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబమంతా విషాదసాగరంలో మునిగిపోయింది. చదువుసంధ్యలో తెలివైన వాడు శ్రీధర్. ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నాడో ఎవరు ఊహించలేకపోయారు.

వారి జీవితంలో అతి అత్యంత బాధకరమైన సమయం. కుమారుడిపై ఉపేంద్రనాథ్, ఉషారాణి పెట్టుకున్న ఆశలు చెదిరిపోయాయి. ఏ మార్గాన్ని ఎంచుకున్నా అందులో శ్రీధర్ రాణించాలని తల్లిదండ్రులు కోరుకున్నారు. ఆ షాక్ నుంచి కోలుకునేందుకు వారికి చాలా సమయం పట్టింది. కుమారుడు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో ఉపేంద్రనాథ్‌కు అర్థం కాలేదు. నిరాశ, బాధలో ఉన్నట్టుగా ఏనాడు శ్రీధర్ కనిపించలేదు. అప్పుడప్పుడు శ్రీధర్‌తో మాట్లాడే నాన్నమ్మ కూడా ఆ విషయాన్ని గుర్తించలేకపోయింది. ఆత్మహత్యకు కారణాలు తెలుసుకునే ప్రయత్నాలు ఉపేంద్రనాథ్ చేయలేదు. చేతికి అందివచ్చిన కుమారుడు దూరమయ్యాడని బాధపడ్డారు.

పుష్పవతి, ఉష. మాధవి ఆ విషాదం నుంచి నిదానంగా కోలుకున్నారు. కానీ, ఉపేంద్రనాథ్ మనస్సుపై అది మానని గాయంగానే మిగిలిపోయింది. పిల్లలకు తాను ఏ మాత్రం సమయం కేటాయించలేకపోయానని కుమిలిపోయారు. వాళ్లతో కలిసి మెలిసి ఉంటే ఈ ఉపద్రవాన్ని నివారించి ఉండేవాడినేమోనని తల్లడిల్లారు. పెద్దయ్యాక

ఏమవుతావని తాము అడిగిన ప్రశ్నకు శ్రీధర్ చెప్పిన జవాబు గుర్తు తెచ్చుకొని మరింత బాధపడసాగారు. “నీవు పెద్దయ్యాక మా మాదిరిగా డాక్టరు అవుతావా? నాన్న, మీరిద్దరూ డాక్టర్లు, మీరు ఎంత తీరికలేకుండా ఉంటారో నాకు తెలుసు. పిల్లలతో మాట్లాడేందుకు కూడా మీ సమయం దొరకదు. మీలాగా నేను ఉండదలుచుకోలేదు, నాకు, నా కుటుంబం కోసం నాకు సమయం కావాలి” అన్న శ్రీధర్ మాటలు మనస్సును ముల్లులా గుచ్చుకునేవి.

తన కుమారుడి విషయంలో జరిగిన పొరపాటు ఉపేంద్రనాథ్ మనస్సును ఎంతో కలిచివేసింది. ఆ నష్టం పూడ్చలేనిది అని గుర్తించిన ఆయన ఏది ఏమైనా, ఎన్ని అడ్డంకులు ఎదురైనా కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలని గట్టిగా నిర్ణయించుకున్నారు. కొన్నిసార్లు విచారం, సంతోషం అద్భుతమైన ఔషధాలుగా పనిచేస్తాయి.

# 21. సాఫల్యం:
# ఎట్టకేలకు సాకారమైన కల

భారతదేశపు వైద్యరంగానికి ఎంతో చేయూత అందించే అవకాశం 2001లో ఉపేంద్రనాథ్‌కు లభించింది. అనుభవజ్ఞుడైన డాక్టరుగా తన మాతృభూమికి సేవ చేసేందుకు పూర్తిస్థాయి శక్తియుక్తులతో సిద్ధమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేట్ మెడికల్ కాలేజీ ఏర్పాటు ప్రతిపాదనతో ప్రముఖ వైద్యుడు, ఔత్సాహిక పారిశ్రామికవేత్త చింతమనేని సురేశ్ అమెరికాలో ఉపేంద్రనాథ్‌ను కలిశారు. సంస్థను నెలకొల్పేందుకు ఆయన పెట్టుబడిదారులను అన్వేషిస్తున్నారు. ఆ ప్రతిపాదన ఉపేంద్రనాథ్‌కు బాగా నచ్చింది, ఆ ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టడమే కాదు కాలేజీ కోసం తన సమయాన్ని కేటాయించేందుకు ముందుకు వచ్చారు.

కాలేజీ నిర్మాణం చేయదలిచిన ప్రదేశం విషయంలో ఉపేంద్రనాథ్‌కు గట్టి అభిప్రాయం ఉంది. కాలేజీ కోసం విజయవాడ, గుంటూరు నగరాల మధ్యలో ఉన్న మంగళగిరిలో స్థలాన్ని సురేశ్ కొన్నారు. ఉపేంద్రనాథ్ పూర్వీకుల గ్రామానికి మంగళగిరి చాలా దగ్గర. ఆ ప్రాంతంలో ఒక మెడికల్ కాలేజీ, ఒక పెద్ద ఆస్పత్రి ఏర్పాటు చేయాల్సిన అవసరం చాలా ఉంది. సంస్థను నెలకొల్పడంలో కీలక భూమిక పోషించడం ద్వారా తను పుట్టి, పెరిగిన ప్రాంతానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వవచ్చని ఉపేంద్రనాథ్ భావించారు.

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సౌమ్య ఆస్పత్రికి ఇన్‌ఛార్జ్ సురేశ్. ఆ ప్రాంతంలో ఆ ఆస్పత్రికి ఎంతో మంచి పేరుంది. అనుభవజ్ఞుడైన సురేశ్‌కు ఆ ప్రాంతంలోని ప్రజల అవసరాలు స్పష్టంగా తెలుసు. ప్రతిపాదన కాలేజీ కోసం భూమి కొనుగోలు చేసి లైసెన్స్ కోసం దరఖాస్తు చేశారు కూడా. ఆ తర్వాత పెట్టుబడిదారులను అన్వేషిస్తూ ఆయన సుదూరంలోని అమెరికాకు వచ్చారు. సురేశ్‌తో మొదటి సమావేశంలోనే ఉపేంద్రనాథ్, మరో ముగ్గురు ఇతర వైద్యులు ఆ ప్రాజెక్టులు భాగమయ్యేందుకు సమ్మతించారు. ఎన్ఆర్ఐల

సహకారంతో నిర్మిస్తున్న సంస్థ కాబట్టి దానికి ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ అని పేరుపెట్టాలని నిర్ణయించారు. అంతే కాదు ఎన్ఆర్ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌తో సంస్థను ఏర్పాటు చేసి దాని కిందే మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులు నిర్వహించాలని ఉమ్మడిగా నిర్ణయించారు. తదనంతరం ఏర్పాటు చేసిన సంస్థకు ఉపేంద్రనాథ్ డైరెక్టరయ్యారు.

భారతదేశంలో విద్యా, వైద్య రంగంలో భారీమార్పులు చోటుచేసుకుంటున్న సమయం అది. ఆంధ్రప్రదేశ్ (భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ) ఉన్నత విద్య, ఆధునిక పరికరాలతో భారీ సంస్థలు ఏర్పాటవుతున్నాయి. ప్రైవేట్ రంగంలో ఇంజినీరింగ్, వైద్య కళాశాలు ఏర్పడుతున్నాయి.

కొంత మంది ఎన్ఆర్ఐ వైద్యుల నుంచి చేయూత లభించడంతో మెడికల్ కాలేజీ ఏర్పాటు ప్రక్రియను చింతమనేని సురేశ్ వేగవంతం చేశారు. ఈ ప్రక్రియలో జరుగుతున్న క్రమంలో ఉపేంద్రనాథ్, ఆయన స్నేహితుడు డాక్టర్ అక్కినేని సుదర్శన్ రావు అనేకసార్లు ఇండియాకు వచ్చారు. జరుగుతున్న పనులను వారు నిరంతరం సమీక్షిస్తుండే వారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉండే ఆస్పత్రి నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎసెన్షియల్ సర్టిఫికేట్ పొందలేకపోయారు. కావాల్సిన ధ్రువీకరణను పొందేందుకు మంగళగిరిలో ఒక భారీ నిర్మాణాన్ని చేపట్టారు. ఆ తర్వాత పెట్టుబడిదారులంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిశారు. వీలైనంత తొందరగా సర్టిఫికేట్ జారీ చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తిని మన్నించిన సీఎం, ఆ ప్రాజెక్టును అధ్యయనం చేసేందుకు ఓ కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ సభ్యులు భవనాన్ని తనిఖీ చేసి అన్ని అంశాలను అధ్యయనం చేసి సర్టిఫికేట్‌కు మార్గం సుగమం చేశారు.

కాలేజీ ఏర్పాటులో అదే చివరి అడ్డంకి కాదు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావడంలో జాప్యం చోటుచేసుకుంది. అప్పట్లో ప్రధానిగా అటల్ బిహారీ వాజ్‌పేయి, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిగా సుష్మా స్వరాజ్ ఉన్నారు. సుష్మా స్వరాజ్ ఒక్క సంతకంతో సంస్థ ఏర్పాటుకు మార్గం ఏర్పడేది, కానీ ఆమె ఎందుకు సంతకం పెట్టడం లేదో ఎవరికీ తెలియదు. ఉపేంద్రనాథ్, మరికొందరు సహచరులు ఢిల్లీ వెళ్లి ఆమెను కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రాజెక్టు ప్రణాళికలు, ఉద్దేశ్యాలు ఆమెకు వివరించారు. వారి ఉదాత్త ఆశయాలను గుర్తించిన సుష్మా స్వరాజ్ వెంటనే ఫైల్‌పై సంతకం చేశారు. ఉపేంద్రనాథ్, ఆయన సహచరులు విజయంతో మంగళగిరికి తిరిగి వచ్చారు.

సెప్టెంబర్ 2003లో ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ కొలువుదీరింది. వంద మంది విద్యార్థులతో మొదటి బ్యాచ్ ఎంబిబిఎస్ ప్రారంభమైంది. కాలేజీ ప్రారంభమైన తొలి రోజు ఉపేంద్రనాథ్ సంతోషానికి హద్దుల్లేకుండా పోయాయి. ఆయన జీవితంలోని అత్యంత సంతోషకరమైన రోజుల్లో అది ఒకటి.

# 22. మునుముందుకు, పైపైకి:
# భారత్‌లో లాభదాయకంగా మారిన అమెరికా అనుభవం

మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసిన తర్వాత భారత్‌లో ఎక్కువ సమయం గడపడం మొదలుపెట్టారు ఉపేంద్రనాథ్. కళాశాలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన ఆస్పత్రిలోనే ఆయన సమయంతా గడిచిపోయేది. ప్రారంభంలో కొందరు రోగులను స్వయంగా ఆయనే చూసేవారు. చాలా మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. కానీ, తర్వాత కొంత కాలానికి సంస్థ మేనేజ్‌మెంట్‌కు కూడా తన అవసరం ఉందని గుర్తించి శస్త్రచికిత్స చేయడం మానుకున్నారు.

ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో చదివే విద్యార్థుల కోసం అత్యుత్తమ డాక్టర్లు, బోధనా సిబ్బంది ఉండేలా చూసుకున్నారు. అత్యంత అర్హులు, ఎంతో అనుభవం కలిగిన ప్రొఫెసర్లకు మాత్రమే అందులో చోటు దక్కుతుంది. దేశంలో అందుబాటులో ఉన్న అత్యంత ఆధునిక సదుపాయాలు విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి. ఆధునిక పరికరాలే కాదు అత్యుత్తమ ప్రయోగశాలలకు నెలవు ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ. అనతి కాలంలోనే సూపర్ స్పెషలిటీ ఆస్పత్రిగా సంస్థ రూపాంతరం చెందింది. ఏ రకమైన పరీక్షకైనా, లేదా స్కానింగ్‌కు అయినా వేరే ఆస్పత్రులు, ఇతర క్లినిక్కులు సందర్శించాల్సిన అవసరం రోగులకు ఇక లేదు.

ప్రారంభించిన నాటి నుంచే ప్రజల మన్ననలు పొందింది ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ. మొదలైన మొదటి సంవత్సరంలో ఆ వైద్యకళాశాల ప్రైవేట్ రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో అగ్రస్థానంలో నిలుస్తుందనే ఖ్యాతిని అర్జించింది. రెండో సంవత్సరంలో 150 మంది విద్యార్థులను చేర్చుకునేందుకు అనుమతి లభించింది. సంస్థ పురోగతి ఉపేంద్రనాథ్ ఆనందాన్ని ద్విగుణీకృతం చేసింది. ఇతర ఏ ప్రాజెక్టులు, పెట్టుబడుల ద్వారా ఇంత సంతృప్తిని ఆయన పొందలేదు. దీని కోసం ఆయన కేవలం తన సమయం, పెట్టుబడి మాత్రమే వెచ్చించ లేదు, తన ఆశలు, మనోభీష్టాన్ని కూడా దానిపైనే నిలిపారు.

ఎన్ఆర్ఐ ఆస్పత్రి ద్వారా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కూడా లబ్ధి పొందారు. చికిత్స కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సిన బాధలు తప్పాయి. అనుభవజ్ఞులైన వైద్యులు, అత్యాధునిక సదుపాయాలతో కూడిన ఆస్పత్రి వారికి అందుబాటులోకి వచ్చింది. ఆ తర్వాత భారత్‌లో పనిచేస్తున్న సర్జన్లతో తన అనుభవాలు పంచుకోవడం మొదలుపెట్టారు ఉపేంద్రనాథ్. అమెరికాలో నిర్వహించే సురక్షితమైన, ప్రభావవంతమైన శస్త్ర చికిత్స విధానాలు వారికి నేర్పించారు. ప్రారంభంలో కొంత మంది వైద్యుల నుంచి ఆయనకు వ్యతిరేకత ఎదురైంది. కొత్త విధానాలు నేర్చుకునేందుకు చాలా మంది నిరాకరించారు. వాస్తవానికి వాళ్లందరికీ కొన్ని బలమైన నమ్మకాలు ఉన్నాయి. సర్జన్ ఎంత వేగంగా ఉంటే శస్త్రచికిత్స అంత ప్రభావవంతంగా ఉంటుందన్న నమ్మకం ఉపేంద్రనాథ్‌ను కలవరపరిచింది. భారత్‌లో చాలా మంది వైద్యులు అతి తక్కువ సమయంలోనే శస్త్ర చికిత్సలు పూర్తి చేస్తారు. ఈ తరహా విధానం అమెరికాలో కనిపించదు. అమెరికాలో మొత్తం ప్రక్రియ అంతా క్రమపద్ధతిలో జరుగుతుంది, అక్కడ వేగాన్ని నిరూపించుకోవాల్సిన అవసరం ఉండదు.

చాలా సందర్భాల్లో వేగం ముఖ్యం కాదనే విషయాన్ని నచ్చజెప్పేందుకు ఉపేంద్రనాథ్ తీవ్రంగా ప్రయత్నించారు. కానీ చాలా మంది డాక్టర్లలో ఉన్న అహంభావం వారిని విననీయలేదు. కానీ, కొంత మంది ఎంతో అనుభవజ్ఞుడైన సర్జన్ ఉపేంద్రనాథ్ చెప్తున్న మాటలను ఎంతో శ్రద్ధగా ఆలకించారు. భారతీయ మెడికల్ కాలేజీల్లో విద్యార్థులు తమ ఉపాధ్యాయులను అతి తక్కువ ప్రశ్నలు అడగటం ఉపేంద్రనాథ్‌కు ఆశ్చర్యం కలిగించింది. ప్రశ్నలు అడగటం అవిధేయతగా విద్యార్థులు పరిగణిస్తారు. అంతే కాదు ఉపాధ్యాయులను ప్రశ్నలు అడగాలంటే భయం. అమెరికాలో విద్యార్థులు తమ ఉపాధ్యాయులను అనేక ప్రశ్నలు అడిగి వివరణ తెలుసుకుంటారు. విషయాన్ని తెలుసుకునే ఉత్సుకత వారిలో ఎక్కువ.

సందేహాలు, వారి ఉత్సుకతను సంతృప్తిపరచాల్సిన బాధ్యత టీచర్లదేనని విద్యార్థులకు నచ్చజెప్పేందుకు ఉపేంద్రనాథ్ బాగా ప్రయత్నించారు. పాఠాలకు సంబంధించిన ప్రశ్నలు విద్యార్థులు స్వేచ్ఛగా తమ ఉపాధ్యాయులను అడగాలని సూచించేవారు. ప్రశ్న అడగటం అజ్ఞానాన్ని తెలియజేస్తుందని భావనను వీడాలని విద్యార్థులను సున్నితంగా మందలించేవారు. జీవితాంతం తెలివితక్కువగా ఉండటం కన్నా తెలియదు, అర్థం కాలేదని ఒప్పుకోవడం మంచిదన్నది విద్యార్థులకు ఆయనిచ్చే సందేశం.

# 23. బ్యాంకర్‌గా విజయం:
# కోట్ల డాలర్ల లాభార్జన

షికాగోలోని చిన్న వ్యాపారవేత్త హిరెన్ పటేల్‌ను కలవడం ఉపేంద్రనాథ్ జీవితంలో మరో కీలక మలుపు. భారతదేశంలో బి.ఎస్సి పూర్తి చేసిన పటేల్ ఆ తరువాత అమెరికా వచ్చి షికాగోలో స్థిరపడ్డారు. పెద్దగా పెట్టుబడి లేకుండానే విదేశీ గడ్డపై వ్యాపారం ప్రారంభించారు. దూరదృష్టి, తెలివితేటల కలిగిన చురుకైన వ్యక్తి కావడంతో షికాగోలో భారతీయుల కోసం ఒక దుకాణాన్ని తెరిచారు. భారతీయులకు కావల్సిన అన్ని వస్తువులు లభించేలా తన దుకాణాన్ని తీర్చిదిద్దారు. ఇది నెమ్మదిగా షికాగోలో ఉండే భారతీయులకు కావాల్సినవన్నీ అందించే దుకాణంగా పేరు తెచ్చుకుంది. ఉపేంద్రనాథ్ కూడా తమ కుటుంబానికి అవసరమైన వస్తువులు కొనేందుకు పటేల్ దుకాణానికే వచ్చేవారు. పటేల్‌తో ఉపేంద్రనాథ్‌కు త్వరలో స్నేహం ఏర్పడింది. ఇద్దరి మధ్య రకరకాల విషయాలపై చర్చలు సాగేవి. వైద్యవృత్తిలో బాగా సంపాదించే డాక్టర్లు పెట్టుబడి అవకాశాల కోసం చూస్తున్నారనే విషయాన్ని పటేల్ గుర్తించారు.

"మనం ఎందుకు బ్యాంకు ప్రారంభించకూడదు?" అని ఒక రోజు ఉపేంద్రనాథ్‌ను పటేల్ ప్రశ్నించారు. ఈ మాటలకు డాక్టర్ చాలాఆశ్చర్యపోయారు. తమలో ఎవరికీ బ్యాంకింగ్ రంగంలో అనుభవం లేదని తెలిసి తన స్నేహితుడు అలాంటి ప్రతిపాదన ఎందుకు చేశారో ఆయనకు అర్థం కాలేదు. ఈ ప్రపంచంలో ఏదీ ఉచితం కాదనే విషయాన్ని తన వ్యాపార అనుభవం ద్వారా ఉపేంద్రనాథ్ ఇప్పటికే తెలుసుకున్నారు. ఆలోచనలు కూడా కోట్ల విలువ చేస్తాయి. ఆ సలహాల వెనుక తమ సొంత ఉద్దేశ్యాలేంటో ఎదుటి వ్యక్తులు సూటిగా వ్యక్తం చేయరు కూడా. కానీ, పటేల్ ఉద్దేశ్యాలు ఏంటో చెప్పాలని ఉపేంద్రనాథ్ సూటిగానే ప్రశ్నించారు. అమెరికాలోని బ్యాంకుల నుంచి లోన్ పొందేందుకు భారతీయులు

చాలా ఇక్కట్లు పడుతున్నారని, భారతీయులను అమెరికాలోని బ్యాంకు అధికారులు నమ్మడం లేదని పటేల్ వివరించారు.

తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించని భారతీయులు ఉదంతాలు కొన్ని ఉన్నాయి. కొత్త వ్యాపారాలు ప్రారంభించేందుకు డబ్బు కోసం వెదుకుతున్న భారతీయులు కూడా చాలా మందే ఉన్నారు. చాలా మంది ఇల్లు కట్టుకోవాలనుకుంటున్నారు కానీ డబ్బు సమస్య. పిల్లల చదవుల కోసం డబ్బు అవసరమైన వారు కొందరైతే, తల్లిదండ్రుల వైద్య చికిత్సకు డబ్బు కోసం ఇబ్బందిపడుతున్నవారు మరికొందరు. ఇలాంటి పరిస్థితుల్లో భారతీయుల అవసరాలు తీర్చే బ్యాంకు అవసరం ఏర్పడింది. పటేల్ ఆలోచన ఉపేంద్రనాథ్‌కు నచ్చింది. ఆ ప్రాజెక్టు వివరాలు ఇద్దరు కూలంకషంగా చర్చించారు. నేషనల్ రిపబ్లిక్ బ్యాంక్ ఆఫ్ షికాగో పేరుతో ఇద్దరు కలిసి షికాగోలో బ్యాంకు ఏర్పాటు చేశారు.

అమెరికాలోని భారతీయుల బ్యాంకింగ్ అవసరాలు తీర్చగలమని బ్యాంక్ భరోసా ఇవ్వడంతో చాలా మంది అందులో  ఖాతాలు తెరిచారు. పెద్ద మొత్తాన్ని చాలా మంది సులభంగా రుణం రూపంలో అందుకున్నారు. కొద్ది రోజుల్లోనే బ్యాంక్ బాగా పేరు తెచ్చుకుంది. ఖాతాదారుల సంఖ్య పెరుగుతూనే ఉంది. బ్యాంక్‌కు కూడా లాభాలు రావడం మొదలైంది. అతి స్వల్ప కాలంలోనే అది బిలియన్ డాలర్ బ్యాంక్‌గా మారింది. హిరెన్ పటేల్ వ్యాపార చతురతను ఉపేంద్రనాథ్ మెచ్చుకున్నారు. గుజరాత్‌లో పటేల్‌ల విజయాలు ఆయనకు అర్థమయ్యాయి. వ్యాపార ఆలోచనలతో ఆ సామాజికవర్గం కొంత రిస్క్ తీసుకునేందుకు కూడా సిద్ధంగా ఉంటుంది. పటేల్‌తో స్నేహం కారణంగా అలాంటి తెలివైన వ్యక్తుల గురించి ఉపేంద్రనాథ్ మరిన్ని విషయాలు తెలుసుకోగలిగారు.

కొద్ది కాలంలోనే తెలుగు డాక్టరు, గుజరాతీ వ్యాపారుల పేర్లు షికాగోలో మార్మోగిపోయాయి. అది చూసి అమెరికా అధికారులకు మింగుపడలేదు. వీరి బ్యాంకింగ్ సంస్థపై నిఘా పెంచారు. దాచిపెట్టేందుకు ఏమి లేకపోవడంతో తనిఖీలకు పటేల్, ఉపేంద్రనాథ్ ఏనాడూ అభ్యంతరం తెలపలేదు. అయినా ఆడిట్లు, పారదర్శకత పేరుతో అధికారుల నుంచి వేధింపులు మొదలయ్యాయి. ఆ పరిణామాలతో విసుగుచెందిన ఉపేంద్రనాథ్, బ్యాంకుతో సంబంధాలు తెగతెంపులు చేసుకున్నారు. అమెరికా అధికారులను ఎదిరించి చిక్కుల్లో పడాలనే ఆలోచన ఆయనకు లేదు. దాంతో ఆయన బ్యాంకులో తన వాటా అమ్మి భారీ లాభాలతో బయటకు వచ్చారు.

బ్యాంకింగ్ రంగంలో ఉన్నప్పుడు ఉపేంద్రనాథ్ చాలా విషయాలు నేర్చుకున్నారు.. విదేశాలలో నివసించే భారతీయులు పడే కష్టాలు, ఎదుర్కొనే సమస్యలను తెలుసుకునే అవకాశం ఆయనకు లభించింది. హిరెన్ పటేల్ నుంచి అనేక వ్యాపార మెలకువలు

ఒంటబట్టించుకున్నారు. ఏదైనా వ్యాపార ప్రతిపాదనను తేలిగ్గా తీసుకోకూడదని, వ్యక్తి రూపురేఖలను బట్టి వారి ఆలోచనలను అంచనా వేయకూడదనే గొప్ప విషయం ఉపేంద్రనాథ్‌కు అవగతమైంది. పెద్ద డాక్టరనే గర్వంతో చిన్నవ్యాపారి సలహాను పట్టించుకోక పోయినట్టు అయితే, అమెరికాలో అన్ని కోట్లు సంపాదించడం ఉపేంద్రనాథ్‌కు సాధ్యమయ్యేది కాదు. ఆలోచనకున్న శక్తి ఏంటో పటేల్ ఆయనకు తెలియజెప్పారు.

ఎంతో మంది పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల్లో రాణించిన వ్యక్తులు ఒకస్థాయికి చేరిన తర్వాత తమ విజయరహస్యాలను వెల్లడించేందుకు ఇష్టపడరు. తమ విజయగాథలు ఇతరులతో పంచుకుంటే వారు సులభంగా అందులో రాణించి పైకొస్తారనే భయం ఉంటుంది చాలా మందిలో. అలా చేస్తే తమను ఎవరు గుర్తించరని, ప్రత్యేకంగా ఉండలేమనే ఆలోచనలు వారికి ఉంటాయి. కానీ పారిశ్రామికవేత్తగా తాను నేర్చుకున్న పాఠాలను ఇతరులకు చెప్పేందుకు ఉపేంద్రనాథ్ ఏనాడు సంశయించలేదు. తనకు తెలిసిన విషయాలు ఇతరులతో పంచుకోవాలని భావించారు. విజయానికి దారుల గురించి విన్నంత మాత్రాన, కొన్ని ఉపాయాలు, చిట్కాలు తెలిసినంత మాత్రాన ఎవరూ తమ కలలు సంపూర్ణంగా సాకారం చేసుకోలేరన్నది ఆయన భావన. కలలు సాకారం చేసుకునేందుకు మనస్ఫూర్తిగా కృషి చేసినప్పుడే అది సాధ్యమవుతుంది. ఏవో అద్భుతాలు లేదా అదృష్టం కారణంగా లక్ష్యాలు సాధించవచ్చనే భ్రమలో ప్రజల ఉండకూడదు.

ప్రతి వ్యక్తీ, ముఖ్యంగా వ్యాపార ఆలోచనకలిగిన వారు, మొదట తన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. సాధించగలిగేవిగా ఆ లక్ష్యాలు ఉండాలి.. లక్ష్యాన్ని నిర్ణయించుకున్న తర్వాత ఆ దిశగా ఒకే చిత్తంతో ముందుకు కదలాలి. ప్రత్యామ్నాయ మార్గాలను సూచించే వారు చాలా మంది మనకు తారసపడుతూ ఉంటారు. అవి సరైనవి కావచ్చు, లేదా కొన్ని సందర్భాల్లో సదుద్దేశంతో కూడినవే కావచ్చు. అయినా అలాంటి వారి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మన లక్ష్యం వైపు సాగుతున్న సమయంలో కలిగే ఇబ్బందులు, అడ్డంకుల కారణంగా లేదా ఇతరులు ఏదో సలహా ఇచ్చారనే కారణంగా ఎప్పుడూ మన కలలను విడిచిపెట్టకూడదు. మనకు కావాల్సింది ఎప్పుడూ భయానికి అవతలి వైపు ఉంటుంది. సమస్యలను అధిగమించడం ద్వారా తప్ప దాని చుట్టు తిరగడం ద్వారా ఆ దారికి చేరుకోలేం. జీవితంలో ప్రతీ ఒక్కరూ తమ లక్ష్యమేంటో నిర్ధారించుకొని దాన్ని సాధించేందుకు ధైర్యంగా అటువైపు అడుగులు వేయాలి.

డాక్టరు కావాలని మనం ఎవరినైనా ఎలా బలవంతం చేయలేమో, పారిశ్రామికవేత్తగా మారాలని ఎవరిని కూడా ఒత్తిడి చేయరాదనే మరో పాఠాన్ని ఉపేంద్రనాథ్ నేర్చుకున్నారు. ఏ పని చేయాలన్నా, ఆ కోరిక ఆ వ్యక్తి నుంచే రావాలి. వారిలో ఆ కోరిక లేనప్పుడు వారికి ఏ

పని అప్పగించినా అందులో ఆశించిన ఫలితాలు రావు. పిల్లలకు తల్లిదండ్రులు మార్గనిర్దేశం మాత్రమే చేయాలి. ఓ నిర్ణయానికి సంబంధించి మంచి చెడులు మాత్రమే తెలియజేయాలి తప్ప తమ కోరికలను బలవంతంగా పిల్లలపై రుద్దకూడదు. అది సరైన పద్ధతి కాదు, దాని వలన విజయం సిద్ధించదు.

# 24. పవిత్రకార్యం:
# సాంస్కృతిక విలువల పరిరక్షణ

ఉపేంద్రనాథ్ మొదటిసారి షికాగో వచ్చినప్పుడు అక్కడున్న భారతీయ కుటుంబాలు అరవై మాత్రమే. అందులో తెలుగు కుటుంబాల సంఖ్య ఆరు. కానీ, ఆ తర్వాత కాలం నుంచి అమెరికాకు భారతీయుల రాక పెరిగింది. డెబ్బైవ దశకంలో భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి స్వేచ్ఛా భూభాగంలోకి వలసలు పెరిగాయి. ఉన్నత విద్య కోసం వచ్చేవారు కొందరైతే, ఉద్యోగాలు కోసం వచ్చేవారు మరికొందరు. ఆ సమయంలో నిపుణులైన ఇంజినీర్లు, డాక్టర్ల అవసరం అమెరికాలో బాగా ఉండేది. భారీ స్థాయిలో పరిశోధనలు సాగుతుండేవి, పెద్ద ప్రాజెక్టులు అమలవుతుండేవి. అభివృద్ధిపథంలో వేగంగా నడుస్తున్న దేశమది.

ఉపేంద్రనాథ్ వంటి భారతీయుల విజయాన్ని చూసి ప్రభావితమైన అనేక మంది అమెరికా బాట పట్టారు. ఎనభైవ దశకంలో వందలాది మంది భారతీయులు షికాగో నగరంలో స్థిరపడ్డారు. అమెరికాలోని అనేక ఇతర నగరాలు కూడా చాలా మంది భారతీయులకు ఆవాసాలుగా మారాయి. అనేక మంది భారతీయ డాక్టర్లు, ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బంది, వ్యాపారులు, విద్యార్థులు యూరోప్‌కు తరలివచ్చారు. చదువు కోసం అమెరికా వచ్చిన చాలా మంది అక్కడే మంచి ఉద్యోగాలు దొరకడంతో స్థిరపడిపోయారు. అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాల్లో అనేక మంది భారతీయులు సొంతంగా కంపెనీలు ప్రారంభించారు. ప్రవాసులు పలుచోట్ల వ్యాపారాలు మొదలుపెట్టారు. కొన్నేళ్లలోనే వందలాది భారతీయులు అమెరికా పౌరులుగా మారిపోయారు.

షికాగో నగరంలో భారతీయుల సంఖ్య పెరిగిపోతూనే ఉంది. అమెరికాలోని ఇల్లినాయిస్ రాష్ట్రంలో అతి పెద్ద నగరం షికాగో. న్యూయార్క్, శాన్ ఫ్రాన్సిస్కో నగరాల తర్వాత

అమెరికాలో మూడో అతి పెద్ద నగరం అది. ప్రపంచంలోనే అతి పెద్ద రైల్వే జంక్షన్ కూడా అక్కడ ఉంది. అక్కడ ముప్పైకి పైగా రైల్వే లైన్లు చూడవచ్చు. మిషిగాన్ సరస్సు ఒడ్డున గల ఈ నగంరలో రేవు కూడా ఉంది. ప్రపంచంలోనే అతి పెద్ద జంతువధశాలను ఇక్కడ చూడవచ్చు. అనేక పరిశ్రమలు, కర్మాగారాలు నగరం చుట్టు పక్కల ఉంటాయి. ఇవన్నీ షికాగో నగరాన్ని అమెరికా వాణిజ్య, సాంస్కృతిక రాజధానిగా నిలబెట్టాయి.

న్యూయార్క్ నగరం తర్వాత భారతీయ జనాభా పెద్ద సంఖ్యలో ఉండే రెండో నగరం షికాగో. స్వామి వివేకానంద తన చారిత్రక ప్రసంగాన్ని ప్రపంచానికి కొత్త దిశానిర్దేశం చూపింది ఈ నగరంలోనే. సెప్టెంబర్ 11, 1893లో షికాగో నగరంలో జరిగిన ప్రపంచ ఆధ్యాత్మిక సదస్సులో ఆయన తన అద్భుత ప్రసంగాన్ని అందించారు. ఎంతో ఖ్యాతి గాంచిన ఆ ప్రసంగంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరిగింది. తన ఈ ప్రసంగం ద్వారా భారతదేశ ఔన్నత్యాన్ని స్వామి వివేకానంద ప్రపంచానికి తెలియజెప్పారు. "ప్రపంచానికి సహనాన్ని, సార్వజనీన ఆమోదాన్ని బోధించిన మతానికి చెందినవాడినని చెప్పుకునేందుకు నేను గర్వపడుతున్నాను. సార్వజనీన సహనమే కాదు అన్ని మతాలు సమానమేనని మేము నమ్ముతాం. ఈ భూగోళంలో అన్ని మతాలు, అన్ని దేశాలకు చెందిన హింసకు గురైనవారు, శరణార్థులను ఆశ్రయం ఇచ్చే దేశానికి చెందినవాడినని చెప్పుకునేందుకు నేను గర్వపడతాను. పవిత్ర మందిరాన్ని రోమన్ దౌర్జన్యం విధ్వంసం చేసినప్పుడు తలదాచుకునేందుకు వచ్చిన ఇజ్రాయిల్ శరణార్థులు దక్షిణ భారతదేశానికి వచ్చినప్పుడు వారిని ఆదుకున్న దేశానికి చెందినవాడినని చెప్పుకునేందుకు నేను గర్వపడుతున్నాను. సమున్నత జోరాస్ట్రియన్ దేశపు అంతిమ అవశేషాలను పదిలపరిచి కాపాడుతున్న దేశానికి చెందినవాడినని చెప్పుకునేందుకు నేను గర్వపడతాను" అని వివేకానంద అన్నారు. "రకరకాల ప్రవాహాలకు రకరకాల వనరులు ఉన్నట్టు, రకరకాల మార్గాలు అనుసరించే జనులు విభిన్న ధోరణులు కలిగి ఉన్నట్టుగా అనిపించినా, అవి వక్రంగా, సూటిగా కనిపించినా అవన్నీ ఒకే మార్గానికి దారితీస్తాయి" అనే ఒక గొప్ప కీర్తనను స్వామి వివేకానంద ప్రస్తావించారు.

"సంప్రదాయవాదం, మూర్ఖత్వం, వాటి భయంకరమైన వారసత్వం, మతోన్మాదం వంటివి ఈ అందమైన భూమిని చాలా కాలం పట్టిపీడించాయి. హింసతో ఈ భూగోళాన్ని అతలాకుతలం చేశాయి. చాలాసార్లు దీనిని రక్తంలో ముంచాయి. నాగరికతను నాశనం చేసి మొత్తం దేశాలను నిరాశలో కూరుకుపోయేలా చేశాయి. అలాంటి భయంకరమైన భూతప్రేతాలు లేనట్టు అయితే మానవ సమాజం ఇప్పుడున్నదాని కంటే ఎంతో ముందుండేది. కానీ, ఇప్పుడా సమయం ఆసన్నమైంది, ఈ సమావేశంలో ఉదయం మోగిన గంటానాదం ఇక మతోన్మాదానికి, కత్తి, కలంతో చోటుచేసుకునే హింసకూ ఇదే మరణ

మృదంగం కావాలి” అంటూ తన ప్రసంగాన్ని స్వామి వివేకానంద ముగించారు. షికాగో నగరంలో చేసిన ఈ చారిత్రక ప్రసంగం వివేకానంద జీవితంలో మైలురాయిగా నిలిచిపోయింది. ఆయన గురించి ఎప్పుడూ ఎవరు మాట్లాడినా, ఈ నగరంలో ఆయన చేసిన ప్రసంగ ప్రస్తావన లేకుండా పోదు.

షికాగో నగంరలో భారతీయుల సంఖ్య పెరగడంతో వారు తమ ప్రాంతం, భాషకు అనుగుణంగా చిన్న చిన్న సంఘాలు ఏర్పాటు చేసుకోవడం మొదలుపెట్టారు. తమిళులు, గుజరాతీలు కూడా అదే మార్గాన్ని అనుసరించారు. ఈ సంఘాలు తరుచూ సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండేవి. వీటి ఫలితంగా, అమెరికాలో ఉంటున్న భారతీయులు తమ సంస్కృతి, మతం, ఆచార వ్యవహారాలు మర్చిపోయేవారు కాదు. షికాగోలోని తెలుగు మాట్లాడేవారు “తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ షికాగో” పేరుతో ఓ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 1977లో ఆ సంఘానికి తిరుపతయ్య అధ్యక్షుడిగా ఉన్నారు. షికాగోలో ఒక భవ్యమందిరాన్ని నిర్మిద్దామని ఆయన ప్రతిపాదించారు. తెలుగు మాట్లాడేవారే కాదు, పెద్ద సంఖ్యలో భారతీయులు ఆ ప్రతిపాదనకు మద్దతు తెలిపారు. కానీ, స్థానిక ప్రభుత్వం ఆలయం కట్టేందుకు అనుమతి ఇస్తుందో, లేదోనని చాలా మంది సంశయించారు. కానీ ఆలయ నిర్మాణ విషయంలో ముందుకే వెళ్లాలని ఆ నిర్ణయించిన సంఘం, ఆ మేరకు చట్టాలను అనుసరించి ముందుకు సాగింది. షికాగోలో ఉన్న భారతీయులు “హిందూ టెంపుల్ ఆఫ్ గ్రేటర్ షికాగో” పేరుతో ఒక లాభాపేక్షరహిత సంస్థను నెలకొల్పి మందిర నిర్మాణ ప్రక్రియను చేపట్టారు. గల్లా రామచంద్రనాయుడు, ఉమాపతి, బి.వి.చంద్రశేఖర్ రెడ్డి, సి.నటరాజన్, బి.శేషాద్రి, పి.కృష్ణన్, ఎం.పట్టాభిరామన్, సురేంద్ర గోయల్, అరుణ్ మన్సుఖాని వంటి ప్రముఖులు అందులో కీలక పాత్ర పోషించారు.

ఆ రోజుల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించేవారు. ఈ కార్యక్రమాల ద్వారా చాలా ప్రయోజనాలు ఉండేవి. షికాగోలో స్థిరపడిన భారతీయులు పరస్పరం కలుసుకునేందుకు, ఒకరినొకరు తెలుసుకునేందుకు ఇవి చాలా ఉపయోగకరంగా ఉండేవి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఇవి సాయపడేవి. జూన్ 17, 1984న అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు మందిర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముందుగా విఘ్నేశ్వరుడి ఆలయం, ఆ తర్వాత శ్రీరామచంద్రమూర్తి మందిరాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణానికి చాలా మంది భారతీయులు ఇతోధికంగా విరాళాలు ఇచ్చారు. అంతే కాదు శ్రమదానం కూడా చేశారు.

ఉపేంద్రనాథ్ కుటుంబం ఆలయ నిర్మాణానికి భారీ మొత్తాన్ని విరాళంగా ఇవ్వడమే కాదు, తరచూ ఆ ప్రాంతాన్ని సందర్శించసాగింది. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా వాలంటీర్‌గా కూడా ఉషారాణి ఎన్నో పనులు చేశారు. సేవాగుణం,

అంకితభావాన్ని చూసిన అందరూ 90వ దశకం ప్రారంభంలో “ది హిందూ టెంపుల్ ఆఫ్ గ్రేటర్ షికాగో” అధ్యక్షుడిగా ఉపేంద్రనాథ్‌ను ఎన్నుకున్నారు. ఇతర దాతల సాయంతో ఆలయ అభివృద్ధి కోసం ఆయన ఎంతో శ్రమించారు. నిధుల సమీకరణకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమెరికాలో ఉంటున్న తెలుగు కుటుంబాలకు చెందిన పిల్లలకు తప్పకుండా తమ మాతృభాష చదవడం, రాయడం రావాలని ఆయన కోరుకునేవారు. ప్రత్యేకంగా తెలుగు తరగతులు నిర్వహించారు.

ఉపేంద్రనాథ్‌ది దైవభక్తి, ఆధ్యాత్మిక కలిగిన స్వభావం. జీవితంలో ఎన్ని కష్టాలు, అడ్డంకులు ఎదురైనా దేవుడిపై ఆయన నమ్మకం అచంచలంగా ఉండేది. కానీ తెనాలికి చెందిన  కొంతమంది వామపక్ష, ఆస్తిక, విప్లవభావాలు కలిగిన వ్యక్తుల ప్రభావం చేత మతపరంగా నిర్వహించే కొన్ని అశాస్త్రీయ కార్యక్రమాలను ఆయన తీవ్రంగా తప్పుబట్టేవారు. ఆలయాల్లో ఒక ప్రత్యేకమైన వర్గానికి చెందిన పూజలు నిర్వహించాలన్న వాదనకు ఆయన పూర్తిగా వ్యతిరేకం.  దేవుడు, భక్తుడు మధ్య అనుసంధానానికి ఇతరుల సాయం అవసరం లేదని ఆయన నమ్మేవారు.  మానవ సేవే మాధవ సేవ అని ప్రబలంగా విశ్వసించారు. నేటికి కూడా ఆయన పూజలు, ఆచారాలను స్వయంగా నిర్వహిస్తారు తప్ప ఇతరులపై ఆధారపడరు.

# 25. సంతృప్తి:
# ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ విజయాలు

ఒక దశలో ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ నడుపుతున్న డైరెక్టర్ల మధ్య విభేదాలు తలెత్తాయి. అభిప్రాయభేదాల కారణంగా రెండు వర్గాలుగా విడిపోయారు. పరస్పరం అభియోగాలు చేసుకున్నారు. కొందరు సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే మాటలు వినిపించగా, బంధుప్రీతిని ప్రోత్సాహిస్తున్నారనే ఆరోపణలు చోటుచేసుకున్నాయి. విధి నిర్వహణ, పర్యవేక్షణలో అక్రమాలకు పాల్పడుతున్నారనే అభియోగాలు కూడా కొందరిపై వచ్చాయి. ఆ అపనమ్మకాలు కోర్టుకు వెళ్లే స్థాయికి చేరుకున్నాయి. ఈ వ్యవహారాలన్నీ జనాలకు తెలియడంతో కాలేజీ ఖ్యాతి దెబ్బతింది. ఈ పరిణామాలన్నీ ఉపేంద్రనాథ్‌ను బాగా కలిచివేశాయి.

మొత్తం ముప్పై మంది పెట్టుబడిదారులు ఉండేవారు. ఎవరికి వారికి సొంత ఆలోచనలు, అభిప్రాయాలు, దృక్పథాలు. తన అభిప్రాయమే సహేతుకమైనది భావన ప్రతీ ఒక్కరిది. మంది ఎక్కువైతే మజ్జిగ పల్చన అన్నట్టుగా పరిస్థితి మారింది. అహంభావం వలన కొంత మంది డైరెక్టర్లు సహకరించడం లేదనే వాస్తవాన్ని ఉపేంద్రనాథ్ గుర్తించారు. నచ్చజెప్పేందుకు చాలా ప్రయత్నించారు. చర్చల ద్వారా సందేహాలు, అనుమానాలు నివృత్తి చేసేందుకు డైరెక్టర్లందరినీ ఒక చోటుకు తెచ్చేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించాయి. విద్యార్థుల భవిష్యత్ కోసం, పేదల అభ్యున్నతి కోసం విభేదాలన్నీ పక్కన బెట్టి కలిసి పనిచేయాలని అందరూ నిర్ణయించుకున్నారు. మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల నిర్వహణ ఎవరికి వారు జవాబుదారీగా ఉంటూ పారదర్శకంగా వ్యవహరించేందుకు అంతా ఒక అంగీకారానికి వచ్చారు. దీని తర్వాత ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ మళ్లీ గాడిన పడింది. మెడికల్ కాలేజీ, ఆస్పత్రి నిర్వహిస్తున్న సంస్థకు అధ్యక్షుడిగా ఉపేంద్రనాథ్ ఎన్నికయ్యారు.

కొత్త బాధ్యతలు  చేపట్టిన ఆయన, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీకి గౌరవాన్ని తెచ్చేందుకు దానికి ఖ్యాతి తెచ్చేందుకు తన వంతు సహకారాన్ని అందిస్తున్నారు.

ప్రముఖ ఆస్పత్రిగా గుర్తింపు పొందిన ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో ప్రస్తుతం 750 పడకలున్నాయి. ఇరవై నాలుగు గంటల పాటు రోగులకు చికిత్స అందించేందుకు అక్కడ అనుభవజ్ఞులైన వైద్యులతో పాటు అత్యాధునిక పరికరాలు ఉన్నాయి. లాభాలు అర్జించడం ఆస్పత్రి ఉద్దేశ్యం కాదు కాబట్టి ఇక్కడ చికిత్స కోసం అతి తక్కువ ఫీజులు వసూలు చేస్తారు. అత్యంత తీవ్రమైన వ్యాధులకు చికిత్స అందించేందుకు అత్యాధునిక సదుపాయాలు ఇక్కడ ఉన్నాయి. మంగళగిరి, ఆ చుట్టుపక్కల ప్రాంతాలకు ఈ సంస్థ వరంలా మారింది.

ప్రతీ సంవత్సరం ఎంతో మంది నిపుణులైన డాక్టర్లు ఎన్ఆర్ఐ కాలేజీ నుంచి బయటకు వస్తున్నారు.  ఏటా రెండు వందల మంది విద్యార్థులు ఎంబిబిఎస్ పూర్తి చేసి సమాజానికి నిజాయితీగా సేవ చేసేందుకు వస్తున్నారు. ఇటీవలే డాక్టర్ ఆఫ్ మెడిసిన్, మాస్టర్ ఆఫ్ సర్జరీ వంటి పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులతో పాటు కార్డియాలజీ, క్రిటికల్ కేర్ మెడిసిన్, న్యూరో సర్జరీ, సీటీ సర్జరీ, యూరాలజీ వంటి విభాగాల్లో సూపర్ స్పెషలిటీ కోర్సుల బోధన కూడా ప్రారంభమైంది. అంతే కాదు అనేక పారామెడికల్ కోర్సులను సంస్థ అందిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు దక్షిణ భారతదేశంలోనే అత్యుత్తమ కాలేజీగా గుర్తింపు సాధించింది. ఎన్ఆర్ఐ ఆస్పత్రి, మెడికల్ కాలేజీ సాధిస్తున్న విజయాన్ని చూస్తూ ఉపేంద్రనాథ్ ఉప్పొంగిపోతున్నారు.  తన ఆలోచనకు, తన జీవితంలో సాధించిన అతిపెద్ద విజయాన్ని ఆయన గర్వంగా చూసుకుంటారు. ఎంతైనా సాధించిన విజయాలను బట్టే కదా వ్యక్తికి గుర్తింపు.

# 26. అవగతం:

# అవకాశాలకు అమెరికా నెలవు

ఉపేంద్రనాథ్, ఉషా దంపతుల కుమార్తె మాధవి అమెరికాలో ఆర్థశాస్త్రంలో పట్టభద్రురాలైన తరువాత అక్కడే బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాన్ని చేపట్టింది. అమెరికాకు చెందిన వ్యాపార వేత్త, స్టాక్ మార్కెట్లో పనిచేసే వ్యక్తిని ప్రేమించింది. ఇరు కుటుంబాల ఆమోదంతో వారి ప్రేమ మూడు ముళ్ల బంధంగా మారింది. పెళ్లి తర్వాత మాధవి తన భర్త ఇంటికి వెళ్లారు. ఇప్పుడు తన పిల్లలతో సంతోషంగా ఉన్నారు.

అమెరికాలో ఎప్పటికీ అద్భుతాలు కొనసాగుతూ ఉంటాయన్నది ఉపేంద్రనాథ్ ఆలోచన. అక్కడి తల్లిదండ్రులు వారి పిల్లలకిచ్చే స్వేచ్ఛ ఆయనను బాగా ఆకట్టుకుంది. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎలాంటి ఒత్తిడి పెట్టకపోవడం ఆయన గమనించారు. యువతీ యువకులు తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్టును చదువుకోవడం, వారు కోరుకున్న వృత్తిలోనే కొనసాగడం, తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే విషయంలో వారికున్న స్వేచ్ఛ ఆయనకు ఎంతో నచ్చింది.

భారతదేశంలో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల ఇష్టాలకు వ్యతిరేకంగా తమ కోరికలు, అభిప్రాయాలను బలవంతంగా రుద్దుతున్న తీరును ఉపేంద్రనాథ్ గమనించారు. పిల్లలు వారు ఇష్టపడే రంగంలో కొనసాగేందుకు వారు అనుమతించరు. పిల్లలు విధేయులుగా ఉండాలని, తాము చెప్పినట్లే చేయాలని కోరుకునే వారు ఎక్కువ. వివిధ వృత్తుల్లో సానుకూల అంశాలను చూసి ప్రోత్సహించడానికి బదులు తమ పిల్లలు డాక్టర్లు, ఇంజినీర్లు కావాలని ఒత్తిడి చేసేవారి సంఖ్య అధికం.

మరోవైపు, అమెరికన్లు తమ పిల్లలకు వారు కోరుకున్నట్లుగా జీవించడానికి, జీవితంలో ఎదగడానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తారు. కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తమ

కుమారులు, కుమార్తెలు తమ  వృత్తిలో కొనసాగించాలనే భావన అక్కడి వారిలో ఉండదు.. అమెరికా సంస్కృతిలోని అనేక విషయాలను ఉపేంద్రనాథ్ స్వీకరించారు.

అమెరికా జీవనవిధానంలో ఆయనకు నచ్చిన మరో విషయం అక్కడి ప్రజలు తమ పనిలో చూపించే నిజాయితీ, చిత్తశుద్ధి. అమెరికా పౌరులు తాము చేసే ఉద్యోగాన్ని గౌరవిస్తారు. ఎవరూ తాము చేసే పనిని తక్కువ చేసి చూడకపోవడం ఆయన గమించారు. భారతదేశంలో కొంతవరకు అగ్రకులాల ఆధిపత్యం, కుల వ్యవస్థ కారణంగా శారీరకంగా శ్రమించాల్సిన పనులు, ఎలక్ట్రీషియన్, వడ్రంగి, పారిశుద్ధ్య వంటివి సమాజంలో తక్కువ హోదా ఉద్యోగాలుగా పరిగణించబడుతున్నాయి.

కానీ అమెరికాలో ప్రతీ నైపుణ్యం విలువైనది. ప్రజలు ఒకరినొకరు, వారి పనిని గౌరవంగా చూసుకుంటారు. డాక్టర్, కార్పెంటర్, ఇంజినీర్, ఎలక్ట్రీషియన్, పారిశ్రామికవేత్త, కార్మికుడు, వ్యాపారవేత్త లేదా రైతుతో వ్యవహరించే తీరులో ఏ తేడా ఉండదు. వారంతా తమ కుటుంబం కోసం సంపాదిస్తూ, సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తుంటారు. ప్రతీ ఒక్కరు సమాన గౌరవం పొందుతున్న విషయం ఉపేంద్రనాథ్ దృష్టిని దాటిపోలేదు.

# 27. వేదన:

# బాధాకరమైన వీడ్కోలు

సెలవుల్లో ఓసారి ఉపేంద్రనాథ్, ఉషా జమైకా వెళ్లారు. అక్కడి ఆహ్లాదకరమైన వాతావరణంలో వారెంతో ఆనందం, ఆత్మతృప్తిని పొందారు. కానీ ఉష ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణించింది. తన శరీరం బలహీనంగా మారుతోందని ఆమె గుర్తించారు. రోజురోజుకూ ఆమె ఆరోగ్యం క్షీణించసాగింది.

తన భార్యకు తక్షణ వైద్య సహాయం అవసరమని ఉపేంద్రనాథ్‌కు అర్థమైంది. ఆమెను తిరిగి అమెరికాకు తీసుకువచ్చారు. సిటీ స్కాన్‌లో ఉషారాణి కాలేయంలో కణితి ఉందని తేలింది. కొద్ది రోజుల్లోనే అది శరీరంలోని ఇతర అవయవాలకు వ్యాపించింది. చికిత్స అందిస్తున్నా ఆమె ఆరోగ్యం మరింత దిగజారుతూ పోయింది.

ఉషారాణి అంతకు ముందు కూడా ఓసారి క్యాన్సర్ కణితితో పోరాడారు. 2001లో ఆమె జీర్ణవ్యవస్థలో క్యాన్సర్ కారక కణాలు గుర్తించారు. ఆ వెంటనే వాటిని తొలగించారు. ఆ సర్జరీ అమెరికాలోనే జరిగింది, ఆ కణాలను తొలగించడంలో వైద్య బృందం సఫలమైంది. 2005లో అదే వ్యాధి ఆమెకు తిరగబెట్టింది. ఆ పరీక్షల్లోనూ ఆమెకు క్యాన్సర్ ఉందని తేలింది. వాటిని మరోసారి తొలగించారు. ఈ రెండు సమయాల్లోనూ ఆమె ఏ ఆందోళనకు గురికాలేదు. ఆమె డాక్టర్. మానవ శరీరంలో జరిగే మార్పుల గురించి బాగా తెలుసు. ఆమె మరణానికి భయపడలేదు. వైద్యశాస్త్రంపై ఆమె విశ్వాసం అచంచలం. ప్రతికూల పరిస్థితులలోనూ ఆమెలో ధైర్యం చెక్కుచెదరలేదు. అందరిలాంటి వ్యక్తి కాదు ఆమె, ఆమె యోధురాలు. కానీ మూడోసారి క్యాన్సర్ దాడి చేసేసరికి ఇదే తన చివరి పోరాటమని ఆమె గ్రహించారు. ఆరోగ్యం క్షీణించడంతో ఇక వీడ్కోలు పలకాల్సిన సమయం వచ్చేసిందని గ్రహించారు.

ఉషా పరిస్థితికి కార్సినాలజిస్టును ఉపేంద్రనాథ్ తప్పుబట్టారు. ఆమె కొంతకాలంగా చికిత్స తీసుకుంటోంది. చెకప్‌కు వెళ్లిన ప్రతీసారి ఆమె ఆరోగ్యంగానే ఉన్నారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆ డాక్టరు చెప్తుండే వారు. సిటీ స్కాన్ చేయిస్తే బాగుంటుందని ఈ డాక్టర్ దంపతులు పదేపదే సూచించినా ఆ నిపుణుడు దాన్ని పట్టించుకోకుండా తిరస్కరించేవారు. ఆ డాక్టరు నిర్ణయాన్ని ఉపేంద్రనాథ్ నమ్మారు, కానీ ఆ తర్వాత ఆ నిర్ణయానికి ఎంతో బాధపడ్డారు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించవచ్చని నమ్మారు. ఆరంభ దశలో దాన్ని తొలగించడం సులభం. కానీ ఉషారాణి విషయంలో చాలా ఆలస్యంగా దాన్ని గుర్తించారు. అక్టోబర్ 20, 2018న మేధావి అయిన డాక్టరు ఉషారాణి ఈ లోకాన్ని విడిచిపెట్టారు. సన్నిహిత స్నేహితురాలిగా నిలిచిన జీవిత భాగస్వామిని ఉపేంద్రనాథ్ కోల్పోయారు.

## 28. తుది మజిలీ:
## జీవితం సామాజిక సేవకు అంకితం

ఉపేంద్రనాథ్, ఉష దంపతుల సంసార జీవితం 56 సంవత్సరాలు సాగింది. జీవిత భాగస్వామిని కోల్పోవడం ఉపేంద్రనాథ్‌ను తీవ్ర నిరాశలో ముంచింది. భార్య మరణించిందన్న షాక్ నుంచి పాక్షికంగా కోలుకున్న తరువాత, తన శేషజీవితాన్ని ప్రజలకు సేవ చేస్తూ గడపాలని నిర్ణయించుకున్నారు. రంగరాయ మెడికల్ కాలేజీలో కొత్తగా ఏర్పాటు చేసే స్త్రీల, పిల్లల వార్డుకు ఉపేంద్రనాథ్ ఉదారంగా విరాళం ఇచ్చారు. ఆ భవనానికి ఉషారాణి పేరు పెట్టారు. ఆ కళాశాలలో తాను, తన భార్య చదువుకోవడం, అక్కడే ఆమెను కలుసుకోవడం, తన ప్రేమకు, సంస్థపై ఉన్న గౌరవానికి, ఆ పేరుకు నిదర్శనం. 1977లో రంగరాయ మెడికల్ కాలేజీ నిర్వహణను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంది. 1981లో ఇది పూర్తిస్థాయి ప్రభుత్వ వైద్య కళాశాలగా రూపాంతరం చెందింది.

వృద్ధుల కోసం ఓ ఆశ్రమాన్ని, వీధి బాలల సంక్షేమం కోసం ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించేలా ఆలోచనలో ఉన్నారు. అంతే కాదు ఒడిషా రాజధాని భువనేశ్వర్‌లో తన మేనకోడలు నెలకొల్పిన శ్రీ హస్పిటల్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని భావిస్తున్నారు. తన అనుభవాన్ని ఆ ఆస్పత్రి కోసం అందించాలన్నది ఆయన లక్ష్యం.

ప్రస్తుతం ఉపేంద్రనాథ్ వయస్సు 80 సంవత్సరాలు. వయస్సు పైబడిందని అలసిపోలేదు, రిటైర్మెంట్ ఆలోచనా చేయడం లేదు. ఇప్పటికీ ఆయనలో ఉత్సాహం ఉరకలు వేస్తుంది. తుది శ్వాస వరకు ప్రజలకు సేవ చేయాలన్నది ఆయన సంకల్పం. ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ ద్వారా అద్భుతమైన డాక్టర్లను తయారు చేస్తూ ప్రపంచానికి అందిస్తున్నందుకు, అలాగే లక్షలాది మందికి చికిత్స అందించే భాగ్యం కలిగినందుకు

ఆయనెంతో సంతోషిస్తుంటారు. ప్రస్తుత కోవిడ్ సంక్షోభ సమయంలోనూ కోవిడ్ సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి దీని ద్వారా ఎంతో మందికి చికిత్స అందిస్తున్నారు. అంకితభావం, కష్టపడే తత్వం ఎప్పటికీ అలిసిపోవు, వాటికి విరమణ ఉండదు.